0/7.56.

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

జూలై 1956

సంపుటము 33 : : సంచిక 7

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూలై 1956

అద్వితీయం	శ్రీ బాలగంగాధరతిలక్	...	1
ఋగ్వేదములోని ప్రధాన ఋషులు	శ్రీ రాహుల్ సాంకృత్యాయన్ అనువాదం: శ్రీ వల్లూరి వీర్రాజు	...	2
మొక్కుబడి	శ్రీ యామిజాల పద్మనాభస్వామి	...	12
నాలందా విశ్వవిద్యాలయము	శ్రీ పోతుకూచి శ్రీరామావధాని	...	17
నాతనం	శ్రీ నండూరి వెంకటసుబ్బారావు	...	20
కళావరుజాకీ	శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి		21
సాహిత్యసమీక్ష	శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి	...	33
నీవుపిల్చితివి	శ్రీ సి. నారాయణరెడ్డి	...	47
కుంపటిలో కుసుమం	శ్రీ మధురాంతకం రాజారాం	...	49
వాసిరెడ్డివారి చరిత్ర	శ్రీ వాసిరెడ్డి పార్థసారథి	...	55
చరణదాసులు	శ్రీ పురాణం సూర్యప్రకాశరావు	...	60
శహాజీ ప్రబంధములు	శ్రీ యస్వీ జోగారావు	...	81
కోయిల	శ్రీ రాయప్రోలు సుబ్బారావు	...	88
కలగూరగంప		...	90
గ్రంథ విమర్శనము		...	97

కళావరు జాకీ

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

పాత్రలు

ప్రొఫెసర్ శ్రీ కృష్ణ, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, గోపాలం, శ్రీనివాసులు

★

రంగము: 1

* * నాగేశ్వరరావుగారింటిలోని ముందు గది. వాకిట్లోకి, ఇంట్లో రెండు పాతకాలపు వాకిళ్ళు—నవనాగరిక ప్రపంచంలో సాధారణంగా వో మోస్తరు ధనవంతుల ఇళ్ళలో కని పించే ఏ వస్తువూ ఆ గదిలో వుండకుండాపో లేదు. తెర తొలగినత ర్వాత ప్రేక్షకులకు కన్పించే యిద్దరిలో పండిత శ్రీ కృష్ణ ఏదో గంభీరంగా ఆలోచిస్తుంటాడు. రెండో అతని మొహం, అదే నాగేశ్వరావుది—శుద్ధ బుద్ధావతారంగా కన్పిస్తుంటుంది. చివరకు శ్రీ కృష్ణ ఏదో నిశ్చయపరుచుకున్నట్లుగా తల పంకించి ముందుకు వచ్చి అందరికీ నమస్కరిస్తూ :

శ్రీకృష్ణ: సోదర సోదరీ మణులారా! మీ కోసం, ప్రత్యేకం మీ కోసం, మిస్ రాగిణీదేవి గారిని, కాకినాడనుండి చిన్నటికి చిన్న ఇక్కడకు వచ్చేట్లు ఏర్పాట్లు చేశాం. ఆంధ్రులు, మరీ యీ నగరవాసులు—అందాన్నవలోకించడంలో అశేషమైన అనుభవాన్ని గడించిన వారని తెలిసికొని, స్పెషల్ గా ఒక్కసారి స్టేజిమీద కను పించటానికని చెప్పి, అప్పటికప్పుడు వంద రూపాయలు ఎడ్వాన్సుగా పారేసి మీ అందాల అభిమాన తారలైన మిస్ చంచలాక్షి, మిస్ చకోరాక్షి, మిస్ లలిత, మిస్ సురేఖ, మిస్ రేణుక—వీళ్ళందర్నీ తెప్పించాను. ఇదంతా ఎవరికోసం? మీ కోసం. నాటకరంగంకోసం, కళామతల్లి సేవకోసం—

నాగే : (ఒక్కసారిగా కుర్చీలోనుండి లేస్తూ) అబద్ధం. నూటికి నూరుపాళ్ళ అబద్ధం.

కృష్ణ : ఏమిటండీ నాగేశ్వరరావుగారూ? ఆవేశ పడకండి. ఇదంతా రిహార్సల్. రేపురాత్రి జరగబోయే నాట్య ప్రదర్శనానికి నాందీ ప్రస్తావనండీ యిది!

నాగే : డామిట్! ఎవరో బుజ్జాయమ్మని, అప్పాయమ్మనూ చూపించి, నోరెరుగని అమా యక ప్రజల రక్తాన్ని పీల్చ చూస్తున్నారా? ఘోరం, మోసం—

కృష్ణ : (బాగా దగ్గరగా వస్తూ) చూస్తారూ!

నాగే : ఆఁ—

కృష్ణ : మీరూ—తెలివిగలవాళ్ళే కాని—

నాగే : కానీ యేమిటి?

కృష్ణ : ప్చ్. ఏం లాభం లెండి!

నాగే : (గాభరాగా) చెప్పండీ? ఏమిటి? ఏం జరిగింది?

కృష్ణ : ష్.. తెలివితేటలైతే వున్నాయి కానీ— ఎందుకూ పనికిరాని తెలివితేటలు. ఉత్త యూస్‌లెస్ ఇంటలిజెన్స్, (Useless Intelligence) లోకజ్ఞానం శూన్యంగా కన్పిస్తోంది.

నాగే : శ్రీకృష్ణ గారూ!

కృష్ణ : క్షమించాలి ప్రొఫెసర్ శ్రీకృష్ణ—అనే పండిత శ్రీకృష్ణ—ఆర్టిస్ట్ అండ్ డిరెక్టర్-ది విశాలాంధ్రా ఆర్ట్ సొసైటీ, అంటే ఎంతో సంతోషిస్తాను

నాగే : (సందేహంగా) ప్రొఫెసర్ శ్రీకృష్ణ? ప్రొఫెసర్!

కృష్ణ : ఏం సందేహంగా వుందా? సంశయించకండీ! మనసులో వున్నదేమిటో నిష్కర్షగా బయటపెడితే సాధ్యమైనంతవరకూ సర్దుకో నేందుకు ప్రయత్నిద్దాం.

నాగే : అబ్బే! అహ్హా! ఏమీలేదు మీకా "పండిత" బిరుదం ఎవరిచ్చారో తెలీక—

కృష్ణ : మై గుడ్‌నెస్ దీనికేటండీ అంత బిడియపడ్డారు?

నాగే : తెలీక అడిగినందుకు ఏమీ అనుకోం నే భావిస్తాను

కృష్ణ : అనుకోవడమా? ఇంపాజిబుల్. కళాకారులు విశాలహృదయం అలవర్చుకోవాలన్న సంగతి మర్చిపోతున్నారు మీరు. మనం స్వతంత్ర భారతదేశంలో స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తున్న మనం, ఇంకా సంకుచితాభిప్రాయాలతో పారతంత్ర్య భావాలతో, రాతియుగ మనస్తత్వంతో జీవిస్తే—ఇంకా యెవరండీ యీ ఆధునికయుగంలో పురోగమించామని చెప్పుకోడానికి హక్కుదారులు?

నాగే : క్షమించాలి. నేను కళాకారుణ్ణి కానూ కాదు, నాకు కళాకారుల జీవితంగురించి తెలీనూ తెలీదు.

కృష్ణ : నాన్సెన్స్. తెలియకపోవడమేమిటి? తెలిసి వుండాలి; తెలిసివుండితీరాలి. నేనీమాట మీద ఇంత స్ట్రెస్ ఈయడానికి కారణ మేమిటో తెలుసా?—భారతదేశంలో ప్ర[...] వించిన ప్రతిపురుషుడూ ఒక కళాకారు[...] మాతృదేశ స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తు[...] ప్రతి హిందూ స్త్రీ ఒక కళాభారతి.

నాగే : ఇంతకూ తమ 'ప్రొఫెసర్‌షిప్' గురిం[...] చెప్పారే కాదు.

కృష్ణ : ఓహో! మాటల సందడిలో మరిచేపోయా[...]

నాగే : ఏ విశ్వవిద్యాలయంలో చదువుకున్నారు[...] విశ్వభారతి!

కృష్ణ : (పెద్దగా, విపరీతంగా నవ్వుతూ) అహ్హహ్హ[...] అవును. శంఖులోనుండి వస్తేనే కాని తీర్[...] కాదట విన్నన్ను చెబితేనే కాని వేద మర్[...] కాదట. అహ్హహా చిరుబుగ్గల గులాబికన్నె[...] ఎవరు ప్రసాదించారా వింతసోయగాన్ని[...] ప్రియుల గుండెల్లోకి వెన్నెలబాణాలు విసి[...] రేరాజు కెవరిచ్చారా వింత అందాన్ని[...] ప్రకృతి. నాగేశ్వరరావు గారూ! మానవు[...] లోని విలువను సరియైన ప్రతిఫలాన్నిచ్చే[...] విశ్వవిద్యాలయం కాదు—ప్రపంచం, నీతో[...] కలిసిమెలిసి తిరిగే నీతోటి సహోదరులు.

నాగే : విద్యాలయాల్నింత బొత్తిగా తీసివేయకండి[...] కృష్ణగారూ! కళాప్రపూర్ణుల సంగతి మరచి[...] పోయారా? కవి సమ్రాట్లు మీకు జ్ఞ[...] లేదా?

కృష్ణ : హుఁ! రాలిపోయేందుకు తానికి 'రారమ్మంటూ' స్వాగతం ఇచ్చేవాడొకడే ఇక్కడపాయివా వొకడే ఇక సమ్రాట్టుల సంగతా? ఒక సంగతి చెబుతాను వింటారా? నాదగ్గర డబ్బున్నది మీదగ్గర తెలివితేటలున్నాయి. నేచెప్పినట్లు మీరు వింటారు. మీకు కనకాభిషేకం చేయాలని నాకు బుద్ధిపుట్టింది.

నాగే : నాకా? కనకాభిషేకమా?

కృష్ణ : అహ మీరంటే మీరుకాదు. మాటవరుసకు చెప్పాను.

నాగే : బ్రతికించారు!

కృష్ణ : ఏం? జరగకూడదా? ఏమో ఎవరికి తెలుసు. మీకే కనకాభిషేకం జరిపించమనే యోగం ఉందేమో?

నాగే : నాకా? నాకు!

కృష్ణ : ఆశ్చర్యపడకండి ఎవరికెత ఎల్లావుందో ఎవరికి తెలుసు? బంపరు ఆఫరులో లక్షరూపాయలు చేజిక్కించుకున్న ఆసామీ ఆవార్త విన్న తక్షణం పరలోకానికి పాస్‌పోర్టు తీసుకోవడం లేదూ? అలాగే చెప్పులు కుట్టుకునే ఆసామీకి రాజయోగంపట్టి మహానాయకుడు కావటంలేదా?

నాగే : అంతా వారివారి అదృష్టంఅండీ! ఎవరో ఏమిటో చేశారని మనమూ అలా చేస్తే— తాటాకులు కట్టించుకోటానికి వేరే ఏమీ అక్కర్లా?

కృష్ణ : లోకులు పలుకాకులన్నారండీ. ఎవరో ఏమిటో అన్నారని మనం, మనంచేసేపనులు మానుకుంటామా? మామూలు మీసాల మన కుర్రవాళ్లు వేసుకునే అంచుల చారల అమెరికన్ జాకెట్లను చూచి "మస్టాచ్డ్ బేబీస్" (Mustached babies) అంటూ ఈ అవ వాళ్లంతా ఎగతాళి చేయడంలా? అంత మాత్రాన, మనవాళ్లు, 'అమెరికన్ ఫ్యాషన్'ను దక్షిణ జాకెట్లు తొడుక్కోడం మానుకుంటారా? నెవర్!

నాగే : ఎల్లా వూరుకోవడంలెండి!

కృష్ణ : పర్‌ఫెక్ట్లీ కరెక్ట్! (Perfectly correct) అసలెందుకు వూరుకోవాలని?

నాగే : వూరుకోవడం సంగతి అటుంచండి. అసలదృష్టం వుండవద్దుటండీ?

కృష్ణ : ఉండకేం చేస్తుంది! మహా మహా వాళ్లకే అదృష్టముండగా లేంది మీకు లేక ఎక్కడికి పోతుంది? మీ రాజయోగం చూసి తోటివాళ్లు కళ్లల్లో నిప్పులు పోసుకోనూ పోసుకుంటారు. మీకు కనకాభిషేకం జరిపించుకునే మహాభాగ్యం వుండనే వుంది.

నాగే : అదేమిటి లెండి — బ్రహ్మదేముడు మన ముఖాన రాసి పెట్టి వుండవద్దూ?

కృష్ణ : రాసి పెట్టి వున్నాడో లేదో మీకేం తెలుస్తుంది? తెలిస్తే నాబోటివాడికి తెలియాలి. తెలిసే నాబోటివాడే చెప్పాలి?

నాగే : కొంపతీసి మీకు జ్యోతిష్యంగాని తెలుసు కదా?

కృష్ణ : జీవితానికీ, దీనికీ ఏమాత్రం సంబంధం లేదు; మానవమనస్తత్వపరిశీలన, ఇన్నేళ్లుగా జీవితంలో గడించిన అనుభవం - ఇవే నా కాధారాలు— నే నే జడ్జిమెంట్ పాస్ చెయ్యాలన్నా.

నాగే : (ఆశగా) అంతవరకూ బాగానే వుంది. నిస్సారంగా ఉన్న ఈ జీవనయాత్రలో 'పియూనిస్సు' వుందని చెప్పడానికి నాలో ఏమంత ప్రత్యేకత కనిపించిందని మీకు?

కృష్ణ : పిచ్చివాడా! పల్లకూపువ వున్నా నీకే మోయి ముఖంలో రాజకళ కన్పిస్తున్నది. అణుకణువునా గంభీరత తొణికిసలాడుతోంది. 'షో' అను. వారంరోజుల్లో కనకాభిషేకం చేయించే శాస్త్రత నాది.

నాగే : ....

కృష్ణ : సందేహిస్తున్నావా? మనసులో వున్న దేమిటో మర్మంవిడిచి చెప్పవోయ్.

నాగే : ....

కృష్ణ : ఇన్నేళ్ళొచ్చినా ఇంత సిగ్గయితే ఎల్లాగోయి? సరే, మౌనం అర్ధాంగీకారంగా తీసుకుంటున్నా.

నాగే : ఊఁ!

కృష్ణ : (ప్రేక్షకులకు దగ్గరగా బాగా స్టేజిముందుకు వచ్చి) హుం! నా అతీయతీర్ణం ఇంత వరకూ వ్యర్థపోలేదు.

నాగే : ప్రొఫెసరుగారూ? ఆకాశాని కెత్తేశారు నన్ను.

కృష్ణ : రావుగారూ! ఇంతవరకూ యీ ప్రొఫెసర్ ఆడినమాటా, విసిరిన బాణం గురితప్పలేదు. ఈనాడు మీకు సన్మానం చేస్తానని వాగ్దానం చేసి భీరువులా పారిపోతానను కున్నారా? ఈ దేహంలోని రామచిలుక కన్నుమూసేవరకూ జరగదా పని.

నాగే : ఎందుకనో గానీ నా కా నమ్మకం కల్గడం లేదు.

కృష్ణ : నా నమ్మకం. ఇవాళ కాకపోతే రేపు కలుగుతుంది. ప్రస్తుతానికి మాత్రం నే పాడే పాటకు ప్రక్కతాళం వేస్తుండండి చాలు. ఆపై కార్యక్రమంతా గంధర్వులే తీరుస్తారు.

వాగే : ....

కృష్ణ : బాగుంది. ఇంకా మీ మనసులో చీకటి సందేహాలు గూళ్లు కట్టుకుని అరుస్తూనే వున్నాయన్న మాట! సరే. అయితే నా దారిన నే పోతాను.

వాగే : అది కాదండీ....

కృష్ణ : (కృతకంగా) ఏది కాదు? అక్కడికీ ఇక్కడ ఇటువంటివాళ్ళతో మాట్లాడా లంటే ఎంతో 'పేషన్స్' అలవరచుకుంటున్నాను. అయినా లాభం లేకపోతోంది. మొన్న ఢిల్లీలో......

వాగే : ఆఁ ఆఁ! మొన్న ఢిల్లీలో! ఏమిటి విశేషం?

కృష్ణ : మొన్నటికి మొన్న ఢిల్లీలో ఆలిండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు ఆంధ్ర తరఫున రిప్రజెంట్ చేసింది ఎవరనుకుంటున్నారు? ది విశాలాంధ్రా ఆర్ట్ సొసైటీ! ది ఓన్లీ హోప్ ఆఫ్ ఆంధ్రదేశ్!

వాగే : అలాగా!

కృష్ణ : మమ్మల్నిగురించి మీ రేం తెలుసుకున్నారు? ఆవగింజలో అరభాగం లేదు. మా మ్యూజిక్ పార్టీ వింటే మీ రదిరిపోతారు—వీణ, హార్మోనియం, ఫ్లూట్, వైలెన్, టాప్ వైలెన్, మృదంగం, క్లారినెట్, ట్రంపెట్—ఇవన్నీ మేం వాయిస్తున్నాం. ఒకసారి ఏం జరిగిందో తెలుసా? ఒక ఫిలింకంపెనీ దర్శక నిర్మాత నాదగ్గరకు వచ్చి "డియర్ బ్రదర్! ఇన్ని వాయిద్యాలలో అశేషమైన ఆంధ్ర ప్రజానీకానికి ఆనందానందాన్ని కల్గిస్తున్న నువ్వు, సినీ ఫీల్డులో హైట్ కాకుండా మోడుగచెట్టులా వాడిపోవడం నా కేం నచ్చలేదోయ్. ఎయిట్ థౌసండ్ — అంటే ఎనభై వేలు నీకు అడ్వాన్సుగా ఇచ్చేస్తాను. ఈ కాంట్రాక్టు మీద సంతకం పెట్టు' అన్నాడు. అప్పుడు నే నేం సమాధానమిచ్చా ననుకుంటున్నావు? మౌనంగా కానీ వూరుకుని పేలవమైన ఒక్క చిరునవ్వునవ్వి "థాంక్యూ, సర్! మీ ఆహ్వానానికి వందనాలు. కానీ దాన్ని అంగీకరించలేనందుకు చింతిస్తున్నాను. ప్రేక్షకులతో ప్రత్యక్ష సంబంధం ద్వారా, వివిధాల కళామతల్లి శుశ్రూష చేస్తున్న మేము, ఆ సినీప్రపంచంలో తెరమరుగువీడిలుగా బ్రతకలేము. క్షమించండి" అంటూ బుజంతట్టి పంపించేశాను. దీని కేమంటావు?

వాగే : చేజిక్కించుకున్న అదృష్టాన్ని కాస్తా జారవిడుచుకున్నా రంటాను.

కృష్ణ : అహా అదృష్టాలు. ఇవన్నీ మన కనుసన్నల్లో వేనోయ్! కావాలనుకుంటే కలిసివస్తాయి. లేదనుకుంటే తొలగిస్తాయి. ఈ నాకు నేనే మూడోకన్ను తెరిస్తే, కోటిమంది ప్రొడ్యూసర్లు నీ యింటిముందు క్యూ సిస్టంలో నిలబెట్టలేనూ?

వాగే : అంతదాకా ఎందుకు? కనకాభిషేకం చేయించండి చాలు.

కృష్ణ : కనకాభిషేక మొక్కటే ఏమిటోయి? రత్నాలరాసులే కురిపిస్తాను నీ గడపలో; ఆ! టైమెంతయింది?

వాగే : పది దాటింది.

కృష్ణ : ఛేమ్! కరెక్టు టైముకే వచ్చేశామన్నమాట! లేవండిక భోజనం చేసి మాట్లాడుకుందాం.

వాగే : (గుండెల్లో రాయిపడి) ఆఁ! (కాస్త తమాయించుకుని) క్షమించాలి. మా భోజనాలన్నీ తొమ్మిదింటికే పూర్తి చేసుకుంటాం.

కృష్ణ : దానిదేముంది. ఎవరికెల్లా అలవాటుంటే అల్లాగు; బైదిబై మీకు పిల్లలెంతమంది?

వాగే : (ప్రశ్న ఎందుకో అర్థంకాక) ముగ్గురాడపిల్లలూ, ఒక మగపిల్లవాడూ.

కృష్ణ : జ్యేష్ఠ రత్నం ఆడపిల్లా, కనిష్ఠుడు మగవాడూ కదూ?

వాగే : మీ కెలా తెలుసు?

కృష్ణ : (నవ్వి) మనదేశంలో ఇదోక సంప్రదాయం ఎవరికైనా తీసుకో. ఒక సీజనుమారి ఇంకో సీజను వచ్చేసరికల్లా ఇంట్లో ఆడపిల్ల కూని రాగం ప్రారంభం. ఆః మీ నలుగురూ పిల్లలూ పక్కెక్కలో వుహారేకదూ ?

నాగే : ఔనౌను.

కృష్ణ : కాకపోవడానికి కారణమేదీ ? బహుశా పాతిక, ముప్పై మధ్య వుండివుండవచ్చు మీ వయసు. ఉత్పత్తి ప్రారంభించింది పది హేను, ఇరవై మధ్యకదూ ?

నాగే : (కొద్దిగా సిగ్గుతో వంచిందుకుపోయి) ఔను.

కృష్ణ : అంటే మీ నలుగురు పిల్లలూ, మూడు పూటలా సుష్టుగా భోంచేసేవారన్నమాట.

నాగే : ఊ !!

కృష్ణ : కాబట్టి అతిథిఅభ్యాగతులకోసం కొంత స్థానం వీటలో వుండడం అసంభవమైన విషయ మేమీ కాదుగా !

నాగే : (అర్థం చేసికొని) భగవాన్ !— కానీ, నా కంతగా మనస్కరించడం లేదండీ ప్రొఫెసరు గారూ. అందరూ తిన్నతరువాత పరిశే షాన్ని వడ్డించడం మాకూ అంత శ్రేయస్కరం కాదు.

కృష్ణ : ఇటువంటి చిన్నచిన్న పట్టింపులు నాకు మాత్రం లేవు సుమా ! అయినా అతిథి ఆక లితో వెళ్ళిపోవడం మీకూ అంత మంచిది కాదుగా.

నాగే : అది కాదండీ

కృష్ణ : ఏది కాదు?

నాగే : మా ఆడవాళ్ళు రెండురోజులైంది కాజువల్ లీవు పుచ్చుకుని.

కృష్ణ : అయితే బ్రహ్మాండమైన సదవకాశం లభిం చింది నాకు మా అమ్మగారి తుదిమాట నెఱ వేర్చుకోడానికి.

నాగే : (భయంతో) ఏమిటది ?

కృష్ణ : చనిపోతూ, చనిపోతూ, నన్ను దగ్గిరికి పిలిచి కంటనిండా నీళ్ళు తెచ్చుకుని "బాబూ ! ఎవరైనా ఆకలితో నీ యింటికి వస్తే, ఇంట్లో ఆడవాళ్ళున్నా లేకపోయినా నువ్వే వాళ్ళకు మృష్టాన్నం పెట్టాలి. లేదా నువే వాళ్ళింటికి వెళ్తాలా, అర్ధాకలితో తిరిగి వచ్చి అన్యాయంగా ఆ యింటివాళ్ళకు ఉసురు తగిలించకు" అని (కొంచెం మౌనంగా పూరుకొని, కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకొని) మిందటి కోర్కెను అవలీలగా నెఱవేర్చగలి గాను గానీ, రెండవదానికి మాత్రం ఇంత వరకూ అవకాశం లభించలేదు.

నాగే : (కోపంగా) ఆ కోర్కెను మా యింట్లో నెఱవేర్చదలచుకుంటున్నారా ? వీల్లేదు.

కృష్ణ : వీల్లేదంటే ఎలా ? అది మా అమ్మగారి కడ సపు కోర్కె.

నాగే : (నవ్వుతూ) భలేవారండీ ప్రొఫెసరుగారూ! ఏదో గమ్మత్తుగా అన్నదాన్ని పట్టుకుని ఎంత రభస చేశారు ! ఎంత పట్టుదల గల వారు ! పదండి లోపలకు.

కృష్ణ : (అంతకన్నా పెద్దగా నవ్వుతూ) అహ్హహ్హ! రావుగారూ ! మీ సంగతి మాత్రం నాకు తెలీకుండీ ! పైకి గంభీరమే కాని లోపల అంతా వెన్నపూసేకదూ ? అహ్హహ్హ !!!

రంగము : 2

[ఇద్దరూ నవ్వుకుంటూ లోపలకు వెళతారు. క్షణంసేపు స్టేజి ఖాళీ. ఇంతలో శ్రీనివా సులు ఓ చిన్నపాట ట్యూను చేసుకుంటూ ప్రవేశిస్తాడు.]

శ్రీని : (వచనంలో ప్రారంభించి) లీలా! మైడి యర్ లైలా! (ఒక్కసారిగా భావనా లోకంలోకి వెళ్ళిపోయి)

ఆలపాలన లేని సంద్రం
పాలబుగ్గల చిన్నా జాబీ
అలసి సొలసి ఎగసి పడగా
కిలాకిలా నువు నవ్వుతూ వను
పలకరించేవా? ప్రేయసీ! ప్రేమసలిపేవా?

లీలా! మైడియర్ లైలా ! నీకోసం నీ హృదయంలో స్థానం సంపాదించడంకోసం ఎంతత్యాగం చేశానో అర్థం చేసుకుంటే

ఈ క్షణంలో నా కాళ్లదగ్గర పడిపోయే దానివి. నీ సురుచిర సుందర ముఖపద్మాన్ని వలోకించాలని, బెజవాడ ఉరఫ్ బ్లేజవాడ నుండి ఇంతిదూరం పరుగెత్తుకు వచ్చాను. నీ కల్లని కనుపాపల్లో కనుపించే తీయని ఆ స్వప్నాలకు యథార్థ స్వరూపాన్నివ్వా మని, వదిలిపెట్టేశాను బి.ఏ.-వ కాలేజీని. ప్రొఫెసర్ శ్రీకృష్ణట! ఎవడో వాడు? వాడి కంపెనీలో నువ్వెందుకు పనిచేస్తున్నావు లీలా? ఘటోత్కచుసులా నిన్నెత్తుకు పోడు కదా?

వాగే : (లోపలనుండి ప్రవేశిస్తూ) ఎవరండీ మీరు?

శ్రీని : నేనా? ఒకగంట్రకితంవరకూ బెజవాడ కళాశాల విద్యార్థిని. ప్రస్తుతానికి ప్రొఫెసర్ శ్రీకృష్ణగారి నాటకశాల కంపెనీలో వేషం వెయ్యాలని ఉబలాటపడుతున్న వాణ్ణి.

వాగే : తమ నామధేయం?

శ్రీని : శ్రీనివాసులు!

వాగే : తమరు మా కుటీరాన్ని ఎందుకు పావనం చెయ్యదల్చుకున్నారో తెలుసుకో వచ్చునా?

శ్రీని : ప్రొఫెసరగారిక్కడికి వచ్చారని తెలిసి కాని—

వాగే : ఔనౌను. వచ్చారు.

శ్రీని : అమ్మయ్య. ఎంత చల్లని కబురు చెప్పారు? [దగ్గరనున్న కుర్చీలాక్కుని కూచుంటూ] ఆ మీరూ కూచోండి. అః! తమ నామధేయం సెలవియ్యలేదు—?

వాగే : వాగేశ్వర్రావంటారండి.

శ్రీని : మంచిది. మంచిది. చక్కని పేరు పెట్టారు. శ్లేషకు సరిగ్గా సరిపోతుంది.

వాగే : శ్లేషకు సరిపోవడమేమిటండోయ్?

శ్రీని : ఓహ్! స్టూడెంట్స్ పరిభాషలో మాట్లాడి నందుకు క్షమించండి. శ్లేషకు సరిపోయిందంటే—

వాగే : ఊ!

శ్రీని : మనోఫలకంమీద రూపచిత్రణం అద్భు గుర్తిన్లేర్పడుతుందని భావం.

వాగే : ఏదో లిల్లాయిపని మనుకున్నాను. అటు చేసి యిటుచేసి బ్రహ్మాండమైన అర్థం చెప్పారే!

శ్రీని : నాదేముందండీ! అందరికీ కనిపించేది అ కలాయితనమైనా, నివురుగప్పిన నిప్పులు కదండీ వాళ్ళు.

వాగే : నిజమే మరి.

శ్రీని : సరే గాని—ప్రొఫెసరుగారెం చేస్తున్నారో!

వాగే : నోటికీ, చేతికీ పని కల్పిస్తున్నారు.

శ్రీని : ఎంతసేపవుతుందో!

వాగే : ఏం. వారితో కొంపలు మునిగిపోయే రాచకార్యమేమైనా దర్శించాలా?

శ్రీని : కాకపోతే బెజవాడనుండి ఇంత అర్థాంతరంగా రావలసిన అగత్యం?

వాగే : ఉహూ.

శ్రీని : రేపు రాత్రి భరతనాట్య, గాన, నాటక, వెరైటీ వినోద కార్యక్రమ ముందట!

వాగే : దానికీ, నీకూ సంబంధం?

శ్రీని : స్పెషల్ ఇన్విటేషన్మీద వచ్చానండి వాళ్ల ప్రోగ్రాంలో ప్లేబాక్ పాడటానికి.

వాగే : (సీరియస్ గా) అబ్బాయ్! ఏదో పొరపాటు పడి, మతిచెడి పరుగెత్తుకు వచ్చావు గాని, నే చెప్పిన మాట విని మళ్ళీ వెళ్ళి హాయిగా కాలేజీలో చేరి బుద్ధిమంతుడవై చక్కగా చదువుకో.

శ్రీని : ఏమండోయ్?

వాగే : ఏమిటండోయ్!

శ్రీని : మతిచెడింది నాక్కాదు.

వాగే : అవును కన్పిస్తోనే వుంది.

శ్రీని : డామిట్! గెట్ ఇన్సల్ట్!

వాగే : ఇన్సల్టూ లేదు. ఏమీ లేదు కానీ వచ్చిన దారినే తిరిగి వెళ్లు.

శ్రీని : చూస్తారూ!

నాగే : ఏం మర్యాదగా చెబితే వినరేం? రేపు రాత్రి ప్రోగ్రాం లేదు లేదు. లేదు.

శ్రీని : లేక ఎక్కడికి పోతుంది? ఇదిగో పాంప్లెట్.

నాగే : త్రో ఇట్ ఇన్ ది వేస్ట్ పేపర్ బాస్కెట్. (Throw it in the waste paper basket)

శ్రీని : (కాస్త తగ్గి) రేపురాత్రి ప్రోగ్రాం ఎందుకు లేదూ?

నాగే : అలా అడిగావు బావుంది. ఇల్లా రా చెబుతాను. రేపురాత్రి—అంటే తెలుసుకదూ రేపురాత్రే మనకు అంటే నాకు కనకాభిషేకం జరగబోతున్నది. ఎవరు చేయిస్తున్నారనుకుంటున్నావు? ప్రొఫెసర్ శ్రీ కృష్ణ! అయినప్పుడు నాటకం ఎల్లా వుంటుంది చెప్పు? ఆ వేళంతో పాటు ఆలోచనకూడా కావాలోయ్! ఇంటర్ మీడియట్ లో లాజిక్ కాదల్లే వుంది నీ గ్రూపు.

శ్రీని : కల్ల కాదు. వేయి ప్రోగ్రాం లున్నాసరే ఈ ఐటమ్ కూడా చేర్పితీరాలి. రానీ వారినే అడుగుతాను.

[ప్రొఫెసర్ శ్రీకృష్ణ లోపలినుంచి ప్రవేశం]

కృష్ణ : ఎవరది? ఎవరది? గండుకప్పల్లా కీచులాడుకుంటున్నా రెవరు? (ప్రవేశించి) ఓహ్! ఐయామ్ సారీ! మీరా? ఎందుకిలా పోట్లాడుకుంటున్నారు?

శ్రీని : గురువుగారూ!

నాగే : ప్రొఫెసరుగారూ!

కృష్ణ : వన్ ఎట్ ఏ టైమ్ ప్లీజ్! ఒకరి తరువాత ఒకరు చెప్పండి

శ్రీని : అది కాదండీ రేపు మన ప్రోగ్రాం లేదూ?

కృష్ణ : ఎందుకు లేదూ?

నాగే : మరి నా కనకాభిషేకం?

కృష్ణ : అదీ వుంది!

శ్రీని : రెండూ ఒక్కసారే ఎల్లా వుంటయ్యండీ?

కృష్ణ : ఉండకేం చేస్తాయ్?

నాగే : ప్రొఫెసరుగారూ! మీ రేమనుకుంటున్నారో అందరికీ అర్థమయ్యేలా విడమర్చి చెప్పండి. ఎందుకీ నానుకుబేరాలు?

కృష్ణ : చెప్పమంటారా?

శ్రీని : చెప్పండీ.

కృష్ణ : రేపు ప్రోగ్రాం వుండడానికీ, వుండకపోవడానికీ, కనకాభిషేకం జరగడానికీ, జరక్కపోవడానికీ అంతా మీ చేతుల్లో వుంది!

శ్రీని :
నాగే : } మా చేతుల్లోనా?

కృష్ణ : ఆహా. నిక్షేపంలాంటి మీ చేతుల్లోనే.

నాగే : నా చేతిలో ఏముంది—మన్ను.

కృష్ణ : (ఉస్ఫురింగా) మట్టిబుర్రలు. ఇందుకే మన ఆంధ్రజాతి ఇల్లా అఘోరిస్తోంది. తెలివితేటలు లేవు చాకచక్యం లేదు సూక్ష్మగ్రహణ శక్తి లేదు. కనీసం ప్రపంచంమీద వొక బర్డ్స్ ఐ వ్యూ—అంటే గృధ్రాలోకనమన్నా లేదు వోర్త్ హోల్ లెస్ స్టాక్!

శ్రీని : నిజం. నిజం. బాగా సెలవిచ్చారు.

కృష్ణ : సెలవియ్యడమేమిటి నీ మొహం. ఉన్న యథార్థమంతే.

నాగే : ఔనౌను.

కృష్ణ : ఏమిటి ఔను.

నాగే : ఉన్న యథార్థమంతే.

కృష్ణ : అఘోరించినట్లుంది జవాబు.

శ్రీని : (ఎకసక్కెంగా) ఔనౌను. ఉన్న యథార్థమంతే.

కృష్ణ : ఆఁ! రామాయణంలో పిడకలవేటలాగా మధ్యలో యీ పిట్టకథ యేమిటి? శ్రీనివాసులూ! రేపురాత్రి నీకు ప్రోగ్రాం కావాలికదూ? అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నావా?

శ్రీని : ఆ. ఆ. పూర్తి చేసుకుంటున్నానండి.

కృష్ణ : వెల్—మిస్టర్ నాగేశ్వర్! కనకాభిషేకానికి నువ్వూ సిద్ధంగానే వున్నావు కదూ?

నాగే : ఆహా తమ అనుగ్రహం మామీద ప్రసరిస్తే.

కృష్ణ : మా అనుగ్రహమొక్కటే యేమిటి? ఊళ్లో

అందరి దృష్టులూ మీమీదే పడతాయి రేపుదయానికల్లా ఏం భయపడకండి.

నాగే : భయమా? నాకా! రోజుకు మూడుపార్లు ఆంజనేయదండకం చదువుకుంటున్నాను.

కృష్ణ : ఎందుకైనా మంచిది. ఇంకో మూడుపార్లు ఎక్కువ చదవండి రేపు.

నాగే : అహా!

కృష్ణ : (ఫోనుదగ్గరకు వెళ్లి హాల్లో ఫోర్. సిక్స్, రైట్ ఫైవ్! (కొద్దినిశ్శబ్దం) ఆఁ! సూర్యనారాయణ గారున్నారా? వెల్ కాస్త వారిని పిలుస్తారా? (ఒక్క క్షణం) నాకేనా మాట్లాడుతోంది! అబ్బే ఏమీ లేదూ—మన భరతనాట్య ప్రదర్శనానికి 'ఆనందమహాల్లో' అన్ని ఏర్పాట్లు పూర్తిచేయిస్తున్నాను కానీ— వాడు లేడూ—ఆ త్రాష్టుడు, అదే ఆహాలు ముండావాడు ఎడ్వాన్సు వన్ ఫిఫ్టీ ముందే ఇస్తేకాని హాలు బుక్ చేయనని గొడవచేస్తున్నాట్ట, 'విల్లింతా కొట్టి స్టాండర్డ్స్' అండీ! ఏం చెస్తాం అంతా కర్మ. కళాజీవితానికి నడుం బిగించిన వాడికి రోజులు రోజులుగా లేవండీ. బైదిబై మీకు నేను తెలుసుననుకుంటాను! కలెక్షను రాకముందు మన పాకెట్స్ ఖాళీ అని. అందుకే వొక్క 'టూహండ్రెడ్' పంపిస్తారూ? ఏమంటున్నారూ—మధ్యాహ్నం పట్టుకుని వస్తామంటున్నారా? చూడండీ- ఇది మీ వ్యవహారం కూడా. ఓకే, ఓకే మీ ఇష్టం. ఎల్లా అయితే అల్లా ఆఁ! ఉంటా! (ఫోనుకింద పెట్టేస్తాడు.)

నాగే : ఎవరండీ ఆ సూర్యనారాయణగారు?

కృష్ణ : సూర్యనారాయణగారు తెలీదా? ఆశ్చర్యంగావుంది. లక్షాధికారి. ఎన్నడో పెద్దలు సంపాదించి గుట్టలు గుట్టలుగా పోసిన ఆస్తి —ఖర్చుపెడదా మన్నా ఒక్క వారసుడు కూడా లేకుండా మూల్గుతోన్న ఆస్తి—

శ్రీని : అంత భాగ్యవంతుడా!

కృష్ణ : భాగ్యం! నెలనెలా టెలిగ్రాముమీద రెండొందలు తెప్పించుకునే పరికే కళ్ళు జిగేలుమంటున్నాయి నీకు. రోజుకు కం తక్కువ ఖర్చుపెట్టకూడదని అతని నియమం తెలుసా?

శ్రీని : మైగాడ్!

కృష్ణ : అంతా బాగానే వుంది కానీ వొక్క చిక్కు.

నాగే : ఏమిటది?

కృష్ణ : ఏమీ లేదు. మధ్యాహ్నం వచ్చి డబ్బి నంటున్నాడీయన. క్యాష్ డౌన్ చేస్తేకా వీల్లేదంటున్నాడా హాలు ప్రొప్రైట అదీ యిప్పుడు ముట్టుకున్న గడ్డు సమస్య!

శ్రీని :
నాగే : } (ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంట మౌనం)

కృష్ణ : ఏం? ఒక్కసారిగా అలా మొహాలు వే డేశారు. అసలు సంగతేమిటో తెలుసుకో డోయ్! తర్వాత చావు బ్రతుకులు మన వేలాడుదురు గాని.

శ్రీని :
నాగే : } (నీరసంగా) చెప్పండి.

కృష్ణ : నాగేశ్వరరావుగారూ! ముసుగులో గుద్దు లాటలెందుకు? ప్రస్తుతానికి అర్జంటుగా కనీసం ఓ పచ్చకాయితం కావాలి.

శ్రీని : ఔనౌను, తప్పకుండా కావాలి.

కృష్ణ : మీరూరుకోండి శ్రీనివాసులుగారూ! మీతోనూ తర్వాత మాట్లాడుతాను.

శ్రీని : (గుండెల్లో రాయిపడి) ఆఁ!

కృష్ణ : (ప్రశాంతంగా) ఆఁ (నాగేశ్వరరావుతో) ఆ పచ్చకాయితాన్ని మీరు పూర్తిచేయాలి.

నాగే : నేనా? రామ రామ! పిల్లా జెల్లా గల్గినవాణ్ణి ఏరోజు కారోజు ఎల్లారా భగవంతుడా అని బాధపడుతున్న వాణ్ణి — నాదగ్గర ఎక్కడ దండీ అంత డబ్బు?

కృష్ణ : అహ్హహ్హ! తాడెక్కే వాణ్ణి తలదన్నే వాడుం టాడని మర్చిపోకండి నాగేశ్వరరావు గారూ! పాంటే బజార్, కింగ్స్ వే, కొరిటి పాడు—లక్షోపలక్షలు తిరిగేలారు మీ లాంటి వాళ్లు. హు నాకే కంట తడిపించాలనుకున్నారో!

నాగే : హరి హరీ! ఎంతలేసిమాట లంటున్నారండీ! ఎల్లాగోలా కష్టపడి యిద్దామన్నా ఇవ్వాళ ఫస్టు తారీఖు కాదే! భగవంతుడా!

కృష్ణ : పోనీ ఫిఫ్టీ?

నాగే : నామాట నమ్మండీ!

కృష్ణ : మీమీదున్న ప్రత్యేకాభిమానంచేత మరో మెట్టు క్రిందకు దిగుతున్నాను. కనీసం పాతిక?

నాగే : రూపాయలమాట అటుంచి—

కృష్ణ : (కోపంతో) నాకు తెలుసు. ఇటువంటి మీక్ మెంటాలిటీ వాళ్ళతో సంబంధం పెట్టుకుంటే ఇదే చిక్కు. తెలిసికూడా మీ మీదున్న ప్రత్యేకాభిమానంచేత కొంత వీలు కలుగనిచ్చాను.

నాగే : అంతగా ఆగ్రహిస్తే ఎల్లాగండి!

కృష్ణ : పైపెచ్చు ఇదొకటా? ఆప్తమిత్రుడు కదా అని అష్టకష్టాలు పడైనాసరే కనకాభిషేకం చేయిద్దామనుకున్నాను. ప్చ్. ఏం లాభం?

నాగే : కొంతైనా అవకాశం యిప్పిస్తే—

కృష్ణ : అవకాశం? నా చేతుల్లోవుంటే గదుటయ్యా? సన్మానం జరపాలనుకున్నది నేనేనా?

నాగే : పోనీ ఓవారం పోయింతర్వాత పెటుకో గూడదూ?

కృష్ణ : మైడియర్ బ్రదర్! ఎల్లుండి రాత్రికి హైద్రాబాదు వెళ్తున్నానయ్యా! విశాలాంధ్ర రాజధానిలో మన బ్రాంచికి ప్రారంభోత్సవం చేయించవద్దా?

నాగే : ఈ సంగతి ముందే చెబితే! (నిష్క్రమణ)

కృష్ణ : నువ్వెంత ఇయ్యదల్చుకున్నావు?

శ్రీని : నేనా? నేనెందుకు?

కృష్ణ : ఏం అంత అమాయకుడిలా మాట్లాడుతున్నావు—

శ్రీని : నేను కూడా ఎందుకండీ?

కృష్ణ : ఎందుకా? వేలాది ఆడియన్సులో ముందుకు వచ్చి 'నేనూ ఓ మగవాణ్ణే' అని ధీమాగా చాటుకోబోతున్నందుకు. రొమాంటిక్ హీరోలా కులుకుల నడకతో స్టేజిముందుకు వయ్యారంగా వచ్చి "హా! రాజీవలోచనీ! నా మనోహారిణీ!" అంటూ ఆనవొక్కర రాగంలో ఓ పాటపాడి పేరు ప్రఖ్యాతులు పొందబోతున్నందుకు. వందలాది అభ్యర్థుల్లో నీకు ప్రిఫరెన్సు యిచ్చినందుకు. ఒక్కసారి అలా వెళ్ళిచూడు. ఆడా మగా పిల్లా జెల్లా, చిన్నా పెద్దా అందరూ నా అనుగ్రహంకోసం ఎలా కని పెట్టుకూర్చున్నారో తెలుస్తుంది.

శ్రీని : అలాగా! (కొద్దిగా ఆలోచించి) ఇది వుంచండి. మళ్ళీ తర్వాత చూస్తాను.

కృష్ణ : (పుచ్చుకుంటూ) మంచిది. నీ సంతోషం కొద్దీ ఎంతిస్తే అంతే తీసుకుంటాను. ఆఁ! మా కంపెనీలో లీల తెలుసుకదూ? అదే, మహాగాణిపేటలో వీధిప్రక్కన. వెళ్ళి ఈ ఉత్తరం యిచ్చిరా!

శ్రీని : అలాగే. మళ్ళీ ఎప్పుడు కలుసుకోమంటారు?

కృష్ణ : నేనే వచ్చి నిన్ను కలుసుకుంటాగా! వెళ్ళిరా! (శ్రీనివాసులు వెళ్ళిపోతాడు.)

నాగే : (ప్రవేశిస్తూ) ఇదిగోనండి.

కృష్ణ : శేష్! అడిగినంతా పట్టుకొచ్చావే!

నాగే : మా ఆడవాళ్లు పెట్లో దాచుకున్నారండి.

కృష్ణ : నాకు తెలుసునోయ్! నువ్వుల డబ్బాల్లో, మెంతుల పెట్టెల్లో ఆడవాళ్ళ దాపరికం మన జీతాన్ని మించుతూంటుంది అప్పుడప్పుడు. ఈ మాటలకేంగానీ నీకో పని చెప్తాను చేస్తావూ?

నాగే : అహా.

కృష్ణ : ఏంలేదు. కాన్వాస్ చేసి నాలుగు టికెట్లమ్మ రాదూ?

నాగే : తప్పకుండా.

కృష్ణ : అయితే రేపు మళ్ళీ కలుసుకుంటాను. ఈలోగా నీ పనిలో నువ్వుండు.

నాగే : అలాగే.

కృష్ణ : వస్తా. ఓ. కె. టాటా!

రంగము: 3

[అదే యిల్లు. ఏమీ మార్పు లేదు. అయితే సర్వత్రా పేలవమైన నిశ్శబ్దం.]

గోపా : (ప్రవేశిస్తూ) ఏమిటిది? ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది—బాల్ మాసు డ్యాన్సు అయింతర్వాత ఒక్క క్షణం విశ్రాంతి తీసుకున్నట్లు—కొంపతీసి గురువుగారి ప్రభావం ఇక్కడకూడా వ్యాపించలేదుకదా! వెధవ ట్రాజికల్ సస్పెన్స (Tragical suspense)! ఎంతసేపు వొక్కణ్ణీ యిలా గొంతు చించుకోవాలి. ఇంట్లో అసలు మనుషులనే పదార్థాలున్నారా అని?

సూర్య : (ప్రక్కగదిలోంచి ప్రవేశిస్తూ) అరె! గోపాలం! నువ్వెప్పుడొచ్చావురా? ఏవో కొనుక్కురావాలని మద్రాసు వెళ్ళినట్లున్నావు?

గోపా : మద్రాసులో ఏముందండి—నా మొహం. ఆంధ్రుల మహాప్రస్థానం జరిగింతర్వాత, ప్రియుడు లేని ప్రేయసిలా, చంద్రుడు లేని రాత్రిలా,—

సూర్య : నీ భావకవిత్వం వింటానికి నేనుతప్ప యింకెవరూ దొరకలేదా తమ్ముడూ! వెళ్లి ఓ బేడ కాసు పారేసి ఎవరికైనా యిచ్చి కాఫీ నీళ్ళు పోయించు. హాయిగా వో గంటసేపు నిరాక్షేపణీయంగా ఆ దౌర్భాగ్యుడి నరనరాల్లోకి నీ కవిత్వం ఇంజక్ట్ చేద్దువుగాని వెళ్లు వెళ్లు!

గోపా : సూర్యనారాయణ గారూ?

సూర్య : ఎవరి హద్దుల్లో వాళ్లుండాలి. కాలం, కర్మం కలిసిరాకపోతే నీ బీదతనం నాకు రావచ్చు గాక. కానీ, నా గొప్పతనం, నా దర్జా, ఇవన్నీ వెయ్యేళ్లు తపస్సుచేసినా నీకు వస్తయ్యా అని. అందుకే ఇబ్సెన్ మహాకవి ఏమన్నాడు!

గోపా : నాకు తెలీదు.

సూర్య : నీకు ఒకటి తెలిసిచద్దుకాబట్టి! అదృష్టవశాత్తూ ఆ సంగీతంలో...

గోపా : అదృష్టవశాత్తూ ఏమిటండోయ్! నాలుగేళ్లు నానా గడ్డికరిచి నేర్చుకున్నాను యీ విద్యను. అడ్డమైన వాళ్ల కాళ్లూ పట్టుకున్నాను...... నే నుపయోగిస్తున్న ఇన్ని వాయిద్యాలు నాకు తెలిసినంతవరకూ ఎవ్వరూ ఏ కాలంలోనూ ఉపయోగించ లేదు.

సూర్య : అలాగటోయ్!

గోపా : (బూరలాంటి ఫ్లూట్ నొకదాన్ని చూపిస్తూ) హిందీ సినిమాల్లో సంగీతం అంత బ్రహ్మాండంగా వుండడానికి కారణం యిది; (టాయ్ పియానో చూపిస్తూ) ఇది లండన్లో తయారీ; ఈ ఘటవాయిద్యాన్ని చూశారా. అమెరికానుంచి స్పెషల్ ప్లైన్లో తెప్పించాను; (డమరుకం మోగిస్తూ) శివుని ప్రళయతాండవం అంత ప్రసిద్ధం కావడానికి ఈ డమరుకం...

సూర్య : (పెద్దగా) గోపాలం చెప్పుదెబ్బలు తినకుండా మర్యాదగా ఈ ప్రదేశాన్ని వదిలిపెట్టి వెళ్లు. గిలక్కాయ బూర, కొబ్బరి చిప్పలు, కుండ, గజ్జెలు-ఇవిట్రా నీ వాయిద్యాలు? దరిద్రుడా?

గోపా : అదికాదండీ......

సూర్య : ఏదికాదురా ఫూల్! ముందీ ప్రదేశాన్ని వదిలిపెట్టి వెళ్తావా? తన్నమంటావా?

గోపా : వెళ్తాను. వెళ్లేముందు ఒక్కమాట చెప్పి మరీ వెళ్తాను.

సూర్య : ఏమిటది?

గోపా : మిస్ రాగిణి ఈ ఊరికి రావడంలేదు. నాటకం ఆగిపోయేటట్టుంది!

సూర్య : ఏమిటీ? రాగిణీ! డబ్బు ముందే ఇచ్చేశాంగా!

గోపా : ఆ డబ్బు ఆమెకు చేరలేదు.

సూర్య : చెప్పు గోపాలం. జరిగిందేమిటో చెప్పు. అసలేం జరిగింది? ఇందులో ఏదైనా మోసం? (గోపాలం మొహంలోకి చూసి) అప్పుడే అంత కోపం తెచ్చుకుంటే ఎల్లా గోపాలం! సమయానుకూలంగా రేట్లు మారాలి......

మెదడు కొంచెం వేడిగావున్నప్పుడు మాటలు కొంచెం వేడివేడిగా వస్తుంటాయి.

గోపా : కోపం కాదండీ! పేదవాళ్లం—

సూర్య : పేదవాడివా ? నువ్వా ? 'విద్యయొసగును వినయంబు' వినలేదూ యీమాట. ఇదిగో ప్రస్తుతానికి పదివుంచుకో. అ ఇటుచూడు. ఏదీ ఒక్కనవ్వు. ఆ అల్లా నవ్వాలి. ఇక చెప్పు ఏం జరిగింది?

గోపా : ఏముందీ మీరిచ్చిన యాభైరూపాయలూ తన స్వంతఖర్చుకు జమకట్టుకున్నారు గురువుగారు. పైగా—

సూర్య : పైగా?—!

గోపా : పిట్టను చేజిక్కించుకుని పారిపోవాలను కుంటున్నాడు.

సూర్య : పిట్ట! కొత్తగా పంజరంలో చిక్కిందా?

గోపా : వెల దాటింది.

సూర్య : పేరు రంగు?

గోపా : పంచవన్నెల రామచిలుక. సొగసైన పేరు, లీల!

సూర్య : ఇలా రా. ఒక సంగతి అడుగుతాను నిజం చెబుతావా?

గోపా : నిరాక్షేపణగా.

సూర్య : గురువుగారు తప్ప వేరే గత్యంతరం లేదా నీకు?

గోపా : ఉంటే యీ వ్యాపారంలోకి ఎందుకు దిగుతాను?

సూర్య : ఇంకో ఆధారం దొరికితే?

గోపా : చాలా సంతోషం!

సూర్య : భేష్. ఇట్లా ఈ యాభై వుంచుకో. అర గంటలో ఎక్కడ దాక్కున్నా సరే ఆ దగు ల్బాజీని ఇక్కడికి పట్టుకు రావాలి. సరేనా?

గోపా : ఆహా!

సూర్య : మాట తప్పావా?—

గోపా : మీ యిష్టం.

సూర్య : వెళ్లిరా. (గోపాలం నిష్క్రమణం) హుం. వాళ్లే టోపీ పెట్టాలనుకున్నారు. దొం గల్లో గజదొంగ లుంటారని తెలీదు పాపం!

వాగే : (ప్రవేశిస్తూ) ఏమిటండీ సూర్యనారాయణ గారూ! అలా వున్నారు? వంట్లో బాగా లేదా?

సూర్య : మోసం. పచ్చిమోసం దగా!

వాగే : ఏమిటండీ!

సూర్య : ప్రొఫెసరు గారు—నీకు కనకాభిషేకం చేయిస్తానన్నారు కదూ?

వాగే : ఆఅ. రేపు రాత్రే.

సూర్య : పాపం! వారు చెప్పినమాట విని.

వాగే : ఏమైంది?

సూర్య : కావ్యము కూడా చేశావా?

వాగే : ఆ ఆ.

సూర్య : మంచిది. మరీ మంచిది. కొంచెం కళ్ళు దగ్గర పెట్టుకో. ఎందుకైనా మంచిది.

వాగే : ఏమిటండీ? ఏం జరిగింది?

సూర్య : అంత ప్రమాదం ఏమీ లేదు. కొంతా, కన కాల్ని తీసుకుని ఉడాయించ బోతున్నాడు మీ గురూజీ.

వాగే : ఆఁ!

శ్రీని : (హడావిడిగా ప్రవేశిస్తూ) మునిగిపోయింది. కొంప పూర్తిగా మునిగిపోయింది. నా కొంప నిలువునా దోచేశాడు. దరిద్రుడు. వెనక ఛండాలుడు.

సూర్య : ఎవరీయన?

వాగే : బెజవాడ కాలేజీ విద్యార్థి.

సూర్య : ఇక్కడి కెందుకు వచ్చాడు?

వాగే : నాటకంలో వేషం వేద్దామని వుబలాటపడి—

సూర్య : కాలేజీ వదిలి పెట్టి వచ్చేశాడు. అంతేనా?

శ్రీని : అవునవును.

సూర్య : పిచ్చలేదూ అవ్వడానికి. నిక్షేపంగా అమ్మా నాన్నా డబ్బు పంపిస్తుంటే కాలేజీలో చదివి కూర్చోక ఇదేం పాడు బుద్ధి?

వాగే : కొంప మునిగి పోవడ మేమిటి శ్రీనివాసులూ?

శ్రీని : లీలను వాడు లేవదీసుకు పోతున్నాడండీ!

సూర్య : లీలను వాడు లేవదీసుకు పోతే నీకేమోయి? ఏమైనా—

శ్రీని : (సిగ్గు).

సూర్య : ఓహో! పోలిగాడు. బంగారక్క ప్రణయమున్న మాట! ఇందుకోసమా తండ్రీ కాలేజీ వదిలి పెట్టింది?

శ్రీని : ఈయన ఎవరండీ? శాపాదపీ, శరాదపీ మాట్లాడుతున్నారు.

వాగే : లక్షాధికారి సూర్యనారాయణగారని—

సూర్య : ఆహహోయ్! శ్రీనివాసులూ- నీదగ్గర డబ్బెంత వుంది?

శ్రీని : (ఏడుస్తున్నట్లుగా) ఏముందీ—వున్నదంతా వాడే దోచుకుపోయాడు.

సూర్య : కనీసం రైలుఛార్జీకన్నా—

శ్రీని : (లేదన్నట్లుగా తలూపుతాడు)

సూర్య : నీకు నేను సహాయం చేస్తాను.

శ్రీని : (ఆశగా చూస్తాడు.)

సూర్య : నాకూ నువ్వు ఒక సహాయం చెయ్యాలి.

శ్రీని : ఏం కావాలంటే అది చేస్తాను. అగ్నిలో దూకమన్నా సరే.

సూర్య : ఏం లేదు. ఆ దుర్మార్గుణ్ణి పట్టుకుని రమ్మని గోపాలాన్ని పంపించాను. నీవూ స్టేషనుకు వెళ్ళి వెదుకు. కావాలం
నా పేరు చెప్పి పోలీసు సహాయం తీసుకో
కానీ వాణ్ణిమాత్రం ఈ పొలిమేర దా
నివ్వకు.

శ్రీని : అలాగే.

సూర్య : వెళ్లు. త్వరగా వెళ్లు. (శ్రీనివాసులు వెళ్
పోతాడు) పెద్దవాళ్లం మనమే వాడిచేతుల
కీలు బొమ్మలుగా తయారవుతుంటే ఇ
చిన్న వెధవ లెంత?

వాగే : ఏం చెయ్యాలి? ఎక్కడ పటినా ఇటువం
వాళ్లే. ఎవర్నని నమ్మాలి? ఎవరిని దూరం
వుంచాలి?

సూర : అవునుమరి. పైకి అందరూ పెద్దమనుషులే!

వాగే : ఈ పెద్దమనుషులే జీవితాల్ని నటన క్రిం
తీసుకు బ్రతుకుతున్నారు.

సూర్య : (నవ్వులు) ఇంతమాత్రానికే బెదిరిపో
తమ్ముడూ! ఈ జీవితమే ఒక ఆట - అ
అడుగడుగునా అవరోధం కలిగించేది
కళావరు జాకీలే! మనీలా దగ్గరుంచుకో
గెలవటానికి అవకాశం వుంటుంది. లేదూ

వాగే : తెలుసు. తెలుసు. ఏం జరుగుతుందో!

[తెర.]

సాహిత్య సమీక్ష

శ్రీ అనంతకృష్ణశర్మగారి పరిశీలనము

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

ఇటీవల నేను ప్రకటించిన 'సాహిత్య సమీక్ష' యను వ్యాససంపుటిపై* నభిప్రాయ మొసఁగుచూ, విమర్శకాగ్రేసరులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు నా కోరికమేరకు ఒక గొప్పవిమర్శ వ్రాసి పంపినారు. అందు వారు నా వ్రాతలో దొరలిన ప్రమాదములను, ఎడనెడ వారికి పొడమిన సందేహములను, అభిప్రాయ భేదములనే కాక ఒక కొన్ని శబ్దముల పుట్టుపూర్వములను గురించిన విశేషాంశములను పెక్కు తెలిపియున్నారు. వానిలో కొన్నిటికి నాకు తోచిన సమాధానములు చెప్పికొనుటయు జరిగినది. ఆ యెల్ల విషయములును 'సాహిత్య సమీక్షా' పాఠకులే కాక భాషాప్రియు లెల్లరును గమనించి పరిశీలింపవలసినవే కావున—శ్రీ శర్మగారి యనుమతిమీదనే—వాటి నిచట వెలువరించుచున్నాను.

ఇందు తొలుతటివి శ్రీ శర్మగారి వాక్యములు; పిమ్మటవి నామాటలు.

౧ ఆపద్ద

(పుట. 11) "'ఆపద్ద' యే సరి. ఇందలి తొలి పదము 'ఆ'. ఆవు కాదు. ఇందలి 'వు' ప్రత్యేకముగా వచ్చినది—గోవు వలె. పేయి, రేయి మొదలగు వానిలోని 'యి' ఇటువలె. పాండురంగ మాహాత్మ్యము నందలి 'ఆవెల్వ పద్మనేత్రుకు' (అ. ౧౫.౨)లో ఈ 'ఆ' స్పష్టముగా నున్నదని నా యూహ. 'ఆలను వెలుచునది' యని భావము. కనుక వడలా దిశాదులు రావు. కాని 'ఆవు' కూడ తెలుగులో నిలిచినది. దానిని ప్రాంతాదికముగ చేర్చితిమేని 'ప్రాఁదోఁట' వలె, 'ఆఁబోతు—ఆఁలోఁక' వలె 'ఆఁబద్ద' కూడా సాధువు కాఁగలదు; ఆవు + పద్ద—అని విగ్రహించినప్పుడు కాని అట్లయినా చెవికింపుగాదు, 'ఆపోతు' వలె.— ఆ వెల్వ పద్మనేత్రుకు—'ఆవువదల్వ పద్మనేత్రుకు' (పాండు. 2. 51) అను వాక్యాంతరమునకు రూపాంతరమని నా యభిప్రాయము."

* * *

ఆవులోని 'వు'—గోవు లోని 'వు' వంటిదనుట కంటె, పూవులోని 'వు' వంటిదనుట యొక్కువ సమీచీనమని నా యభిప్రాయము. అప్పుడు 'పూవు'కు 'పూ' వలె — 'ఆవు'కు 'ఆ' రూపాంతరమగుటయు, బ. వ. 'పూలు' అయినట్లు 'ఆలు' అగుటయు సాధ్యమగును. కాని ఆపక్షమున, శ. ర.—"పూ శబ్దమునకును వృత్తియందు ఈ కొంగువకు

* "తమ 'సాహిత్య సమీక్ష' సాంగముగా చదివితిని. ఈ పరిశీలను విలువ వెలుఁగఁగలవారు పలువురు లేరుగదా యని చింతజనించినది. మరి తీవ్రమై గంభీరమైన వ్యాసంగ మేదైనను దాని స్వరూప మింతేగదా యను తత్త్వము నాకు కొంత తెప్పరిలిచ్చినది. తిమది వాదము కాదు; [illegible]. నిష్పక్షపాతు లందరును నిజముగా కన్నుల కొత్తుకొనఁగల వస్తువది."

వలె నుగాగమాది కార్యము కలుగవలెను" అని చెప్పి పూఁగొమ్మ, పూటకిదిము-అను నుదాహరణల నిచ్చియున్నందున ఈ '-' శబ్దమునకును నుగాగమము కలిగి 'అఁబడ్డ' యే కావలసివచ్చును.

ఏమంటే, కరియింది అన్నట్లు—పూఁగొమ్మ, పూయాకిదిము-అనుటకు శాస్త్రము చెప్పెనేమో?

ఇక్కడ ఒక విశేషము — పూ + కొమ్మ = పూఁ గొమ్మ - యగునన్న శ. ర. మే, చేఁదు + త్రాడు = చేఁత్రాడు" అన్నది ఇందు నుగాగమ కార్యము లేదు; అరసున్న యున్నది. 'గీఁక + పెట్టు = గీపెట్టు' అన్నది. ఇందు నుగాగమకార్యమూ లేదు; అరసున్నా లేదు. కాబట్టి లుప్తశేషద్రుతకార్య నియమము బహుళమనియు, శ. ర. ప్రకారమే — అ + పడ్డ (గీపెట్టు - వలె) 'అపడ్డ' కావచ్చుననియు కన్పడుచున్నది. శ. ర. 'గీపెట్టు' అను పదమును నిరను నాస్వాదముగా చూపి, ఉంపులీ కిరణమున "గీఁపెట్టు - ఇది ఇటంకాట యుక్తము" అన్నది. కాని చేఁత్రాడు, గీపెట్టు - అను పదములలో అరసున్నలుంచుట సరి కాదు. ఎందువల్లననగా బా. వ్యా. సంధి. 32వ సూ. ప్రకారము ఆ పదములలోని 'గు' - 'కు' వర్ణములతో పాటు వాటిముందరి అరసున్నలును లోపించును. నుగాగమము లేదు గనుక అచట అరసున్నలు వరల పుట్టవు అందువల్లనే బా. వ్యా. (సంధి 32సూ) 'చేఁదు + త్రాడు = చేఁత్రాడు' అన్న శ. ర. వ్రాత తప్పనియు, చేద + త్రాడు = చేత్రాడు అనుట ఒప్పనియు తీర్మానించెను. ఆ తీర్మానము ప్రకారము- అవు + పడ్డ = అపడ్డ కావచ్చును.

ఇక శ్రీ శర్మగారి మతమునందు 'అ' లుప్త శేషము కాదు. స్వతంత్ర శబ్దము. కావున అపడ్డ యనుట కాక్షేపమే లేదు.

ఇక్కడను ఒక శంక — వారు 'అ' - వే, రేల వంటిదన్నారు. అటువంటితో నుగాగమము కాక పోయినను గ స డ ద వాదేశము వచ్చి వే + కన్ను = వేగంటి; రే + త్రిమ్మరి = రేద్రిమ్మరి; రే + పగలు = రేబగలు అయినట్లు అ + పడ్డ = అబడ్డ కావలదా? అనునది శంక.

అట్లు కానక్కరలేదు; కే + కానుక = కైకానుక; చే + కత్తి = చేకత్తి; వా + తెలు = వాతెలు; మై + తాలువు = మైతాలువు - అయినట్లే అ + పడ్డ 'అపడ్డ' కావచ్చునని ఆ శంకకు సమాధానము.

కాబట్టి శ్రీ శర్మగారన్నట్లు 'అపడ్డ' యే సరి.

— అవాడు నాకు 'అపడ్డ' లోనిది 'అ' యని తెలియదు. తెలియకపోయినను శ్రుతిహితముగా నున్నందున 'అపడ్డ' పాఠమే సాధువన్నాను. కాని ధైర్యము చాలక 'పెద్ద లింకను విచారించి నిర్ణయింతురు గాక' అని వ్రాసికొన్నాను. (మూ పు. 12)

శ్రీ శర్మగారు 'అ' యను రూపమును స్వరూపముగా సాధించి నా వ్రాతకు ప్రాణము పోసినారు. వారికనేక వందనములు.

౨. చారు

(పుట 17) " 'చారు' నా దృష్టిలోను సరియైన రూపము. చేరు, చాఱు, చాఱు కావు. తమాహించి నట్లు ఇది పారిశబ్దికము. కనుక ఇందు శకటరేఫముండ వీలు లేదు. 'చారు' ప్రాకృతము. తమిళము 'శార్' నుండి తెలుగు దేశమునకు వచ్చిన పదము; అర్థము రసము. వేటి కిని తెలుగు వంటలలో చారుకు స్థానము వెలకొనలేదు. అరవ కన్నడ దేశములలో అది లేనిది భోజనమే సాగదు గదా. తెలుగులో ర-జ లకు దంత్యోష్ఠ్య అపవాదము లేనిది కాదు. మరియే విధియు ఎట్టిది గాదు.

* * *

తత్సమములలో శకటరేఫముండ వీలు లేదని గట్టిగా చెప్ప నవకాశము లేదు. (మా. ప్రౌ. వ్యా. సంజ్ఞా. ౯)

సంస్కృత పార శబ్దమునుండి వచ్చినను, తమిళం 'శార్' నుండి వచ్చినను చారు, చాఱు, చేరు, చేఱు అను రూపములలో వేరొకటి యగును గాని 'చేరు' మాత్రము కాదు. అది యిక్కడ ముఖ్యముగా గమనింపవలసిన యంశము.

3. కయ్యము పొడుచు

(పుట 57) "శబ్దముల వ్రతముల గూర్చి తాము చాలా పరిశోధించి వ్రాసితిరి. 'కయ్యముబోడుతు' నకూడదు అను తమ నిషేధవిధికి బలము చాలదని తోచును. తెలుగులో కర్మవాచకము జనమైనప్పుడు ద్వితీయకంటె ప్రథమావిధి క్రియే యొక్కువ రాణిం

ను గదా. 'చెట్లు నెక్కెను' అనుటకంటె (1) 'చెట్టెక్కెను' అనుటయే మన నోటికి సహజమైన పలుకుబడి యైనను. 'ఫలములందెల్ల చిల్కలు భుజింప' (పాండు. వి. ౨౦౮) ఇట్టి ప్రయోగము లెన్నో కలవు కొంత వఱకు సంస్కృతి సంప్రదాయము బలము దీనికి హేతువు గావచ్చును. ఇవి కర్మలు కొన్ని వ్యవహార ప్రాబల్యముచే క్రియాపదముతో అవిభాజ్యముగా అగుచుకొని యుండును గాన అటిచోట్ల ద్వితీయా ప్రయోగము అనెంటిని ఉపేక్షించుటచే అంతగా మనకు రుచింపక పోవచ్చును. కాని 'పోరుచుండు కయ్యము' అని వ్యస్తముగా కూడా ప్రయోగము లున్నప్పుడు 'కయ్యము'-పొడుచు క్రియకు కర్మముగా ఏల గ్రహింపరాదో నాకర్థము కాదు (2) భిన్నముగా నున్నప్పుడు కూడ అది కర్మవాచకము కాదేని— 'పొడుచు నెట్లుఁ బాండుపుత్రులతోఁ గయ్యమేను' అను వాక్యమున 'కయ్యము'ను ఏమిగా గ్రహింప వలయును? కర్మముగా గ్రహించితి మేని-'కయ్యమును బొడుచు' వనఁగూడదు అను మీ విధికి విరోధ మేమి? ఇక్కడ ద్వితీయకంటె ప్రథమయే తెలుగు నుడికారము ననుసరించునది యన్నచో నాకును సమ్మతమే కొన్ని శ. ప. క్రియలలో కర్తృకర్మ వాచకములు అవిభాజ్యములై నిలిచియుండును. లావు చెడు; కనుగొను— ఇత్యాదులలో వ్యవహార బాహుళ్యము దానికి హేతువు. అట్టివానిని విడదీసి కర్తృకర్మ వివక్ష చేయుట అసంప్రదాయకము. అసహ్యము. అంతే. (3) 'వన్నెదిద్ది' ఇత్యాదులలో 'వన్నె'కు కర్మత్వము నశింపదు. మొత్తముమీఁద ఇట్టిచోట్ల శాస్త్రమున కన్న వ్యవహార వివేకము మార్గదర్శి"

* * *

పొడుచు అను క్రియ 'కయ్యము' అను విశేష్యముతో కూడి శబ్దపల్లవమై 'చేయు' అను విలక్షణార్థము నిచ్చుచున్నది. శ. ర. లో—"పొడుచు· అ. క్రి. ఇది కయ్యము, మేడెము అను శబ్దములతోఁ జేరి యిచ్చునప్పుడు చేయు అను నర్థము నిచ్చుచున్నది" అని తెలుపబడి యున్నది కావున చెట్టెక్కుటకును - కయ్యము పొడుచుటకును సామ్యము లేదు.

'బొగ్గలకై కల్పతిగావు పొడుచుటు' అన్నచోట తిరువు కర్మ; పొడుచు (=చెఱచు) క్రియ కావున తిరువు ప్రథమలోను - ద్వితీయలోను ఉండవచ్చును.

'కయ్యము పొడుచు' అను ఏకపద క్రియలోని కయ్యము - కర్మ కాదు; పొడుచు - కయ్యమును పొడుచుంట్టై క్రియ కాదు కావున కయ్యమెప్పటికిని ప్రథమలోనే యుండును.

'పొడుతు నెట్లుఁ బాండుపుత్రులతోఁ గయ్యమేను' అన్నచోట, ఏను, ఎట్లుగఁ బాండుపుత్రులతోఁ గయ్యము పొడుతుఁగ=పోరాడుదును, యుద్ధము చేతును—అని సమన్వయము. పాండుపుత్రులతో, కయ్యమును బొడుతును - అని చెప్పుచో అంతరార్థ ప్రసంగమగును. కయ్యము నేమి? పొడుచుటయేమి?

శ. ప. క్రియలలోని విశేష్యములను కర్మలుగా గ్రహించుచో నేర్పడు అర్థభేదములూ—విపరీతార్థములు కూడా 'కొండచేయు' అను పదముక్రింద (పుట 38) తెలుపబడియే యున్నది. అయినను ఇంకొక్క యుదాహరణము—

"ఎవ్వఁడే యవధాన మెఱుఁగు న యవ్యవధాన
మున వానికించుక ముల్లు నూప"

(వి.క్ర. 1 20)

ముల్లునూపు = అతిశయించు. వానికి ముల్లు నూపక—అంటే వాని నతిశయించుటకు అనియర్థము. ముల్లును కర్మగా తీసికొన్నచో—వాని కేకో యొక ముల్లును చూపించుటయు నే గాని వాని నతిశయించుట కాదు. (తోడు నూపు; పాడినూపు; ఎలుఁగు నూపు; తలనూపు మొదలగు క్రియలన్నియు నిట్టివే)

ఎందుకింక ను విస్తరము: నిఘంటువులు కయ్యము పొడుచు-ముల్లునూపు వంటి క్రియలలోని విశేష్యములనూ—క్రియలనూ వేరు వేరుగా చూపి అర్థము చెప్పియూ, మరల రెంటిని చేర్చి-ఏకపదముగా చూపి అర్థము చెప్పుటకు కారణ మేమో యించుక విచారించినచో ఈ శ. ప. క్రియల తత్త్వ మాకళింపు కాగల దని నా మనవి. ('దూసి' వారి బాల. వ్యాఖ్యానమున

---

(1) చెట్టెక్కు - శ. ప. క్రియ కాదు. అందు చెట్టు - కర్మ; ఎక్కు - క్రియ; (సకర్మకము) 'కయ్యము పొడుచు' శ. ప. క్రియ; ఏకపదము; రూఢము; అకర్మకము—వల్లిపొడుచు, నిటవోడుచు, గరుడపొడుచు, గుఱుపొడుచు, చిఱ్ఱలు వోడుచు - అను క్రియల వంటిది.

శబ్దపల్లవ లక్షణము చక్కగా వివరింపబడియున్నది. (మా. క్రియా ౭౩, ౧౧౮)

మఱియు, ఈ జాతి క్రియలలోని విశేష్యములను కర్మలుగా భావించువారికి హెచ్చరికగా, శ. ర., 'ఒత్తు' క్రింద,—"చిగురొత్తు ఇత్యాదులందలి ఒత్తు ఇందుకు వంటిదని తెలియునది" అనియు, 'చిగురొత్తు' క్రింద—"చిగురొత్తు=చిగురుచు—యవనమునఁ గయ్యపువేడుక, చిగురొత్తె ఇక్కడ చిగురొత్తె అనఁగా పుట్టఁగానని యర్థము" అనియు, "చిత్తము చిగురొత్తె అన్నప్పుడు, చిత్తము అనురక్తము కాఁగా అని యర్థము" అనియు విశదముగా ఒత్తి చెప్పియున్నది.

కావున 'కయ్యము పొసఁగు' అను ఏకపద క్రియలోని కయ్యమును వేఱుపరిచి కర్మయనుట సంప్రదాయము కాదని నా విన్నపము.

(2) శ. ర. ధాతువులలోని పదములు భిన్నములుగా చేకొను. తారుమారుగానున్నను వాటి ధాతుత్వము చెడదనియు, పద సమన్వయమున ఆ రెండు పదములను చేర్చి, ధాతువుగా గ్రహించి అర్థము చెప్పికొనవలెననియు తెలిపి, 'నోరింతకం బెట్టెదరు'—'పట్టెఁ జెలులు'—'జంగిల్ చెందవర్ గొంగ్' ఇత్యాది ప్రయోగము లిచ్చియున్నారు. (పు 586; 588). కావున మరల నిక్కడ వివరింపనక్కరలేదు. అయినను విషయ విస్పష్టతకై యింకొకటి రెండు ప్రయోగములు,—

(1) "చెలులు మాలలుపట్టు సేఁగి మాన్పుచుటన్న
వెనకకే మఱియుఁ గావించె దీవు"
(సిం నార. ౪౫)

చెలులు మాలలుపట్టు సేఁగి—యని గాక, చెలులు పట్టు సేఁగి, మాలలుపట్టు సేఁగి—యని యర్థము. చెలులు పట్టు, మాలలుపట్టు—అను రెండు క్రియలును ఇందు జోకింపబడినవి. చెలులు=చెలులను, మాలలు=మాలలను, పట్టుసేఁగి=పట్టుకొనునట్టి సేఁగి—అని యర్థము చెప్పరాదు.

'చెలులు మాలలు పట్టు' అను ప్రయోగము 'కొందఱు కొమలను చేపట్టుకొను' అను ప్రయోగము వంటిది. (మా పు 29).

(II) "నిద్రదా నెన్నఁడుఁబోఁడు" (భాస్కర సుందర. 302).

ఇందు 'నిద్ర'—'పోఁడు' అను పదములు వ్యస్తములుగానున్నను, ఎన్నఁడున్, నిద్రపోఁడు—అని యర్థము చెప్పవలెనే గాని, నిద్ర=నిద్రను, ఎన్నఁడున్=ఏనాఁడును, పోఁడు—అని చెప్పరాదు.

(III) "తక్కిన నాయకబలమును
లెక్కింపఁ బితామహుండు లేఁడు"
(భాస్కర. యుద్ధ 435).

పితామహుండున్—లెక్కింపలేఁడు—అని యన్వయము

(IV) "ఉగ్రపు మేనుల యాతుధానులొక్కొక్కని మెచ్చవట్టి భటు లుండుదు రొక్కొక వాని వాకిటన్" (,,-,,-16).

ఒక్కొక్క వాని వాకిటన్=వాని ఒక్కొక వాకిటన్—అని అన్వయక్రమము.

ప్రౌఢకవుల రచనలలోని ఇట్టి ప్రయోగవిశేషములను భాషా సంప్రదాయమును గమనించి యన్వయింపవలెనే గాని మాటకు మాటగా అర్థము చెప్ప నొప్పదనియు, 'పాకుడుఁగయ్యము' అని పదములు వెనుక ముందైయున్నను, కయ్యముపొసఁగుట్=యుద్ధము చేయుగును అనియే చెప్పవలెననియు 'పాకుడుఁ గయ్యము' — 'పట్టెఁజెలులు' — 'నోరింతకం బెట్టెదరు' ఇత్యాది వ్యస్తప్రయోగములలోను విశేష్యములు ప్రథమలోనే యుండుటను గమనింపఁదగిన యంశమనియు, 'కయ్యముపొసఁగు' శ. ర. క్రియగావునను—అందలి 'పొసఁగు' అకర్మకముగావునను 'కయ్యము'ను కర్మగా గ్రహించి 'కయ్యముం బొసఁగు' అనుట పొసఁగదనియు సారాంశము

మఱియొక విశేష మేమనఁగా: సకర్మక క్రియలును శబ్దపల్లవములగునపుడు అకర్మకములగుచుండును —

ఉదా—(1) కయ్యమిచ్చు (=సంగరమిచ్చు)=యుద్ధమునకు వచ్చు.
(2) వెన్నిచ్చు=పాఱిపోవు
(3) మొంగమిచ్చు=సమ్ముఖమగు
(4) చెట్టుగట్టు=చెట్టుగా చేర్పడు.
(5) ఎక్కటికట్టు=మానిపుండు మరలగడ్డగా చేర్పడు.

ఇత్యాదులు —

(౩) తెనుగు పలుకుబళ్ళ తెన్నులన్నియు లయ(జా)చిన సుప్రసిద్ధ విమర్శక వరేణ్యులు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు, జయ-గ్రీష్మ 'ప్రతిభ' పత్రికలో 'పలుకుబళ్లు-పదబంధాలు' అను శీర్షిక క్రింద, ఈ శ. ప్రక్రియల స్వరూప స్వభావము లను విశదపరిచి యున్నారు. అంగు, వెనుదఱుచు, వెనుతవులు, వెన్నంటు, వెన్నడించు, వెన్నిచ్చు, వెన్నాడు-అను పదములతో పాటు 'వన్ను దన్ను' కూడా చేరియున్నది ఆవ్యాసము చదివినచో 'వన్ను దన్ను' అను క్రియలోని 'వన్ను' కర్తృయుక్తవో కాదో తెలియగలదు

మరియు,— ఉభిరు బలంబులు పురికొని...అ
త్యుభితములై పోరాడెం
బ్రభువులు వెన్నుదన్ని చూచి"
(భా. ద్రో. 1.౩౮౭)

అన్నచోట, — ప్రభువులు, వెనుదన్ని చూచెన్-వెనుక నిలిచి చూచుచుండగా — అనుట యుచితమో, వెన్నులను త్రిప్పి చూచుచుండగా — అనుట యుచితమో విచారించినను ఈ 'వన్ను దన్ను' క్రియరొక్క తత్త్వము తెలియగలదని నా విన్నపము.

శ. ర. లో— "వన్నుదన్ను (వన్ను + తన్ను) వెనుకనిల్చు, వెంబడించు" అని చెప్పబడియున్నది.

౪ ఉద్దు

(పుట. 107) "ఉద్దు — అనునది ఏకవచన రూపమనుట యుక్తి సహము. అరవమున ఉళుంగు; కన్నడమున ఉద్దు; ఉద్దు. ఆంధ్రదేశమున కన్నడ సామీప్యముగల రాయలసీమలందే దీని వాడుక. ఇది గ్రతి ఇది అర్థము కాని పదము మినుము గదా అక్కడి వాడుక కన్నడమునందు దీని యేకవచన రూపము 'ఉదిన' తెలుగులోను అదే సంక్రమించినదని కొందరు — శ. ర. 'ఉద్దు'ని గ్రహించినది గావున మనము దానినే గ్రహింపవలెనని, 'ఉద్దు' తప్పని చెప్పరాదని నా మతము. శ. ర. లోని శబ్దార్థ వ్యవహారము లెన్నోచోట్ల నేడు మనము సంశయింపవలసి యున్నాము గదా."

* * *

సంగ్రహించుట వల్ల నేగదా యిట్లు దర్శింప వలసివచ్చినది. 'ఉదు' కన్నడ పదమే. కాదన్న దెవరు? శ. ర. గ్రహించిన 'ఉద్దు' తప్పా? ఒప్పా? అన్నది మన కిక్కడ విచారణీయము. "ఉది నేను — ఉద్దిపప్పు అనియే దేశమున వాడుక" అని తెల్పిన యుగాద్యగు పండితుల వ్యాసములను (పు. 109లో) ఉదాహరించియే యున్నాను.

మరియు, తెనుగునను - కన్నడమునను పండితులును, కన్నడ దేశమునకు సమీపమున నున్న తెనుగు సీమవారగు నైన శ్రీ గో. వాసుదేవశాస్త్రి గారు 'ఉద్ది' అనియేగాని 'ఉద్దు' అను వాడుక లేదని స్పష్టముగా వ్రాసియున్నారు. (చూడండి - పండితాభి ప్రాయములలో)

మరియు, మాయింట పనిచేయుచున్న అరవపిల్ల ఇటీవల ఒకనాడు ప్రస్తావవశమున "మినప పప్పును మేము ఉళుంగుపరుప్పు అంటాము; నాటుపురం వాండ్లు-ఉద్దపప్పు అంటారు" అన్నది. నాటుపురం అనగా అరవము తెలియని తెలుగువాండ్లని ఆమె భావము. అది (పేళ్ళవరాలు.)

కావున 'ఉది' తప్పుకాదు; ఒప్పే. తమిళం 'తాగి' పాఠ-అయిన జైకన్నడపు 'ఉద్దు' తెనుగున ఉద్ది అయినదనియు, తెనుగు నిఘంటువు గ్రహించ వలసినది తెనుగు వాడవాడుకలోనున్న పదమునుగాని కన్నడములోని పదమును కాదనియు. శ. ర. గ్రహించిన ఉద్దియే సాధురూపమనియు నా విజ్ఞప్తి.

౫ తీరు - తీఱు

(పుట 133) "తీరు-తీఱు ఈ రెంటికినిగల అర్థభేదము తాత్పర్యమే కాని వేఱుకాదని నా విమర్శ. ఇందలి శకటరేఫము కృత్రిమము. ఇది 'తీరణ' అను ప్రాకృతరూప మూలకము. సంస్కృత 'తిర' ధాతువు కనుక ఇందు బండిఱా సహజము కాదు. ఈ రేఫద్వయము సంప్రదాయమే ద్రావిడ భాషలలో అని చారిత్రము లేకయుండగా క్షిప్తపరచిన దెబ్బయము భాషను వాడు బలియుచున్నది.

* * *

బండిరా భాషలోక పెద్ద బెడదగా నేయున్నది. దానికి పరిష్కార వ్యవస్థయును లేదు. నేకపోయినను

అది యట్లే భాష వంటి పట్టుకొని వచ్చుచునే యున్నది గదా! ఇది విషయాంతరము.

తీగ—తీఁగల కర్తభేదము లేకున్నచో భిన్నార్థములు చెప్పకుండుట మేలు. భిన్నార్థములు చెప్పి విరుద్ధరూపములు చూపుట సరికాదని నా పరామర్శ. అంతే.

౭ ఈర్పెన

(పుట. 158) ఈఁగ + పేను = ఈర్పేన అని మీరు సూచించిన వ్యుత్పత్తి ఇంకను విచారణీయము. ఈర్పెన, దువ్వెన ఈ రెండును, ఈరుఁబాని, దూబాని అని మా ప్రక్క పామర వ్యవహారము. 'తీసి వేయుటకై సాధనము' అను నర్థమును బోధించు దీర్ఘపదమే అంతరించిపోయినదని యూహించుట కష్టము. కాని నేనంతకంటె మంచి వ్యుత్పత్తిని సూచింపలేను — ఈరుఁబాని—దూబాని లోని 'బాని' లేక 'పాని' కి అర్థము కాని మూలము కాని నాకు ఇంకను బుద్ధికి తట్టలేదు.

*   *   *

మా ప్రక్క 'దూబాని' లేదు గాని. ఈరు పేన - ఈఁగుపేను ఉన్నవి. కాలక్రమమున దీర్ఘము హ్రస్వమగుటయు, వర్ణలోప వర్ణాగమాదులును అసహజములు కావు గదా!

ఈరు పేనకు సంబంధించిన నా వ్రాత సరియైనది కాదని శ్రీ సంపత్ గారు (Special Officer Vocabulary research Institute unit, Rajahmandry) తెలిపినట్లు శ్రీ యే. రా. దయాపులు గారు నాకు వ్రాయగా,—ఆయన్యత్ర లేమూహించిన వ్యుత్పత్తి యేమో దయచేసి తెలుపవలసిన—దని శ్రీ వారిని కోరితిని. కాని కారణమేమో ప్రత్యుత్తరము రాలేదు.

ఏమైనను నా వ్రాతలో సత్యము కలదనియే నా నమ్మకము. అందు కాధారమేమనగా: వావిళ్ల నిఘంటువులోను నేను చెప్పిన వ్యుత్పత్తియే యున్నది. ఈ దగ్గర ప్రచురమైన పిమ్మట నేను చూచుట తటస్థించినది. ఎట్టి చేరికయు లేని యిరువురకొక్కటే భావము తట్టినప్పుడు అందు సత్యముండి తీరునని నా యభిప్రాయము. పెద్దలింకను విచారింతురు గాక.

౮ జలపూఁత

(పుట. 165)—(1) జలపూఁత; 'జలపూఁత బంగారు సంసారము' అన్న ప్రయోగము అన్నమాచార్యుని పాటలోనున్నది. ఆ శిల్పములోను 'పోఁత' కంటె 'పూఁత'యే యుక్త మనిపించును—'జలపోఁత'కంటె 'జలపూఁత'యే యెక్కువ న్యాయ్యమని భావింతును. మెలామును పూయుదురు గాని పోయుదురు గదా! అన్నమాచార్యుల పాట రెండు రేకులలోను 'జలపూఁత' అనియే స్పష్టముగా నున్నది. మరి వింత. ఈ రెండు ధాతువులకును మూలమైన దేశ్య ధాతువు 'పుయ్' అనునది కన్నడమున నున్నది. దానికి 'పోఁత' అర్థము కాని 'పూఁత' కాదు. తెలుఁగున రూపభేదము వెంట అర్థభేదము వచ్చినది. ఈ సందర్భమున (2) జలపోసనమును గూర్చి కూడ నా సంశయములు మనవి చేసికొందును. ఇది దేశ్యమన్నది శ. ర.—కాని దాని రూపము చూడగా అది తద్భవముతో దగ్గరయున్నది. 'ఆపోశనము' మూలము గావచ్చును. మరి 'భోజనము'—'ప్రాశనము' కూడ కావచ్చును. ఎట్లును 'పాలు—క్షీరము' అను శ. ర. మొదటి యర్థము ఎట్లు వచ్చినదో విచార్యము. మఱియు శ. ర. చూపిన "ధూప్ర పవగం బోసన మిమ్మ సంకటలెనే" అను భాగవత పద్యమున "ధూప్ర పవగం డోసన మిమ్మ సంకటలెనే" అను పాఠాంతరము కలదు. ఇంక 'యయాతి'లోని 'కెంపు పోసనంబులు దాపనంబులు' అను శ. ర. యుదాహరణము ప్రాస ప్రధానము గనుక దాని కేదో గాణార్థము చెప్పదగును గాన ప్రకరణమును బురస్కరించుకొని 'కాంతి' అను నర్థము అంగే ఇయ్యబడినది. భాగవత ప్రయోగమునకు భోజన మనియు చెప్పవచ్చును. కుస్తీకి ముందు శక్తికై 'దొరకు జెప్పి తిండి పెట్టించుము సలెవా' అను భావము కావచ్చును. లేదా పోషణ శబ్దభవముగా గ్రహించి కుస్తీకి పూర్వ భావిగా మల్లులు చేసికొను 'తయారీ' అను నర్థమైనను చెప్పవచ్చును. అట్లే 'బాపపోసనములు' అను తెన్నాలి కవి ప్రయోగమునకు నట్టి మాటమాత్రమైన భోజనమో - పోషణమో అర్థము కాదగును. (3) ఇక 'పైఁడి జలపోసనపు వీణె'లోని 'జలపోసన' మెట్టి శిల్పమో నేనూహింపలేకున్నాను. ప్రూనితో చేసిన వీణమీఁద బంగారు మెలాము నిలువదు. నేను చూచినంతవరకు బంగారు రేకులను చిత్ర

తిములు గా క త్తిరించి పొదిగింతురు. మరి బంగారు రేకు పనికివచ్చునట్లు ఇంకే యితర లోహముతోను లు చేయరు. చేసినా అది వాని మాధుర్యము లేని గా తిదింతురుగా, కొయ్యల వస్తువుగా మాత్రము నుంచె లదంగే. కనుక పోఁతి-పోసనము రెంటికిని పూఁతియే అర్థము కాఁగలదా? అను సంశయము నాకున్నది. ము విచారింతురు. మన నిఘంటువు లిచ్చు అర్థము న్నో చోల్ల ఊహాల్ , లక్షణాలక్షణగా చేసి న్నవి. వానిని ఇప్పటికిట్లే అంగీకరింపలేముగదా!

* * *

(1) 'జలపోఁతి బంగారు' అను మాటకు పూఁతి బంగారు—అనియే అర్థము. కావున 'జలపోఁతి బంగారు సంసారము' అన్నను అన్నమాచార్యుని పాటలోని శిల్పమున కేటి భంగమును కలుగదు. ముల్లాముని పూయుదురు గాని, పోయరు. ఆ మాట నిజమే; కాని ఆ పూయుటచే జలపోఁతి (=జలపోసనము)—అందురు. అది జాతీయము. జాతీయములకు మాటల యర్థములు రూఢములు. వాటికి అవయవార్థ కల్పనము చేయుట సరికాదు.

'పోయు' ధాతువు 'జల'తో చేరి శబ్దపల్లవమై 'పూయు' అను నర్థము నిచ్చుచున్నది. విలక్షణార్థమిచ్చుటయే గదా శబ్దపల్లవ లక్షణము?

ఈ పోయు ధాతువే 'పోఁగు' అను పదముతో కూడినపుడు 'కుట్టు' అనునర్థము నిచ్చును.

"పోఁగుపోయు = సంతనకై తిన్నగా పోఁగు పాఱించి కుట్టు"—'పోఁగుపోఁతి = పోఁగుపోయుట" (శ. ర.)

మరియు, వాసపోయు - అను క్రియలో 'పోయు' నకు 'పఱచు' అని యర్థము.

"వాసపోయు = వాసాలు పఱచు" (శ. ర.)

అసుపోయు—అను క్రియలో 'పోయు'నకు, నూలుపోగును అ ప్రక్కకు-ఈ ప్రక్కకు 'పాఱించు' అని యర్థము.

కావున 'జలపోఁతి'లోని 'పోఁతి'కి 'పూఁతి' అని యర్థము చెప్పుట తప్పు కాదు; ఒప్పే. ఆ 'పోఁతి'ని 'పూఁతి'గా సవరించుట మాత్రము ఒప్పు కాదు.

జలపూఁతి—అను పదము రాగిరేకులమీద నున్నను—రాతి పలకలమీద నున్నను సాధువు కాదనియే నా యభిప్రాయము.

(2) 'పోసనము = పాలు' అని శ. ర. చెప్పుట కాధారమేమో, నాకును తెలియలేదు. పోసనము తద్భవమగునేమో నేను చెప్పజాలను.

(3) జలపోసనము...పూఁతిపనే గాని రేకులు పొదుగుట కాదని యీ క్రింది ఉదాహరణలవలన నూహింపనగుచున్నది.

(i) పసిఁడి జలపోసనముతోడ నెనక మెసఁగు విపంచికాపను పుణికి కప్పైరఁగరించి" (హర. 5-55)

(ii) పసిఁడి జలపోసనంబుల పావకోళ్ళు" (రాధా మా. 5.145) ఈ పావకోళ్ళమీది—పుణికియమీది జలపోసనము - బంగారు పూఁతికాదు; రేకుల అతికించే పనికొందము...

తలపుబెత్తె (రోముక) పై బంగారు రేకులతుకు పనికి నిలువనగా వీణె కొయ్యపై బంగారుపూఁతి నిలువదా?

మరియు, బంగారు—వెండి పన్నాయిలతో నున్నవిగదా: అవి ముల్లాము చేయబడిన కొయ్యలు కావా? అట్లే బంగరుపూఁతి వీణెయు నెందుకుండరాదు?

ఇంకొక మాట...బంగరు పూఁతి వీణ లోకమున లేకపోవుగాక. కావ్యలోకమున నేల యుండరాదు? ఈశ్వరుని చేతి పుస్తకపు జలపోసనము పట్టించిన అతిలోకశిల్పులు...కవులు మాని వీణకు పట్టింప జాలరా?

కావ్యప్రపంచమున బంగారు చట్టువాలు, బంగారు బొంగరములు, బంగారు కమలములు, బంగారు రెక్కల పక్షులు, బంగారు కొండలు నుండగా... బంగారుపూఁతి వీణయుండుట అబ్బురమా?

"పైపూఁతి రుచిగాక ప్రతిరోమకన్నెంకోయ
లరిది మేగావు తిలయాంకవికిసి" (వసు. 2 42)

ఇందు కిన్నర యను వీణకు వేసిన గుబ్బకాయలు పైన పూసిన బంగారుపూఁతి గలదిగా చెప్పబడినది.

వీణె సొరకాయల కతికిన బంగారుపూఁతి వీణె కతుకదా? ఇట్టి రెండింటికి: బంగరు పూఁతి వేసిన వీణయేకాదు బంగరు వీణయే కలదు. చూడండి—

(a) "ఒకతె యన్నులమిన్నది యొడికి కిన్నరం గాలిఁ
బలుక నింతి దలించి బయాలుమీటు."

(వసు. 4. 75)

"ఉదిగి కిన్నర=శుద్ధ సువర్ణ(మయ)మైన వీణా విశేషము" అని టీక.

(b) "శ్రోత్రములకెంతయు సుధ్యలమగు
పసిడి వీణె కరంబునంబట్టి... వచ్చె నమ్మధుర
వాణి" (రాధామా. 2 50)

(c) "శృంగార కుసుమంబు చిన్ని చుక్కల రాజు
పసిడి కిన్నెరవీణె పలుకుఁదోడు"
(శృం. నై 1 5)

శ్రీనాథాది కవుల మాట యటుండనిండు. 'సంగీత కళారహస్యనిధి' యైన 'కవి' కర్త బంగరు పూఁత వీణెను—బంగరు వీణెనుగూడ చెప్పియుండగా, బంగరు సన్నాయిలు మన కనులయెదుటనే యుండగా, బ్రాంతివీణపై బంగారు మెలాము నిలువదనుటయు, బంగరువీణె నాదమాధుర్యములేని మోటి దండుగయనుటయు న్యాయ్యమగునా?

ఇక్కడ ఒక్క మాట. జలపోసనమునకు శ. ర. జలపోఁత అన్న యర్థ మొక్కటే చెప్పినది గాని దానికి 'జలతారు' అన్న మరియొక యర్థమును కలదు (మా. వాణిజ్య నిఘంటువు)

అంతేకాదు; శ్రీశర్మగారు తెలిపిన—బంగారు రేకు లతికించుట యన్న యర్థమును ఆ పదానికున్నది.

"జలపోసనము—Gilding with gold leaf" (బ్రౌణ్యము) 'పసిడి జలపోసనపు వీణె' అను మాటకు, బంగారు రేకు లతికిన వీణయనియు, బంగారు మెలాము చేసిన వీణయనియును చెప్పవచ్చునన్నది యిక్కడ సారాంశము.

౮ కిన్నర

(పుట 199)—(1) 'కిన్నర' దేవయోని విశేషవాచకము 'కిన్నరి' వీణావాచకము. దీని తద్భవము తెలుగులో 'కిన్నెర.' శ.ర. కారుఁడు గ్రహించిన 'కిన్నరా' శబ్దము నాకెందును గానరాలేదు (2) కిన్నరుల స్వరూపమెట్టిదో మనకు నిశ్చయముగా తెలియదు. గంధర్వ కిన్నరులలో ఎవరు వైణికులో, ఎవరు గాయకులో తెలియుట నాకు సాధ్యము కాలేదు. అయినా 'సప్తరాత్ర ప్రయోగేణ కిన్నర స్వరముచ్యతే' ఇత్యాది వ్యవహారముచే కిన్నరులు కంఠమాధుర్యమునకు పేరైనవారని యూహింపవచ్చును.

(3) 'స్త్రీ కంఠమును పురుషుని కంఠముతో పోల్చుటయు నుచితము కాదు' అన్న సంకేతము సార్వత్రికము కాదు. పురుష గానము విన్న వారందఱు—భిత్తిస్థాంతిరం యది భవే త్సుగతీతి మన్యే' అని స్త్రీ గానముతో పోల్చినాడు. (భాసుని దరిద్రచారుదత్తము కనుక మల్లినాథుని టీకలో అనౌచిత్యము నాకేమియు కానరాదు, (4) స్త్రీగాత్రమునందు తారస్థాయియు పురుష శారీరమందు మంద్ర మధ్యమ స్థాయులును సుగ్రహముగా నుండును. కొందఱు పురుషుల—స్త్రీ దేహాతిశయములలో ఇది విపర్యస్తముగా నుండవచ్చును. కిన్నరజాతివారి శారీరములో ఈ తారధర్మము ఎక్కువగా నుండకూడదా? చేటకిని తక్కువ వారికంటె ఆంగ్రజాతిలో ఈ గాత్రధర్మము ఎక్కువగా నుండుట మనము గమనింపగలము. కిన్నరులలోను స్త్రీ పురుష తారతమ్యము గాత్రములో నుండవలెనని యూహించుట సహజమే కాని అనావశ్యకము మనకొంగును—ఉపమానోపమేయములను ఏమాని లింగములుగా తీసుకొనుటలో కాళిదాసు చాలా శ్రద్ధతీసికొను శిల్పకదా? అతఁడుగూడ ఇందుమతి కంఠమును పోల్చుట యందు కిన్నరకంఠమందలి స్త్రీ పుం భేదములను గమనింపలేదనుట నా మనవి."

* * *

(1) 'ఆప్టేలో, —'కిన్నరా—a kind of lute' అని యున్నది. కాని ప్రయోగము లేదు. మో. వి. 'కిన్నరా—విల్లమ్ము' అని సూచించి 'కిన్నరా'ను (శ. ర. వలెనే) తెచ్చుకున్నది. కాని అది తత్సమము కాదు తత్తే. కిన్నర = కిన్నర వీణ (తంత్రీకట్టు వాద్యభేదము) పాల్కురికి—బసవ(పురాణ)లో, వీణా భేదములలో,—బ్రహ్మవీణ లావణ్యవీణ, కైలాసవీణ, సారంగవీణ మొదలగు వాటితో—'కిన్నరవీణ' యున్నది.

అంతే, (పు 68లో),—

"క్రీడార్థమై మఱి కిన్నరవీణ
వేడుకనొకవాఁడు విడిపింపఁదొడఁగ
... ...
పరపంగఁ గిన్నరి బ్రహ్మయ్యవాఁగ
ధరణిఁ జేసెన్"

అనియు ప్రయుక్తమై యున్నది.

కిన్నరవీణ; కిన్నర బ్రహ్మయ్య—ఇత్యాదిగా సఘటితమై యున్నందున 'కిన్నర' అకారాంతమనియు, 'దర్భ'వలె—ము లోపము నిత్యమై—కిన్నర' గా వ్యవహృతమైనవనియు నా యాశయము.

నా యూహను ప్రాజ్ఞులు మన్నింతురేని, కిన్నరకంఠి=వీణావిశేషమైన కిన్నరయొక్క స్వరమువంటి కంఠస్వరము కలదియే యగును. కిన్నరుని (పురుషని) కంఠస్వరమువంటి కంఠస్వరముకలది కానక్కర నుండదు.

వీణ, 'వీణా'యైనట్లు—కిన్నర—యే 'కిన్నరా' యైనదని చేసుకొందును.

మా. ని. మతమున 'కిన్నర'—కిన్నరాభిధము 'కిన్నర'—కిన్నరీభిధమనుట యుక్తిసహముగా నాకు తోచదు.

(2) కిన్నరుల రూప మెట్టిదైనను స్వరమాధుర్యమున వారికే అగ్రతాంబూలము గంధర్వులు కిన్నరులుకూడా జంత్రగాత్రముల రెంటను ప్రజ్ఞావంతులే యని నీలకంఠవిజయాది కావ్యములు చెప్పుచున్నవి.

(3) స్త్రీ కంఠమును పురుష కంఠముతో పోల్చుట యుచితము కాదని నే నన్నది భిన్న లింగమన్న భావమున కాదు. పురుషకంఠముకంటె స్త్రీ కంఠమే ఎక్కువ కమ్మగా నుండును. అందువలన ఆ పోలిక యుచితము కాదన్నాను. పురుషకంఠము స్త్రీ కంఠమువలె అంత మధురముగా నుండదనుటను పై చారుదత్త వాక్యమే తెలుపుచున్నది.

మరియు నీ సందర్భమున ఈ క్రింది పద్యము గమనింపదగియున్నది.

“స్వరము రాగమ్ము పురుషుల సరణిఁ బోఁదు
మధురిమము పూవుఁ బోణుల మాద్రి నొప్పు
చాటుగా నాగరత్నము పాట విన్నఁ
బురుషుఁడో లేక కాంతయో తెలియకపోదు”

—శ్రీ తిరుపతి వేంకటకవులు.

సందర్భమునకు సరిపడి యుండె నేని భిన్నలింగోపమితి దోషము కాదు.

“ఆ ధృతరాష్ట్రుఁ డావలఁ బిన ట్లలచెక” (భా. ఆది. 6. 169) ఇత్యాది రచనలు కలవు నే నెరుగుదును.

(4) నరజాతిలో వలెనే కిన్నర జాతిలోను స్త్రీపురుష తారతమ్యము గాత్రములో నున్నది—

మేఘసందేశములో ‘త్రిపుర విజయో గీయతే కిన్నరీభిః’ (1. 60) అన్నచోట వేదం-పండితులు—‘కిన్నరీభిః—స్త్రీలను చెప్పుట కంఠస్వారస్యాతిశయము కొఱకు’ అని పదప్రయోజనము చెప్పియున్నారు.

కావున ‘కిన్నరులలోను స్త్రీపురుష తారతమ్యము గాత్రములో నుండవలెనని యూహించుట సహజమే. కాని అవాచ్యమనుకొందును’ అనుట న్యాయ్యముగా నాకు తోచుటలేదు.

‘ఉపమానోపమేయములను సమాన లింగములుగా మార్చుటలో చాలా శ్రద్ధ తీసికొను శిల్పి యయ్యును కాళిదాసు ఇందుమతి కంఠమును పోల్చుటయందు కిన్నర కంఠమందలి స్త్రీ పుం భేదములను గమనింపలే దనుటయు న్యాయ్యమనిపించుట లేదు.

మల్లినాథుని వ్యాఖ్యను సమర్థించుటకై కాళిదాసుని కవితాశిల్పమును వెలితిపరచుట యొప్పదనియు, ‘కిన్నర’ శబ్దమును వీణా పర్యాయముగా సాధించి ఆ మహాకవి శిల్పనైపుణ్యమును కాపాడుట ఉత్తమ పక్షమనియు నా విన్నపము.

కిన్నరా శబ్దమును గూర్చియు, కిన్నరకంఠి యను సమాసమును గూర్చియు మీ యభిప్రాయ మేమని నేను శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారికి వ్రాయగా వారిట్లు బదులు వ్రాసినారు.

“కిన్నరా పదము విలియమ్సు నిఘంటువులో కలదు. వాచస్పత్యములో లేదు. కిన్నరాకంఠి యగును. కిన్నరవంటి కంఠము గలది అని యర్థము వచ్చును. ‘కిన్నర కంఠి’కి ఆ యర్థము రాదు. ‘కిన్నరకంఠి’ అనగా వీణాస్వరమును బోలిన స్వరముగలది అనునది శబ్దార్థము గాక తాత్పర్య రూపముగాఁ గావచ్చును.—కాళిదాసు ఒకవేళ కిన్నరా పదముతోనే సమాసము చేసి, అకారాంతముగా గ్రహించి, ‘కిన్నరకంఠి’ అని ప్రయోగించె నేమో? కుమార సంభవమున “రతిదూతి పదేషు కోకిలాం” అని “దూతీ” పదమునకు హ్రస్వముచేసి (4 16) ప్రయోగించి యున్నాడు గదా! భుజ-భుజా; ఫణ-ఫణా; వ్రీడ-వ్రీడా; బాధ-బాధా; ఊహ-ఊహా మొదలగు పెక్కు శబ్దములు గలవు. కావున అకారాంతమగు వీణార్థము గల కిన్నర శబ్దము అంగీకరింప వచ్చును.

కిన్నరుని కంఠమువంటి కంఠము గలది అను అర్థము కన్నకిన్నరము వంటి కంఠముగల దనుటయే మంచిదని నా యభిప్రాయము.''

౯ చేవెలుఁగు

(పుట. 204) "చేవెలుఁగు ఇందరసున్న గలదా? కంచె, ఆవరణము అను నర్థమున "వెలుఁగు'' నిరనుస్వారము గదా?''

* * *

ఆవరణార్థమున "వెలుఁగు'' నిరనుస్వారమే కావున సూ. వి. చెప్పిన యర్థ మొప్పదు. అప్పుడు నేను గమనింప లేదు. అదియే సరియైన అర్థమన్నాను. ఇప్పుడైనను తిప్పుకొనుటకు నా మనసొప్పుట లేదు. చేవెలుఁగిడి చూచుట యనగా కంటికి చేయొరదేసి చూచుటయే. కావున ఆ వెలుఁగు(=ఆవరణము)లోను అరసున్న యున్నట్లు భావించుట యుచితమేమో? అరసున్న కొరకు పోయిన-అసలర్థమే నిండు సున్న యగు నట్లున్నది. ఇది పెద్దలు చక్కగా విచారించి నిర్ణయింప వలసిన విషయము.

౧౦ ఒడికపుఁ దనసొబగు

(పుట. 209) "ఒడికపుఁ దనసొబగు - అనురూప మాక్షేపించిరి. పుంపులకు పరుష సరళములు పరమగు నప్పుడువచ్చు నుగాగమకార్య మిందేల రాదు? అందుకు ఇందలి "తన'' త్వార్థప్రత్యయము కావలసిన పని లేదు గదా?''

* * *

పుంపులకు పరుష సరళంబులు పరంబగు నపుడు నుగాగమంబగుట సమాసమునను, తనంబు పరంబగు నపుడును - అని మాత్రమే బాల. సంధి. సూ. 25, 35 చెప్పుచున్నవి.

"ఒడికపుఁ దనసొబగు''లోనిది "తన" గాని "తనము" కాదు గనుకను, ఒడికము "సొబగు"కు విశేషణము గాని "తన''కు కాదు గనుకను,-ఒడికపుఁ దన; ఒడికపుఁ దాను - ఇత్యాదిగా సర్వనామముల తోడి సమాసములు నా కెందును కనబడ నందునను, విశేషణ విశేష్యములకు నడుమ మరియొక పదము చేరిన సమాసములను గాని-అట్టిపట్టున జరుగు వ్యాకరణ కార్యమును గాని వ్యాకరణములు తెలుపక పోవుటచేతను అందు నుగామము రాదని నేననుకొన్నాను.

శ్రీ శర్మగారు నన్ను మందలించినపిమ్మట నేను శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారికి వ్రాసికొనగా, వారు "అది 'తనము' కానక్కఱ లేదు. అక్కడ పరుషము పరమైతే నుగామము రావచ్చును. (ఆం. భా. శా. పు. 100, 101) నా మతము ప్రకారము అక్కడ 'నకారాగమము' బహుళము. చేయక పోయినా తప్పులేదు. అంతేకాని 'ఒడికపుఁ దనసొబగు' తప్పనరాదు'' అని దయతో బదులు వ్రాసినారు. పెద్దల శాసనమును శిరసావహించుచున్నాను.

కాని, ఉన్నతపుఁదనమేడ ఉన్నతపుఁ దనవారి మేడ సరసపుఁ దనతివయుని పాట-అనుట సమంజసముగా నా యంతరాత్మ అంగీకరించుట లేదు. కారణము భ్రాంతియే కాబోలు!

ఒడికపుఁదనసొబగు—వంటి యీ క్రింది రచన నా కిటీవల కనబడినది.

"గుత్తపుఁ దను చన్ను గుబ్బల కస్తూరి"
(రాధా మా. 1-113)

౧౧ పంజు

(పుట. 257) "పంజు—ఇది దివిటీ అను నర్థమున 'పాంజు' గా మా ప్రక్క వ్యవహారము. పుంజ శబ్దభవమేమో? కాంతిపుంజ, తేజఃపుంజ శబ్దముల సంగ్రహము గానోపును. కన్నడమున పంజు అనియే కలదు. దివిటీ అను నర్థ మొకటే ఆ భాషలో. తెలుగులో ఎన్నో అర్థాలు. ఇన్ని యెట్లు వచ్చినవి? 'పాలకీ దండెలు' అను నర్థము ఇంకను విచారింపఁ దగును. ప్రకరణమునుబట్టి అర్థమూహించుట సత్సంప్రదాయమైనను దానికి ప్రామాణికత తక్కువ."

* * *

పుంజ శబ్దభవముగా భావింపదగిన 'పుంజెము' అను పద మొకటి యిక్కడ వాడుకలో నున్నది. శ. ర. లోను ఉన్నది. 'పంజు'కూడా పుంజ శబ్దభవమే నన నమ్మ పనునో — పడదో! 'పాంజు' కాంతిపుంజ — తేజః పుంజములకు సంగ్రహ రూపముగా నాకు తోచుటలేదు.

ఆ ప్రక్క 'పంజు'ను 'పాంజు' అన్నట్లే, ఈ ప్రక్క పప్పును 'పాప్పు' అనుటయు, పగడమును 'పాగడము' అనుటయు పామరసంఘమున కలదు. కాని ఆ వ్యవహారము శబ్ద స్వరూప నిరూపణాదుల కెంతవరకు పనికివచ్చునో!

తెనుగున 'పాంజు' అను విశేష్యము లేదు గాని, క్రియయున్నది.

"పాంజు=పోఁజు" (శ. ర.)

'పంజు'కుగల అర్థాలన్నియు లోకమునుండే వచ్చినవని నా మనవి.

శబ్దసిద్ధికిని—అర్థసిద్ధికిని లోకమేగదా ఆధారము?

౧౨ దునియు

(పుట. 275) "దునియు — అను ప్రత్యేక ధాతు వున్నదని నేననుకోను. దున్ను—దును గా ఉచ్చారణ లాఘవమున మారును. అప్పుడు దుని యెదవు—దునియెదవు—అను రూపము సహజముగా నేర్పడును."

* * *

'దునియు' ప్రత్యేక ధాతువుగా నేను భావించుట ముమ్మాటికిని తప్పే. ఆ తప్పు, శ్రీ శర్మగారి వాక్యము చదువువరకును నా మనసునకు రాలేదు. తప్పును తెలియజెప్పినందుకు వారి కనేక కృతజ్ఞతా వందనములు.

౧౩ అధమనము

"పుట. 311 లో — 'దావాధమన వినిమయ విక్రయాదులు' అన్న వాక్యమున్నది. ఇందలి రెండవ శబ్ద మేది? దాని యర్థమేమి? 'దావా...విక్రయ' ఇత్యాది వ్యవహారము విచిత్రముగా నున్నది. అధమనము అధానము కావచ్చును. దాని రూపాంతరములే అధి; ఆహి మనలో కలవుగదా. లేదా అధమర్ణ శబ్దము దాని మూలమా? రూపసామీప్య మున్నది గాని అర్థము చాల డొంకతిరుగుడుగా నుండును.

* * *

గుంటూరు మండలములో విక్రయ దస్తావేజులలో—'ఈ భూమిని దావాధమన వినిమయ విక్రయాది సర్వహక్కులతో నీ వనుభవించవలసినది' అని వ్రాయుటకలదు. నే నా సమాసము నట్లే గ్రంథమున కెక్కించినాను. అధమన మనగా తాకట్టు పెట్టుట యని నా చిన్ననాటి వినికి. అంతేగాని ఆ శబ్దమును గూర్చి నే నెన్నడును విచారించినది లేదు. శ్రీ శర్మగారు తొలుత నన్నడిగినప్పుడీమాటలే వారికి వ్రాసితిని.

మరల వారు 'దావా...విక్రయ' ఇత్యాది వ్యవహారము విచిత్రముగా నున్నదన్న తరువాతనే నాకేమియు పాలుపోక ఆందోళన పడుచూ—శబ్దము అధమనమై యుండునా యనిపించి, వెంటనే అందుబాటులో నున్న శబ్దార్థ చంద్రిక తెత్తి చూడగా, అందు 'అధమనము=తాకట్టు' అని యున్నది. బ్రతుకు జీవుడా అనుకొన్నాను. అధమనము శ. ర. లో, వా. ని. లోను లేదు. సూ. ని. లో ఉన్నది.

౧౪ అంగుళము

(పుట 320) అంగుళశబ్దము సంస్కృతభాషలో నున్నదా? తత్పురుష, బహువ్రీహి సమాస ఘటితమైనప్పుడు అంగుళీ శబ్దము అకారాంతము గాఁగలదు. కాని స్వతంత్ర ప్రయోగము వెదకవలసి యున్నది. తత్సమచంద్రికలో ఉన్నమాట నిజమేగాని ప్రమాణమును ప్రయోగమును చూపలేదు.

* * * *

అంగుళ శబ్దమును, ఇతర కవులమాట యటుండ—తిక్కనయే పలుమారు విడిగా వాడుటయే కాక 'అంగుళాగ్రములే' అని సమాసమునను వాడియుండగాఁ (మూ. పు. 322) ఆ శబ్దమును గూర్చి యింకను విచికిత్స యేల? సంస్కృత రచనలలో స్వతంత్ర ప్రయోగ మగపడకున్నను సోమయాజిగారి ప్రయోగమును శిరసావహించవలసినదే గాని తప్పవజాలముగదా!

సంస్కృతగ్రంథములలోను అంగుళము కలదేమో పండితులరయుదురు గాక.

౧౫ కవిత-కావ్యము

(పుట 320) "కవిత-కావ్యము ఈ రెంటికిని అర్థభేద మున్నదా? కవితారసము, కావ్యరసము ఇత్యాది ప్రయోగము లున్నవి. కవితా కావ్య శబ్దములకు తాత్పర్యభేదమున్నది. అర్థభేదము నాకు గావరాదు. సముదితమైన గ్రంథమునకు-అది యొక ముక్తకమైనను గావచ్చును—కావ్యమనియు, దాని

రచనా క్రియను కవిత్వమనియు నేఁడు వాడు చున్నాము. ప్రాచీన వ్యవహారములో రెండును భేదము లేకయే వాడఁబడినవనుకొందును. శబ్దవ్యుత్పత్తి ప్రకారము కావ్యము కవి భావ కర్మలు రెంటిని, కవిత కవి భావమును మాత్రమే తెల్పునుగదా! క్రియా రూపముగా తోఁపని భావము దురవగాహము గనుక భావకర్మలకేకత్వము నే వ్యవహారమందు గ్రహించి నాము.—

"ఏకైక కవితా న్యాణాం। గ్రామా
యాశ్వాయు హ స్తి నే
అంత తోన్నాయ వస్త్రాయ।
తాంబూలాయ చ కల్పతే."

అని నీలకంఠ దీక్షితుఁడు కవితా శబ్దముచే కావ్యము నే చెప్పుచున్నాడు. తెనాలి రామకృష్ణుఁడు—'వలు దలంబుల నెన్నఁగల కావ్య ధారలు' అని వాడినాడు గదా. మీరు భావించినట్లు ఇందు 'కావ్యధారలు' కవిత్వ ధారలుగా నుండవలదా?"

*   *   *

నేఁడు మనము సముదితమైన గ్రంథమును కావ్య మనియు, దాని రచనాక్రియను కవిత్వ మనియు వాడు చున్నాము గనుక నే, నేను కవిత్వమును కావ్యమనుట సరికాదన్నాను.

కవిత్వము చెప్ప నేర్చిన ప్రతివాడును కావ్య కర్త కాడు. అందుచేత నే,—

"ఆశుకవిత్వంబు లల్లి లే నేసరా?
చిత్రప్రబంధముల్ చేయవలదె?"
అన్నది ముద్దుపళని. (రాధికా. 3. 14)

కవిత్వము ఈశ్వరానుగ్రహ లభ్యము (పుట్టు తో నే రావలసినది). కావ్యము కవితాసాధ్యము.

"గాంధర్వంచ కవిత్వంచ। శూరత్వం దానశీలతా
అభ్యాసా న్నోపలభ్యంతే।
చత్వారస్సహజాగుణాః"—కదా!

కవులు కవితాశబ్దముచేత కావ్యమును, కావ్య శబ్దముచేత కవితను చెప్పుటయు, పతితలు సందర్భము ననుసరించి తత్తదర్థములను గ్రహించుటయు సంప్రదాయముగా నున్నను, మనము కవిత్వమును, కావ్యమును విడబరిచి వివక్షించుచుపట్టున—అందును నిఘంటువులో — కవిత్వమును కావ్యమనుటయు — కావ్యమును కవిత్వ మనుటయు చెల్లదని నా మనవి.

చతుర్విధ కవితలను చతుర్విధ కావ్యములనియు పంచకావ్యములను పంచకవితలనియు పేర్కొనుట కీనాటిలోక మంగీకరింపదని నేననుకొందును.

'చిత్రము' కవితాభేదముగాని కావ్య భేదము కాదు—

అప్పకవి, చిత్రబంధ గర్భకవిత్వ తత్త్వమును చెప్పుచోట—

"అనులోమ విలోమము—
ఆదిగాఁగొన్ని పద్యంబులెల్ల,
క్షితినిఁ జిత్రకవిత్వప్రసిద్ధినాము,
ధీమములచేతఁ జెంపొందు" నన్నాఁడు.
(4. 368)

'చిత్రకావ్య' మనగా చిత్రకవితా కలితము కావ్యమగును. అట్లే విలోమ కవితామయకావ్యము-విలోమకావ్యము ఉ:—రామకృష్ణవిలోమకావ్యము.

కావ్యరస మనగా కావ్యగత కవితారసమనియు, కావ్యధారలనగా కావ్యమునకు సంబంధించిన ఆశు ధారా—చాటుధారాది కవితాభేదములనియు, కవితా కావ్యశబ్దముల కర్థభేదము కలదనియు నా భావన.

సూ. ని, "కవిత=కవిత్వము, కైత." — "కావ్యము=కవికృతియగు గ్రంథము, కబ్బము" అనియే చెప్పినది.

నా పరామర్శ తెడనుపారియే.

౧౬. మడవక

(పుట. 324) "మడవక — మడఁగు ధాతు రూపాంతరము కొందును. మడఁగు=వంగు — అను వాచ్యార్థమునకు 'వెనుదీయు' అను గౌణార్థము లభించుట సహజము. — మడవు ధాతువునకు నికర మైన అర్థమేమో మీరు చెప్పలేదు. రూపాంతరము లేనియు లేని క్రియను ఒక శ. ర. ను నమ్మి అర్థ నిర్ణయము చేయుట యుపయోగకారి కాదని నా తలపు. నన్ను ప్రయోగమువంటి చోట్ల అది (మడవక) వట్టి యూతపదమే.

*   *   *

మడఁగు ధాతువుకు లేని 'వెనుదీయు' అను క్రొత్త యర్థమును డొంక తిరుగుడుగా కల్పించిరైనను

మడవు' మడఁచుకు రూపాంతర మనవలసిన అక్కర యేమియో నాకు తెలియ లేదు. కావ్యములలో 'మడవక' యనియే గాని, నేను చూచినంతలో 'మడఁగక' అని యొక్కచోట నయినను కనబడలేదు. ఒక్క నన్నయయే యీ క్రియను 'ఆది'లో మూడుమార్లును, 'సభ'లో ఒక మారును వాడియున్నాడు. ఈ క్రింది ప్రయోగము నాకిటీవల కనబడినది —

"మడవక పవనజుఁడు నూఱుమూఱులుఁబీచెఁ"

(ఆది. 6 217)

భాగవతములో రెండుచోట్లను 'మడవక' అనియే యున్నది. శ్రీనాథుఁడును 'మడవక' అనియే వాడెను గదా! కవులెల్లరును వాడినరూపమునే శ. ర. కర్త గ్రహించినాడు. అది యుక్తమే కదా!

ఆ క్రియకు 'మడవక' అన్న వ్యతిరేకక్త్వార్థక రూపమే గాని ఇతర రూపములు లేవు లేకపోవుగాక. వాటితో మనకేమి? వ్యవహారమున నున్న రూపమే మనకు గ్రాహ్యము. చూడండి—

ఉలు (=లక్ష్యపెట్టు) అను క్రియకును 'ఉలుక', 'ఉలుఁడు' అని వ్యతిరేకమునందే ప్రయోగములున్నవి. ఇతరములు లేవు. అంతమాత్రమున ఆ క్రియను కవులు వాడమానిరా?

మడవక-అను క్రియకు 'తప్పక' అని యర్థము చెప్పికోవలెనని నేను వ్రాసియే యున్నాను. ఊఁత పదములకు నికరమైన యర్థము చెప్పుట నాకే కాదు, మరి యెవ్వరికిని వలనుపడదు.

౧౭. చిడిపి

(పుట. 327) "చిడిపి-చిలిపి ఒకటే. చిల్లర అని యర్థము. శ. ర. 'చిడిపి'కి చెప్పిన 'పరుసము' అను నర్థము ఊహాసిద్ధము మాత్రమే 'కొంచె బండలు' అని తాము వ్రాసినది యుక్తిసహము గాదు. గుడ్డలో మూట గట్టినవి చిల్లరరాళ్ళనుగాని బండలు గాఁజాలవుగదా? ఇది (చిడిపి) శిల్పభేదము కాఁబోలు. 'చిదిపి'యూ దీని రూపాంతమే కావచ్చును.

* * *

'కొన్ని జీవులు చిడిపిబా ల్గాలికి బ్రదుకు' అను పద్యములోని 'చిడిపి'కి శ. ర. చెప్పిన 'పరుసము' అను అర్థము సరియైనదనే నా యభిప్రాయము.

బరువువాటు పాతగుడ్డలో బండలు కట్టుకొని రాజాలడనియే నా వ్రాతలోని భావము.

చిడిపి; చిదిపి శిల్పశబ్ద భేదములే యగునేమో?

చిలిపి - అను పదమునకు 'కొంటె' అను నర్థ మొకటే యున్నది —

'వాడివన్నీ చిలిపిచేష్టలు'—'ఆ పిల్ల చిలిపిగా నవ్వినది' ఇత్యాదిగా వ్యవహారము.

౧౮. దొమ్మరిది

(పుట. 338)—(1) "దొమ్మరిది - అను వ్యవహార రూపము అప్రామాణికమని దృఢముగా చెప్ప లేము. కాఁపుది, చాకలిది ఇత్యాది స్త్రీవాచక వ్యవహారము సహజము- న్యాయ్యమునని నేను తలఁచెదను. దొమ్మరిది; కాఁపుది- ఇత్యాది రూపములను గూర్చిన నా నమ్మికలివి.- తెలుగుభాషలో స్త్రీ వాచక ప్రత్యయములు అమహద్వాచకములకంటె భిన్నముగా లేవని, దానిచే ఒకానొక కాలమున ఈ జాతి స్త్రీజనములను సమానముగా భావించినదని - భావించువారున్నారు. కాని అది సత్యముకాదని నా తలపు. దొమ్మరిది, చాకలిది ఇత్యాదులలోని స్త్రీ ప్రత్యయము 'అది' యును 'ఇది' యును గాదు. మరి 'ఇతి'. ఇది స్త్రీశబ్ద ప్రాకృత రూపమైన ఇత్థీ. తెలుగు 'ఇంతి' ఇదే. కన్నడమున దీనిరూపము, ఇత్తి; ఇతి. తెలుగున తి, త, తె, తు, తుక- ఇట్లు మారినదిగదా. వీనిలో మొదటి రూపమగు 'ఇతి' ద్రవిడభాషా సహజమైన సరళాదేశము గలిగి 'ఇది' గా మారినదని నా యూహ. దీనితో తర్వాత అది—ఇది అను సర్వనామ రూపములు—అమహత్తుని కలిసి పోయినవి వైయాకరణులు స్థితగతి చింతకులు గావున ఏదో యొక రీతిగా ప్రకృతి ప్రత్యయములను విడదీసి చూపి తృప్తులగుదురు. (లేఖలో) మీరుదాహరించిన పట్టాభిరామ పండితీయమున (2) బాపనది — బాపనయది — ఇత్యాదిగా రెండురూపములును అంగీకరింపబడినవిగదా. అందు రెండవ రూపము—అచ్చులోపింపనిది, వ్యవహారమున గాని, వాఙ్మయమున గాని యెందైన నున్నదా? నా యెఱుకలో లేదు — (3) అంపలిది అది—ఇది రెండును గాదు. మరి 'తి'. ఉచ్చారణలో 'ది' గా మారినది. పాలతి—గరిత ఇత్యాదులలో దీని రూపమున్నది. 'వెలది'లో 'ది' గా మారినది. కన్నడ

మున నేటికిని 'దొంబరితి'—'పంచారితి' అనియే రూపము నిలిచినది.

* * *

(1) దొమ్మర స్త్రీని 'దొమ్మరది' యనవలెను; 'దొమ్మరిది' అనరాదు — అన్న నా వ్రాత యీనాటి తెనుగు వ్యాకరణము ననుసరించినది — 'దొమ్మరిది' అనవచ్చు నన్న శ్రీ శర్మగారి సవరణ అసలు వ్యాకరణమునే సంస్కరించుచున్నది. కావున ఆ విషయమును వ్యాకరణశాస్త్ర పండితులును, వ్యాకరణ కర్తలును విచారింతురు గాక.

(2) శాస్త్రమును బట్టి యేర్పడు రూపములను చెప్పుట శాస్త్రకర్తవిధి. కావున ఆ పట్టాభిరామ పండితుడు 'బాపనయది' అనియు నగునని చెప్పినాడు. ఆ రూపము నేడు వ్యవహారమున నున్నను— లేకున్నను అందలి సర్వనామము 'అది' యన్న సంగతి మనకు స్పష్టముగా తెలియవచ్చినది. మనకు ప్రకృతము కావలసినది అదే.

(3) బాఁపనది - అనుపదమునందలిది అది - ఇది కాక 'ది' యను నేని బాఁపన+ది=బాఁపనది, అట్లే దొమ్మర+ది=దొమ్మరది యగు నే గాని బాఁపనిది, దొమ్మరిది యగు టెట్లు? ఆ రూపములు ప్రామాణికము లగు టెట్లు?

'దొమ్మరిది' అన్న వేదం పండితులే తమ ఉత్తర రామచరిత ఉపోద్ఘాతమున 'బాపనది' అన్నారు.

"కామందకి బౌద్ధ పరివ్రాజిక. ఆమె బాపనదనం బ్రమాణము లేదు" అని అక్కడి వాక్యము. (పు. ౨౩).

మరియు, కాఁపు+ది=కాఁపుది - అయినది సరే 'కాఁపది' యెట్లయినది?

నేను (పు. 338 లో) కాఁపు స్త్రీని 'కాఁపుది' అనఁగూడదన్నాను. పొరపాటు. కాఁపుస్త్రీనీ, కాఁపు వాని వస్త్రాదికమును కూడా 'కాఁపుది' యనవచ్చును. కాని కాఁపువాని వస్త్రాదికమును 'కాఁపది' యనఁగూడదు. కాఁపది-కాఁపుజాతి స్త్రీయే యగును.

(కాఁపు+అది) కాఁపది-యన్న రూపమును బట్టియు, ప్రథమేతర విభక్తులయందలి-కాఁపువానిని, దొమ్మరవానికి ఇత్యాది వ్యవహారమును బట్టియు ఆ పదములందలి ప్రథమా విభక్తి రూపము 'అది' గాని 'ఇది' కాదనియు, దొమ్మరిది, చాకలిది అను వ్యవహారము ప్రామాణికము కాజాలదనియు నా నమ్మిక.

౧౯ ఉప్పర

(పుట. 339) "ఉప్పర శబ్దార్థము—ఖనకుఁడు ఇత్యాది నాకు తృప్తికరము గాదు. మా సీమలో ఉప్పర వారు ఉప్పు తయారు చేయువారు. ఉప్పుమంటిని పెద్ద పెద్ద దిబ్బలుగా మా సీమలో నేఁడును చూడవచ్చును. 'ఉప్పరమాడలు' అని వాని వ్యవహారము. ఉప్పుకా కన్నడములో ఉప్పార తెలుగులో ఉప్పర. వా వృత్తి ఇంగ్లీషురాజ్యము ఉప్పుపనిని స్వాధీనము చే కొన్న తరువాత శాశ్వతమై నశించినది. వారు చేసి ఉప్పును మన్నుప్పు అనియు నందురు. ఆంధ్రభాషా వల్ల 'కుడ్యాదికారి' విచార్యమైన అర్థమే. మట్టి—గోడల పనిచేయు వారిని మా ప్రక్క వడ్డెవార పిలుతురు."

* * * *

ఈ ప్రాంతమున ఉప్పరవారు (ఉప్పరులు) కాపులు— చెలుపులు త్రవ్వువారే గాని ఉప్పుచేయు వారు కారు. వావిళ్ల నిఘంటువు 'ఉప్పరి (ఉప్పర+ఇ) ఉప్పరవాఁడు' అని యర్థము చెప్పి—"ఒక్క బావిఁద్రవ్వించుటంచు నుప్పరులఁ బిల్వఁగఁబంచి" యన్న ప్రయోగమును గూడా ఇచ్చియున్నది. కావున ఆం. భా. 'పరఁగుఁ గుడ్యాదికారి యుప్పరి యనంగ' అని చెప్పుటలో తప్పులేదు.

నేటి నిఘంటువులు 'ఉప్పరి'కి కుడ్యాదికారి యను అర్థముతో పాటు—ఉప్పుచేయువాఁడు—అన్న యర్థమున్నూ చెప్పి, మైసూరు ప్రాంతమున ఉప్పుచేయు వారిని ఉప్పరు లందురు—అని వివరించుట యుచితమని నా యభిప్రాయము.

మట్టి-గోడల పనిచేయువారిని 'వడ్డెవాం'డ్లనుట యీ ప్రాంతమునను కలదు. (వడ్డెరవాండ్లనియు నందురు) శ.ర. గ్రాంథికత కొరకు 'ఒడ్డె (ఒడ్డియు)=ఒడ్డెవాఁడు' అన్నది. 'ఒడ్డెర' ను గ్రహించలేదు. సూ. ని. లోను ఒడ్డెర లేదు.

ఉప్పర, కంబర, కమ్మర, కుమ్మర, గొంకర- అను పదముల వలెనే 'ఒడ్డెర' యును జాతివాచకమే.

* * *

బహుభాషా కోవిదులును-బహుశాస్త్ర వేత్తలును-విమర్శవిద్యా విశారదులును - సహృదయులును నైన శ్రీ శర్మగారు పైవిధముగా శబ్దార్థాది చర్చ చేసి చేసి చివరకు "వ్యవహారములోని సరస్వతీ విలాసము లివి. అన్ని హేతువాదాలకును అతీతమైనవి" అని పరమసత్యమును, అమోఘమును నైన యొక వాక్యమును వ్రాసిచ్చినారు. నిజముగా ఈ సరస్వతీవిలాసము లనంతములు. వీనిని సమగ్రముగా తెలుసుకొనుటకును, ఇదమిత్థమని తత్త్వనిర్ణయము చేయుటకును ఎంతటి విద్వాంసునకైనను ఒక్కనికి తరము గాదు.

అనుకంటివారి వ్రాతలు పండితులను కదలించి విమర్శరంగములోనికి దింపుటకు పనికివచ్చునవే గాని సిద్ధాంతములు కాజాలవు. కాఁబోయినను భాషారాధనమే గనుక పెద్దలమన్ననకు పాత్రములు కాక పోవని నా విశ్వాసము.

నీవు పిల్చితివి

శ్రీ సి. నారాయణరెడ్డి

నీవు పిల్చితివి మరింత
నిశ్శబ్దమ్మలమి కొనగ,

నాయెడంద అంజనాద్రి
యై, అంధతమోగుహయై,
కాలోరగ విష సమ్మూ
ర్ఛాలసమై యున్నవేళ
నీవు పిల్చితివి మరింత
నిశ్శబ్దమ్మలమి కొనగ.

నీ పిలుపున తేనియ పీ
జీయలు మూల్గుననుకొంటిని
నీ పిలుపున పికీ గళ
వ్యాపృతిగలదనుకొంటిని.
ఎలనాగల కన్నుల దా
రులలో మెత్తగ నడచెడు
కలల కాళ్ల సవ్వడి నీ
పిలుపున గలదనుకొంటిని.
కాని నీవు పిల్చితి విం
కా నిశ్శబ్దత పేరగ.

మ్రోసి మ్రోసి పారవశ్య
మును పట్టగలేక తెగిన
నటస్వామి దక్షిణ చర
ణ నూపురమునైనగాను.

నీ వు పి ల్చి తి వి

పలికి పలికి తారాధ్వ
ప్రసారిత స్వరమై మది
చెదరి మూర్ఛపడిన విపం
చీ తంత్రికనైనగాను.
ఇపుడపుడే మ్రోయుదు నని
ఎడదను కిన్నెరగ మలచి
స్వర నిర్ణయ శంకా ని
స్తబ్ధజీవనుడనై తిని.
గుండె నిండ శబ్ద బ్ర
హ్మాండమ్మును నింపుకొనక
ముందుగనే నీరవతా
ముద్రితాత్మకుడనైతిని

మరల నీవు పిలువుము హిమ
గిరి వీపు చురుక్కుమనగ
తురగలించు తరుణ సూర్య
కిరణకశాగ్రమ్మువోలె.
మరల మరల పిలువుము ఉ
న్మత్తాంభోద ద్వీప మ
స్తముల నెచ్చరించు విద్యు
దంకుశోగ్రధారవోలె.
మరల నీవు పిలిచిన పి
మ్మట చూడుము నాయెడంద
ఏకకాలమున డమరుక
మై కచ్ఛపియై మ్రోగును.

కుంపటిలో కుసుమం

శ్రీ మధురాంతకం రాజారాం

* గతసంచిక తరువాయి

ప్రొద్దుపోయి, ఊరంతటా దీపాలు వెలిగి, వీథుల్లో జనసంచారం ఎక్కువైన ఓ సంధ్యాసమయాన రంగడు హైరోడ్డు వెంబడే నడువసాగేడు. ఆరోజు మధ్యాహ్నమే అతడు కటకటాల్లోంచి బయటికి వచ్చాడు. తనకారోజు విముక్తి లభిస్తుందని రంగడికి తెలియదు. అతడు తేదీలు, నెలలు గుర్తుంచుకోడానికి ప్రయత్నించలేదు. పది యిరవైరోజులైతే వాటిని లెక్కించుకోనూ వచ్చు, అవి ఒక్కొక్కటిగా గడచి పోతున్నాయని ఆనందించనూ వచ్చు. తను జైలులో గడపవలసిన రోజులు ఏడు వందలకుపై చిలుకు! ఈసుదీర్ఘమైన చీకటిబ్రతుకు నెలాగడపడమన్న చింత లోపలినుంచి చెట్టును తొలిచివేసే పురుగులా రంగడి హృదయాన్ని దహించి వేయసాగింది. అతడు తనచుట్టూవున్న రాతిగోడని చూచేవాడు. ఆగోడకు తల బాదుకుంటే మనో వేదన కొంత చల్లారుతుందేమో ననుకునేవాడు. కమ్ముల్ని చూచేవాడు. చేతులుచాచి వాటిని వంచి విరిచి నుగ్గునూచ చేసివేద్దామనుకునేవాడు. కమ్ముల్లోనుంచీ చెట్లు, వాటిపైన ఆకాశంలో ఎగిరిపోతున్న పక్షులు కనిపించేవి. తనూ ఒకపక్షై వాటితో కలిసి రివ్వున పరతెంచి తన రమణిచేతుల్లో వ్రాలినట్టు ఆమె తనని హృదయానికి హత్తుకుని ముద్దాడినట్టు భావించేవాడు. అంతలో మళ్ళీ తన నిజపరిస్థితి తెలిసి వచ్చేది. "అంతా భ్రమ! ఇవి కమ్ములు, ఇవిగోడలు, ఇవిజైలు, నేను పక్షిని కాలేదు. రమణిచెంతకు పోలేను" అనుకుంటూ కుమిలిపోయేవాడు.

రంగడు జైల్లో మనిషిలా బ్రతకలేదు. యంత్రంలా బ్రతికాడు. యంత్రానికి పనిచేద్దామని గానీ, మానుకుందామని గానీ వుండదు. మర యిటుత్రిప్పితే పనిచేస్తుంది. అటు త్రిప్పితే మానుకుంటుంది. రంగడూ అంతేచేశాడు. పైవాళ్ళు లేవమంటేలేచాడు. పడుకోమంటే పడుకున్నాడు. తినమంటే తిన్నాడు. లేకుంటే పస్తున్నాడు. యంత్రం పనిచేసినన్నిరోజులూ చేస్తుంది. ఎక్కడో ఒక కీలు విరిగినప్పుడు టకీమని ఆగిపోతుంది. రంగడికీ అంతేఅయింది. ఓరోజు పాతాళగంగని పైకితోడుతూ అతడు చేంతాడు చుట్టలో చిక్కించిపెట్టి దభేలున క్రిందపడిపోయాడు. కాపలావున్న రక్షకభటుడు పరుగెత్తివచ్చి రంగడిపైన చేయివేసి చూచాడు. జ్వరం నూటికిపైన కాస్తోంది. పై అధికారికి, కబురువెళ్ళింది. జ్వరంతోవున్న ఖైదీచేత పనిచేయించినందుకు అతడు కాపలావాళ్ళపైన మండిపడ్డాడు. తనకు జ్వరమని రంగడు చెప్పకోలేదు. అడిగిందే అమ్మయినా బువ్వపెట్టదు. ఖైదీకి జ్వరమని గ్రహించి, వాడికి సపర్యచేయవలసిన అవసరం పోలీసు వాడికిలేదు. క్రిందపడినతర్వాత తనకు స్మృతి రావడానికి ఎన్నిరోజులుపట్టిందో రంగడికి తెలియదు. లేచి తనవైపొకసారి చూచుకున్నాడు. తను మునుపటి రంగడు కాడు. అస్థిపంజరంపైన చర్మపు తొడుగులావున్న యిదేనా తనశరీరం ? కాదు. రమణితో పాటూ తన రూపసంపదని సైతం ఎవరో కాజేశాడు!

జ్వరం నిమ్మళించినతర్వాత రంగడు మళ్ళీ ఖైదీగా కటకటాల్లోపలికి వచ్చాడు. రోగశయ్యపైన అతడి మనసు నావరించుకున్న నిస్తబ్దత, లేచినతర్వాత కూడా అలాగేవుండిపోయింది. జీవితోత్సాహం చిదికిపోయిన ముసలివాడిలా అతడు ఎక్కడ కూచుంటే అక్కడే కూచునివుండిపోయేవాడు. పని చేస్తూ చేస్తూవుండి అలసిపోయి ఉప్పుగా నేలపైన కూలబడేవాడు. తా ననుభవించవలసిన రెండేళ్ళశిక్ష ఎప్పుడో పూర్తయినట్టు, అయినా తన నిస్సహాయతని గుర్తించిన అధికారులు మరి కొంతకాలం తననుండి చాకిరీ చేయించుకుని తనని చిత్తు చిత్తుజేసి వదలిపెట్టనున్నా రనుకుని అతడు అర్ధరాత్రప్పుడు ఘోరున విలపించేవాడు. కాని

అది అపోహని అతడికి అచిరకాలంలోనే తెలిసి వచ్చింది. చింతలతో వంతలతో కుములుతున్న వాళ్ళకు నిముషమే యుగంగా కన్పిస్తుంది. రంగడికి తన రెండేళ్ల శిక్ష ఒక మహాకల్పంగా గోచరించడంలో వింతలేదు. ఆరోజు ఉదయం తలుపు తెరుస్తూ కాపలావాడు "నీ శిక్ష పూర్తయింది" అన్నాడు.

రంగడు మళ్ళీ ప్రపంచంలో పడ్డాడు. మెల్లగా కాళ్లీడ్చుకుంటూ రైల్వేస్టేషను వరకూ నడిచాడు. అతడెక్కవలసిన రైలు అరగంట క్రితం వెళ్లిపోయింది. మళ్ళీ రాత్రి పన్నెండుకుగాని బండి లేదు. రంగడు టౌనువైపు దారితీశాడు. త్రోవలో ఒక బంకుదగ్గర ఆగి బీడీకట్ట కొనుక్కున్నాడు. కాలుతున్న టెంకాయ పురిలో ఒక బీడీ అంటించి ఎండిన అధరాలకు కొంచెం పనుసెక్కించి ముందుకు నడవసాగేడు.

రంగడలా రెండు ఫర్లాంగుల దూరం నడిచివుంటాడు. అక్కడొక చిన్నవీధి హైరోడ్డుతో కలుస్తుంది. రంగడా వీధి మొగసాల్లో ఆగాడు. అతడక్కడ ఆగిపోవడానికి కారణం ఒక సినిమా బొమ్మ. ఆ బొమ్మలో ఒక కొమ్మ నడివీధిలో నవ్వుల జడివాన కురిపిస్తోంది. రంగడు గోడకి అతికించబడి వున్న ఆ బొమ్మని చూడ్డం హఠాత్తుగా తటస్థించింది. ఆ చూచిన క్షణాన రంగడి శరీరం కొయ్యబారిపోయింది. అతడు కొయ్యబొమ్మలా ఆ బొమ్మని చూస్తూ నిలుచుండిపోయాడు.

ఆ నవ్వు రంగడికి సుపరిచితం. ఆ నవ్వు రంగడి బీడు బ్రతుకుపైన తొలకరి వానలా కురిసింది. ఆ నవ్వు కోసం, ఆ అరుణరాగరంజితాలైన పెదవులపై నుంచీ వచ్చే ప్రియవచనాలకోసం కాకపోతే రంగడు మరెందుకు బ్రతుకుతున్నాడు!

'బొంయ్, బొంయ్' మంటూ హైరోడ్డునుంచి వీధిలోకి మళ్లిన కారు క్రింద పడబోయి వెంట్రుకవాసిలో తప్పించుకుని ముందుకుపరుగెత్తాడు రంగడు! ఆ ఆందోళనలో అతడికి వీధిమధ్యలోనుంచి వైదొలగి ఏఅరుగుమీదయినా నిల్చుంటే, మరి ప్రాణాపాయముండదని స్ఫురించలేదు. ఆపరుగుతో అతడు వీధి చివరిదాకా వెళ్లాడు. ఒగర్చుకుంటూ అక్కడ ఆగి మళ్ళీ గోడవైపు చూచాడు. అక్కడ మరోబొమ్మ కనిపించింది. బొమ్మవేరైనా అందులోని కొమ్మ మాత్రం అదే! అదేయువతి మరో ఫోజులో ఈసారి ఆవిడ ఒక మగవాడితో జంటగా ఊయలూ తోంది.

రంగడు గట్టిగా కళ్లు మూసుకున్నాడు. తన మనోవీధిలో పొడమిన అనుమానాంకురాన్ని సమూలంగా నాశనం చేయడానికి ప్రయత్నించాడు. ఈవిడ రమణి కాదు. కావడానికి వీల్లేదు. తన రమణి పరాయివాడితో బాటు ఊయల్లో కూచుని ఊగదు. తానెవతెనో చూచి రమణి అని భ్రమిస్తున్నాడు!

"తప్పుకో, తప్పుకో" అంటూ పరుగెత్తివస్తున్న రిక్షావాడికేకవిని ఉలిక్కిపడి రంగడు మరికొంతదూరం నడిచాడు. అతడు నడుస్తున్న రోడ్డు అక్కడ మరోక రోడ్డుతో కలుస్తుంది. ఆ వీధికెదురుగా రోడ్డు కటువైపున ఒక పెద్దహోటలు, ఆ హోటలుపైన పెద్ద సైజులో ఒక సినిమాపోస్టరూ చూచి రంగడు మళ్ళీ ఆగిపోయాడు. ఆబొమ్మలో ఇదివరకటి చిత్రాల్లోలా ఆయువతి నవ్వడమూ లేదు. ఊయలూగడమూ లేదు. వీణ వాయిస్తోంది. అదేయువకుడు వెనుకనుంచీ ఆమె జడలో ఒక గులాబీపువ్వు వుంచుతున్నాడు.

రంగడి హృదయవీణపైన ఎవరో చేయి వేసి చరాలున తంత్రుల్ని తెంపి వేసినట్టయింది. ఇందుగలదందు లేదని ఎందూ కనిపిస్తున్న ఆ బొమ్మలబారినుంచీ తప్పించుకోడానికి అతడు కాలికొద్దీ అటూ, యిటూ పరుగుతీశాడు. ఎంతగా నిమ్మళపడుచుకోబోయినా అతడి మనసు పట్టువదిలి మళ్ళీ మళ్ళీ అదే అనుమానానికి గురికాసాగింది. వేయిమందిలో వున్నా రమణిని తను గుర్తుపట్టగలడు. ఈవిడ రమణే! మరొకరైతే తన హృదయానికింత అఘాతం కలిగివుండదు... కాదు. ఈవిడ రమణి కాదు. తను నేరస్థుడుగా యిల్లు విడిచిపెట్టిన తర్వాత రమణి దిక్కూ, మొక్కూ లేని ఏకాకి. ఆమె ఎక్కడో ఒకచోట చాకిరీచేసి పొట్టపోసుకుంటూ తన రాకకోసం ఎదురు తెన్నులు చూస్తుంటుంది. తారాపథంలో మిలమిల మెరసిపోతున్న ఈవిడ, తన సంపర్కంవల్ల సుఖశాంతుల్ని గోల్పోయిన అభాగ్యరాలు రమణి ఒక్కరే కావడం కల్ల!

రాత్రి ఎనిమిదిగంటలు దాటి వుంటుంది. దూలాల్లా ఊరిపోయి బరువెక్కిన కాళ్ళనీడ్చుకుంటూ

...లేక రంగడు ఒక చెట్టుక్రింద కూచున్నాడు. అక్కడే పడుకుని కాసేపు నిద్రపోతే ఎంత బాగుండు నిపించింది అతనికి! కాని దౌర్భాగ్యుడెక్కడికి పోయినా దురదృష్టం వాడివెన్నంటే వుంటుంది! అక్కడికి చేరువగా విద్యుద్దీపాల వెలుగులో ఒక సినిమాహాలు పూలతెప్పలా రంగడికి కనిపించింది. ఆరి పోతూ మళ్ళీ వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బులమధ్య రమణి ఆకారం అంతలో కనిపించి, అంతలో మాయ మైపోతోంది. ఆ చిత్రం చూస్తూ, చూస్తూ రంగడు పైకిలేచాడు. లేచి పది అంగల్లో హాలుదగ్గరికి వెళ్ళి అర్ధరూపాయ కిటికీలోవిసరి "టికెట్టు, టికెట్టు" అన్నాడు. ఎనిమిదిగంటల వేళప్పుడు సినిమాకి బయల్దేరివచ్చిన విచిత్రవ్యక్తిని ఓరకంటితో చూస్తూ బుకింగుక్లర్కు ఒక నేలటికెట్టు చించి రంగడిచేతిలో వుంచాడు.

ఏ బలీయమైన ఆకర్షణలవల్లనైతే ప్రేక్షకులు ఆ చిత్రాన్ని విరగబడి చూచారో ఆ రసవత్తర ప్రణయ సన్నివేశాల్ని రంగడు అయిదారు నిమిషాల కంటే ఎక్కువసేపు చూడలేకపోయాడు. అతడు హాల్లో అడుగుపెట్టేసరికి వెండితెరపైన నాయకీ నాయకుల మధ్య ఒక చిన్న ప్రణయకలహం సాగుతోంది. నాయకుడు ఆఫీసునుంచి తిరిగిరావటంలో కొంత విలంబనం జరిగింది. ఈ టీకప్పులో తుపానుకదే కారణం! ఆమె ముఖాన్ని ముకుళితపద్మం చేసుకుంది. అతడు వెయ్యివిధాల బుజ్జగించాడు. కడకు కాఫీటంబ్లరు ఆమె పెదవుల కందిస్తూ "నువ్వు నారాణివైతే ఈ కాఫీ కళ్ళుమూసుకుని త్రాగేయాలి" అన్నాడు. త్రాగకపోతే నువ్వు నారాణివు కావు పొమ్మంటాడని భయమేమో, ఆవిడ నాలుగు గుక్కల్లో కాఫీ పూర్తిచేసి "చూచారా! నేను మీరాణినే!" అన్నట్టు భర్తవైపు ఓరకంటితో చూచింది. ప్రేక్షకులు ఆ శృంగారఘట్టాన్ని అప్రీషియేట్ చేస్తూ చప్పట్లు చరిచారు. ఆ కరతాళాలు రంగడితలపైన సమ్మెట వ్రేటుల్లా మారుమ్రోగాయి. ఇంతలో నాయకి మళ్ళీ ఒక ప్రత్యేక ప్రణయ పారవశ్యాన్ని అభినయించింది. ఉన్నట్టుండి ఆవిడ భర్తవైపుతిరిగి "చూడండి, ఆలస్యంగా వచ్చినందుకు మిమ్మల్నేంచేస్తానో" అంటూ అతడి రొమ్ముపైన రెండుచేతుల్తోనూ గుద్దులు కురిపించసాగింది. ప్రియురాండ్ల పాదతాడనాల్ని సైతం సైరించిన కథానాయకుల కోవకుచెందిన వాడేమో, అతడు పెద్దపెట్టున నవ్వసాగేడు. అతడితోబాటు ప్రేక్షకులూ నవ్వారు. ఆ నవ్వుల సుడిగాలిలో రంగడి హృదయం శుష్కపత్రంలా గిరవాట్లు కొట్టింది. అతడికి లోకు లందరూ ఒక్కుమ్మడిగా తనని అవహేళన చేస్తున్నట్టు తోచింది. నవ్వుతున్న ప్రేక్షకసమూహాన్ని చురచుర చూస్తూ అతడు ఎలుగెత్తి "ఆపండి, ఆపండి" అని కేకవేశాడు. ఒక క్షణంపాటు అక్కడ కూచున్న వాళ్ళ కళ్ళన్నీ రంగడివైపు తిరిగాయి. ఆ చూపులు రంగణ్ణి యిట్టే పిచ్చివాడుగా తేల్చివేశాయి. వస్తాదుల్లాంటివాళ్ళిద్దరు పైకిలేచి రంగణ్ణి బయటికిలాక్కొచ్చి సింహద్వారం చూపించారు.

గమ్యస్థానమంటూ లేక రంగడు వీధుల్లో తిరుగ సాగేడు. పదిగంటలకు సినిమానుంచీ యిళ్ళకువెళ్తున్న వారితోనూ, రెండో ఆటకు పోతున్నవారితోనూ వీధుల్లో మళ్ళీ రద్దీ ఎక్కువైంది. ఆ జనసమూహం మధ్యనడుస్తున్న రంగడికి, అతడికవసరమైన భోగట్టా కొంత లభించింది. ఎవరో యిద్దరు ముగ్గురు చిత్రం బాగోగుల్ని గురించి మాట్లాడుతుండగా నాయకి నటనకి సంబంధించిన ప్రస్తావన వచ్చింది. తరువాత చర్చ నాయకి వ్యక్తిగత జీవితంవైపు మళ్ళింది. అదృష్టం అంటే అలా వుండాలట! ఎక్కడో నాటకాలాడుకుంటున్న మనిషి. ఎవడినో లేవదీసుకుని వెళ్ళిపోయింది. వాడిది కాపురంచేసే వ్యామోహంకాదు. ఆవిడని నట్టేటిలో పుట్టిలా విడిచి వాడెక్కడికో వెళ్ళిపోయాడు. ఎవరెవరి నోము ఎప్పుడు పండుతుందో ఎవరు చెప్పగలరు? ఆమె కెలాగో సినిమావాళ్ళ ప్రాపకం దొరికింది. అవకాశం దొరకడమేమిటి, చిటారు కొమ్మలో మిఠాయి పొట్లంలా వెలిగిపోవడమేమిటి, ఒక్కసారిగా జరిగాయి.

రంగడి అనుమానం కొస్తా బలపడింది. పూర్తిగా బలపడిందని చెప్పవచ్చుకూడా! కానీ రంగడి కప్పటికీ ఒక సందేహం వుండిపోయింది. తన చెవులూ, కళ్ళూ తనని మోసగిస్తున్నాయేమోనా!

పదినిమిషాల తర్వాత రంగడు తలపైకెత్తి చూశాడు. ఎదుట రైల్వేస్టేషను కనిపించింది. ప్లాట్‌ఫారం దగ్గర పొగవిడుస్తూ రైలు నిలబడివుంది. తలుపు తెరచి రంగడు బండిలో అడుగు పెట్టాడో లేదో, అతడి

కోసమే అక్కడికి వచ్చి, అతడెక్కగానే యింక తన కక్కడ పని తీరిపోయినట్టు రైలు కదిలింది.

* * *

పత్రికల్లో ఒకవార్త పడింది. చిత్రమైన వార్త. పువ్వుల అంచులకు మధ్య 'తారకాసురుడు' అన్న శీర్షిక క్రింద వార్త ప్రచురింపబడింది. "ఊరూ, పేరూ లేని దేశద్రిమ్మరి ఒకడు ఒక ప్రఖ్యాత సినిమాతార యిల్లెక్కడో వాకబు చేసుకుంటూ పట్టణంలో తిరుగుతున్నాడు. వాలకం చూస్తే వాలుగేస్లు ముక్కు మూసుకుని హఠయోగం చేసిన వైరాగిలా కనిపిస్తున్నాడు. సదరు సినిమాతారనొక్కసారి చూడ్డం తప్ప తన కెలాంటి దురుద్దేశమూ లేదని అతడు చెప్పుకుంటున్నాడు."

ఈ వార్త ప్రచారితం అవుతుండగానే ఆ సినీతార యింటి ముందు ఓ సంఘటన జరిగింది.

రెండెంతస్తుల మేడ ప్రక్కనుంచీ రోడ్డువరకూ వ్యాపించివున్న పూలతోటకు మొదట వేపచెట్టుక్రింద సుఖాసీనుడయ్యే ఘూర్ఖావాడి కథనం ప్రకారం, ఒకరోజు వుదయం ఆ సినీనటి కోసం వచ్చిన వాడొక 'దోవపోకిరి.' ఘూర్ఖా వాడెక్కడ పుట్టి ఎక్కడ పెరిగాడో ఎవరికీ తెలియదు. అతడికి తెలుగు, అరవం, ఇంగ్లీషు భాషల్లో ఏదీరాదు. రావాల్సిన అవసరం కూడా లేదు. అతడిపని గేటు దగ్గరికి వచ్చిన వాళ్ళని వెళ్ళిపొమ్మనడం. ఆ వెళ్ళిపొమ్మనడానికి కావలసిన పదాలన్నీ అతడికి క్షుణ్ణంగా తెలుసు.

రూక్షవీక్షణాలు, కర్కశ కంఠస్వరమూ ఘూర్ఖావాడి సొత్తులని రంగడికి తెలియదు. అతడికి తెలిసిందల్లా ఆ ఘూర్ఖావాడు కూడా తనలాంటి మానవుడేనని. ఆ నమ్మకంతోనే అతడు ఘూర్ఖాని సమీపించాడు.

"ఎవరు నువ్? ఏం కావాలి?" అన్నాడు ఘూర్ఖావాడు.

రంగడికి భయం వేసింది. ఐనా చల్లకువచ్చి ముంత దాచినందువల్ల లాభంలేదు అతడు జేబులో నుంచీ నాలుగు బీడీలుతీసి ఘూర్ఖావాడి చేతిలో వుంచబోతూ "మరేమనుకోవద్దు బాబూ! నేనొకసారి లోపలికి వెళ్ళాలి" అన్నాడు.

"లోపలికి వెళ్ళాలా? అదే పైత్యం! పోడా దూరమూ!" గర్జించాడు ఘూర్ఖా.

"ఒకటి రెండు నిమిషాల్లో పని చూసుకుని మళ్ళీ వచ్చేస్తాను బాబూ!" ప్రాధేయపడ్డాడు రంగడు.

ఘూర్ఖావాడి కళ్ళు చండ్రనిప్పుల్లా మెరిసాయి అతడి చేయి తోలుపటకాపైకి పోయింది. అరక్షణంలో రంగడి కళ్ళముందు నాగుబాము పడగలాంటి తెల్లటి బిచువా మెరిసి పోసాగింది.

గుండె బేజారెత్తి రంగడు నాలుగు బారలు పరుగెత్తి ప్రాకారపుద్వారానికి ఆనుకున్నాడు. క్రిమినీ, కీటకాన్నీ చూచినట్టు ఘూర్ఖావాడు రంగణ్ణి చూడసాగేడు.

రంగడు ఘూర్ఖాని కాస్తా మెత్తపరచడానికి సాధనాంతరాలు అన్వేషింపసాగాడు. తన దగ్గర డబ్బులేదు. ఉంటే వున్న డబ్బంతా వాడి పాదాలముందు పోయడానికి తను వెనుకదీయడు. ఐనా ధోరణి చూస్తుంటే వీడు డబ్బుకు పాలుమాలే వాడులా కనిపించడం లేదు. బతిమాలుకుందామంటేనా, దగ్గరికి వెళ్ళేసరికే మండిపడుతున్నాడు. ఇంక ఏం చేయాలి?... రంగడు ప్రాకారం వైపు చూచాడు. ఊహూ, లాభంలేదు. గోడ ఎత్తుగా వుండడం మాత్రమే గాదు. పైన దట్టంగా గాజుపెంకులు కూడా వున్నాయి.

రోడ్డుపైన వెళ్తున్న కారొకటి వున్నట్టుండి, బంగళావైపు తిరగడంతో రంగడి ఆలోచనలకు బ్రేక్ పడింది. కారు తీర వేగంతో ముందుకు వస్తోంది. రంగడు ఒకడుగు ముందుకు వేశాడు. అతడొకటి రెండు క్షణాలకన్నా ఎక్కువసేపు కారులోపలికి చూచివుండడు. ఐనా తనరమణిని పోల్చుకోడానికెంతసేపు కావాలి! అక్కడా నిమిషాన తనకీ రమణికీ వున్న అంతరాంతరాల్ని మరచిపోయి "రమణీ, రమణీ" అంటూ ముందుకు పరుగెత్తాడు.

మేడ ముందు ఆగిన కారునుంచి క్రిందికిదిగుతూ రమణి డ్రయివరుతో "గేటుదగ్గర ఎవరో కారు వెంబడి పరుగెత్తి వచ్చినట్టుంది కదూ!" అంది.

"అలాగాండీ! నేను చూడలేదు" అన్నాడు డ్రయివరు.

"నువ్వు కారుని షెడ్‌లోకి తీసుకెళ్ళు" అంటూ రమణి వెనుదిరిగి గేటు దాకా నడిచింది. గూర్ఖా వాడు లేచి నిలబడి సెల్యూట్ చేశాడు.

"ఎవడా మనిషి? ఎలా వెళ్ళి పోయాడు?" అంది రమణి.

"వాడాండీ! ఒక వేగబాండ్! ఇంకవస్తే యింటిపక్క రాడు—పోలీసు పట్టుకెళ్ళారు"

రమణి తలవంచుకుని మళ్ళీ మేడవైపు నడవ సాగింది. మధ్యలో వజ్రపాణి ఎదురై "ఎక్కడికి వెళ్లావు రమణీ ఎండలో" అన్నాడు.

"అబ్బే, ఎక్కడికీ లేదు. ఆ పొదరింట్లో కాసేపు కూచుందామని" అంది రమణి.

"ఐతే పొదరింటికి వెళ్లవలసిన దారి యిది కాదు. అది" అంటూ నవ్వాడు వజ్రపాణి.

రమణిలో అప్పుడప్పుడూ పరధ్యానం శృతి మించి రాగాన పడుతుండడం వజ్రపాణి గమనించక పోలేదు. ఆపరధ్యానానికి మూలకారణమేమిటో అతడికి తెలుసు. ఎంతగొప్ప అంతస్థు అందుకో గలిగినప్పటికీ, ఒక్కొక్కప్పుడు మానవులదృష్టి అధో లోకాలవైపు ప్రసరిస్తుంటుందెందుకో అని వజ్రపాణి రమణి పరధ్యానంగా వున్నప్పుడల్లా తర్కించుకుంటాడు.

రమణిని చిత్రరంగంలో ప్రవేశపెడుతూ వజ్రపాణి ఆమె పైన గొప్ప ఆశలేమీ వుంచుకోలేదు. ఉదర పోషణ కామె కొక దారి చూపించినందుకు అతడికి సంతృప్తి కలిగిన మాట మాత్రం నిజమే! కాదంటే ఆ సంతృప్తితోబాటూ తనలో పరోపకార పారీణత లేక పోలేదనే విశ్వాసం స్థిరం అతడికి కలిగింది. కాని రమణిపట్ల అతడు వేసుకున్న అంచనా కొద్దికాలంలోనే తారుమారయింది. ఆమెలో వృద్ధికి రాగల లక్షణాలు చూడ నేర్చిన వారి కళ్ళకు గోచరించాయి. వాళ్ళు మట్టినుంచి మణుల్ని పైకి తీసే యింద్రజాలాన్ని వజ్రపాణికి అంటగట్టి అతణ్ణి నేలపై నుంచీ నాలుగు బారలు పైకెత్తేశారు. అప్పటినుంచీ వజ్రపాణికి రమణిపైన శ్రద్ధ యినుమడింప సాగింది. ఆమెని పైకి తీసుకరావడంకోసం ఆలోచించడం అతడి నిత్యకృత్యాలలో ఒకటై కూర్చుంది.

ఆరు నెలల క్రిందటి సంగతి. అప్పుడప్పుడే రమణికి చిత్రరంగంలో ప్రాబల్యం కలుగుతోంది. షూటింగులతో ఆమెకి రేయింబవళ్లూ తెమలడం లేదు. ఓరోజు ఉదయం వజ్రపాణి ఆమెని ఔట్‌డోర్ షూటింగుకి బయలు దేరదీస్తుండగా, పోస్టుమెన్ ఆమెకో ఉత్తరం తెచ్చాడు. రెండు వారాలకు ముందు పెట్టెలో పడిన ఆ ఉత్తరం రమణిని అన్వేషిస్తూ దేశమంతా ఒక ప్రదక్షిణం చేసుకుని వచ్చింది. వజ్రపాణే వుత్తరం చించి చదివాడు. రంగడు చావు బ్రతుకుల మధ్య వున్నాడనీ, ఆత్మీయులెవరైనా వుంటే వచ్చి చూచి పోవచ్చుననీ జైలు అధికారులు వ్రాశారు.

"ప్రోగ్రాం కాన్సిల్ చేయించండి. నే నక్కడికి వెళ్లి రావాలి" అంది రమణి.

వజ్రపాణికి చిర్రెత్తుకొచ్చింది. పెద్ద ఎత్తున ప్రారంభమైన షూటింగులు వదిలిపెట్టి ఆ రంగణ్ణి చూచిరావాలని చెప్పడానికి రమణి కెలా నోరాడిందో అతడికి అర్థం కాలేదు.

"మీ కేమండీ చెప్పడం! నా కెలాగైనా నాలుగు రోజులు సెలవిప్పించండి" అంది మళ్ళీ రమణి.

వజ్రపాణి రమణి ముఖంలోకి చూచాడు. ఆవిడ నిశ్చితాభిప్రాయం అతడికి అవగతమైంది. అది కాస్తా అవగతం కావడంతో అతను తన ధోరణి మార్చుకుని "చూడు రమణీ! రంగడు నా తమ్ముడు. వాడిపైన నీ కెంత అక్కరుందో నాకూ అంత అక్కరుంది. ఇక్కడ కొన్ని వేల రూపాయలు నష్టపరిచి నువ్వు వాణ్ణి చూచి వచ్చినందువల్ల ఒరగబోయేదేముంది? నీ బదులు నేను వెళ్ళొస్తాను. వీలుంటే అధికారులతో మాట్లాడి అతణ్ణి తీసుకొచ్చేస్తాను కూడా! సరేనా!" అన్నాడు.

రమణి కొంతసేపు ఆలోచించి సరేనంది.

తన జీవితంలో బొత్తిగా తన కిష్టంలేని పనేదైనా వజ్రపాణి చేసివుంటే అది రంగణ్ణి చూడ్డానికి వెళ్లడం. తీరా అతను వెళ్ళేసరికి రంగడు స్మారకం తప్పి మంచం పైన పడివున్నాడు.

"రోగి పరిస్థితి ఎలా వుందండీ?" అని వజ్రపాణి నర్సుని అడిగాడు.

"అబ్బే. ఏం బాగుండలేదండీ! ఇలాటి కేసులు నేను చాలా చూచాను. నూటికొకరిద్దరు బ్రతికితే హెచ్చు" అంది నర్సు.

వజ్రపాణి డాక్టరు దగ్గరికి వెళ్లి మళ్లీ అదే ప్రశ్న వేశాడు. "గోడమీద పిల్లి వాటంగా వుంది కేసు. ఇటూ చెప్పలేము. అటూ చెప్పలేము. మొత్తంమీద పరిస్థితి ప్రమాదకరమే" అన్నాడు డాక్టరు.

"ఇటువంటి కేసుల్లో ఒకటి రెండుకంటే ఎక్కువ నయం కావంటారండీ! మీకు తెలియని విషయం గనుకనా!" అన్నాడు వజ్రపాణి

"ఎవరామాట చెప్పింది?" డాక్టరు కొంచెం కటువుగా ప్రశ్నించాడు.

"అదిదేనండీ! ఆ లావుపాటి నర్సు" అన్నాడు వజ్రపాణి

"నూటికి పది పదిహేను కేసులు కూడా నయమౌతాయి. ఆవిడకి తెలియదు" అన్నాడు డాక్టరు.

ఎందుకో గాని వజ్రపాణికి డాక్టరుకంటే నర్సే అనుభవజ్ఞురాల్లా కనిపించింది. కానీ డాక్టరు అభిప్రాయాన్ని బట్టి చూచినా రంగడు మామూలు మనిషి కాగలడనడానికి అట్టే అవకాశం కనిపించడంలేదు. పది పదిహేనుమందిలోకన్నా, ఎనభై ఎనభైఅయిదు మందిలో రంగణ్ణి కలిపివేయడం వజ్రపాణికి సమంజసంగా తోచింది.

ఆరోజు సాయంత్రమే వజ్రపాణి పట్నానికి తిరిగి వచ్చాడు. ముఖం చిన్నబుచ్చుకుని "మనకి రంగడు లేడు రమణీ" అని చావుకబురు చల్లగా చెప్పేశాడు. రంగడెలాగా పదిరోజుల్లో చనిపోతోతున్నాడు గనుక ఈ అబద్ధం చెప్పడం మరేమంత కొంపమునిగిపోయే అపరాధం కాదని కూడా వజ్రపాణి తన అంతరాత్మకి నచ్చచెప్పుకున్నాడు.

* * *

ఉన్నట్టుండి అశ్లేషాపిక్చర్సువాళ్ళకి బిచ్చగాళ్ళు కావలసివచ్చారు. వాళ్ళకప్పుడెప్పుడూ రాజులు కూడా కావలసివస్తారు. కానీ రాజులతో వాళ్ళకట్టే చిక్కుండదు. మెడకాయపైన తలకాయవున్న సాధారణ మనిషి ఎవడికైనా సరే చెమ్కీ గుడ్డలు తొడిగి, గాజుపూసల దండలు రెండు వేసి, వలెవాటు గిరజాలు కైసేసి రాజుగా నిలబెట్టగల సామర్థ్యం వాళ్ళకుంది. బిచ్చగాళ్ళకలాంటి అలంకారాలు పనికిరావు. వీలయినంత మాసి, చినిగిన దుస్తుల్లో బాగా వికారంగా కనిపిస్తే తప్ప వీడు బిచ్చగాడేనని ప్రేక్షకులు నమ్మరు. ప్రేక్షకులు సామాన్యంగా సంశయాత్ములు.

ఐనా ఒకరిద్దరు బిచ్చగాళ్ళని తయారుచేయడం అశ్లేషా పిక్చర్సువారికేమంత కష్టమైన పనిగాదు. సెట్ కీపరునుంచీ కథానాయకి వేలువిడిచిన తమ్ముడివరకూ ఎవరో ఒకరు బొచ్చె చేతబట్టుకుని అపర బిచ్చగాళ్ళలా సాక్షాత్కరించి అవసరం గడుపుకోడానికి ఉపకరిస్తారు. కానీ వచ్చిన చిక్కల్లా ఏమిటంటే అశ్లేషా పిక్చర్సువాళ్ళకి దాదాపు నూరుమంది బిచ్చగాళ్ళు కావలసివచ్చారు. అందులోనూ వాళ్ళందరూ నిజమైన బిచ్చగాళ్ళే అయితే ఆ ఘట్టంలో సహజత్వం ఉట్టిపడగలదని విజ్ఞులు కొందరు సలహా యిచ్చారు.

నిర్మాత డైరక్టరు ముఖం చూచాడు. డైరక్టరు ప్రొడక్షన్ మేనేజరు ముఖం చూచాడు. ప్రొడక్షన్ మేనేజరు పేవ్‌మెంట్ల వెంబడే పరుగులు తీశాడు. మరునాటి ఉదయం తెల్లవారేసరికి రెండు లారీల నిండుగా బిచ్చగాళ్ళు హాజరు పరచబడ్డారు.

కలకలలాడుతున్న పూలతోట మధ్య రాజమహలు బిచ్చగాళ్ళకు నేత్రపర్వంగా కనిపించింది.

"అబ్బబ్బ ఏం మహలు! ఏం మహలు!" అంటూ విస్తుపోయాడు ఒక అమాయకపు బిచ్చగాడు.

"గొప్ప మహలేలే! వట్టి అట్టముక్కలు" అన్నాడొక తెలివైన బిచ్చగాడు.

"ఐతే యింత పైకి పటారమే నన్నమాట" అంటూ మరొకడు కిసుక్కున నవ్వాడు.

"ఇక్ మాట్లాడకూడదు. మీరందరూ ఒక్కొక్కరుగా ఈ దారంట పైకి వెళ్ళాలి. ఆ మలుపు తిరగ్గానే అర్చి దగ్గర మహారాణి నిలబడివుంటుంది. ఆమె దగ్గర దానాలు పరిగ్రహించి అందరూ ఒక్కొక్కరుగా ఆవైపునుంచే తిరిగి వచ్చేయాలి" అన్నాడు దర్శకుడు.

ఒక సందేహప్రాణి డైరక్టరుకు అడ్డుతగిలి "ఏవాళ మహారాణిగారికి ఈరోజింత దయ కలగడానికి కారణమేముందీ?" అన్నాడు.

"ఓహో! అదా మీ సందేహం! అలా అడగాలి. మహారాజుగారు పొరుగు దేశం పైకి దండెత్తారు. యుద్ధం జరుగుతోంది. ఓహ్ భయంకరమైన యుద్ధం. రాజుగారి విజయాన్ని కోరుతూ మహారాణి బీదలకు దానధర్మాలు చేస్తోంది."

బిచ్చగాళ్ళు ఒక్కొక్కరే పైకి వెళ్ళి, అవతలి వైపునుంచి క్రిందికి వచ్చేయసాగేరు.

"ఇంకా ఎందరున్నారండీ?" అన్నాడు కొంచెం విసుగుతో కెమెరామెన్.

"ఇదిగో కడపటివాడు" అన్నాడు డైరక్టరు.

బిచ్చగాడు మహారాణిముందు నిలబడ్డాడు. మహారాణి చెలికత్తె అందించిన నూతన వస్త్రాల్ని చేతికి తీసుకుంది. బిచ్చగాడు చేతులు ముందుకు చాచాడు. మహారాణి బిచ్చగాణ్ణి చూచింది. బిచ్చగాడు మహారాణిని చూచాడు. బిచ్చగాడు "రమణీ! రమణీ!" అన్నాడు. మహారాణి "రంగా రంగా" అంటూ బిచ్చగాణ్ణి కౌగలించుకుంది.

కంగారుతో డైరక్టరు "కట్ కట్" అన్నాడు.

శహాజీ ప్రబంధములు

శ్రీ యస్వీ జోగారావు

తంజావూరు మండలమును కొంతకాలము ఆంధ్ర నాయక రాజులను అటుపిమ్మట భోసలవంశ మహారాష్ట్రులను పరిపాలించిరి. ఆనాఁడా మహారాష్ట్రప్రభువులును ఆంధ్రనాయక రాజులవలె ఆంధ్ర వాఙ్మయమును పోషించియుండుట, పోషింపుటే కాదాంధ్రమున స్వయముగ గ్రంథరచన చేసియుండుట చరిత్రలో నొక అపూర్వ సన్నివేశము 1 అట్టివారిలో ప్రాతఃస్మరణీయుఁడు శహాజీ. ఇతఁడు ఛత్రపతి శివాజీ సవతి తమ్ముఁడగు ఏకోజీ పుత్రుఁడు. ఇతని రాజ్యకాలము క్రీ. శ 1684-1712*. ఇతఁ డతి మాత్ర గీతి సాహితీప్రీతి గలవాఁడు. నాట్యకళా కోవిదుఁడు. బహుభాషా వైదుషి గలవాఁడు. విశేషాభిమాని. తంజావూరు సరస్వతీమహాలు గ్రంథభాండాగారములో తత్సంపాదితమై ముప్పది తాళపత్ర సంపుటములుగా పడియున్న సంగీత లక్ష్యలక్షణ గ్రంథకోశము, తదంకితములుగా గాక తదుపజ్ఞములుగనే కన్పట్టుచున్న యిరువది ప్రసరిణతి యక్షగాన ప్రాయములైన తెనుఁగు రచనలే అందుకు ప్రబల నిదర్శనములు కాఁగలవు.

అతని కృతులన్నియు నముద్రితములు. ఆ యిరువదింట నాల్గు ప్రబంధములనియు, పదునారు నాటకములనియు పేర్కొనఁబడినవి. ఆ నాటకములన్నియు నొక రొత్తు, అతని ప్రబంధము లొక రొత్తు. నాటకములు సంవాదశైలీప్రధానములు; కేవలము నాట్యాత్మకములు. ప్రబంధములనఁగా అవి మన మనుచరిత్రాదుల వంటివి కావు. నృత్యోద్దిష్ట గీతిబంధ ప్రకృష్టము లైనవి. అవి యింతే మన వాఙ్మయచరిత్రలోను అత్యపూర్వములు, అపురూపములు నైనవి. ఆ ప్రబంధముల అసలు స్వరూపమును పండితుల ఉపయోగార్థమై సోదాహరణముగా వీలైనంత విపులముగా నిట నిరూపింతును.

ఈ ప్రబంధములలో పల్లకిసేవాప్రబంధము లనునవి యొక విశిష్ట సంప్రదాయమునకు చెందినట్టివి. శహాజీ అట్టివి రెండు రచియించియుండెను.

విష్ణుపల్లకి సేవా ప్రబంధము†

విరహావిహ్వలయగు లక్ష్మి విష్ణుదేవుని పాలికి మంజుభాషిణీ ప్రియంవద లను చెలికత్తెలను బుత్తెంచును. అనంతర కథాక్రమము: వార లతని కొలువును గొనియాడుట, దేవి మనవి విన్నవించి తమకు స్వామి సముఖము చేయింపుఁడని విష్వక్సేన నారదగరుడాదులను వేఁడుట, వారందుల కియ్యకొనమి వారిని గట్టిగా నాల్గు చివాట్లు పెట్టి తామే స్వయముగా స్వామికి విన్నవించుట, స్వామి సమ్మతించి సపరివారుఁడై పల్లకిపై బయలుదేరుట—

అక్కడ పడకటింటి వర్ణన:

దరువు

పడకటింటిని జూఁడు। పడఁతి నిక్కముగాను
తనయక మహాలక్ష్మి। తాండవమాడుచున్నది॥
గగనచరులీఁ దిఁ। నగరికిఁ దెమ్మని
జగతీపతి పంచిన। చిగురుబోఁడులో యన
మకరాల నికరాల। తిగిన జగతులను
ముకురాల నీడలు। మిగులఁగా జెలఁగిని॥
చెలఁగి తలిదంత్రులు। సేవింప మిను వాక
తిలకించి దివినుండి। దిగివచ్చెనో యన
కలువలరాయని। కళలు సోఁకినపుడె
పెఁజాలగోడలు। జలములూరి జారీని॥
కనకగర్భుఁ డరసి। కలవింగారము దెచ్చి
పొనర నించినయట్టి। వింతవస్తువులను
దనరుచున్నది చాలా॥

---

1. (వివరములకు) చూ. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి 'తంజావూరి మహారాష్ట్ర భూపతులు—ఆంధ్రసాహిత్యము' అను వ్యాసము—భారతి, డిసెంబరు, 1953 & జనవరి, '54.

*See—'Maratha Rule in the Carnatic' By Sri C. K. Srinivasan.

† తం॥ స॥ మ॥ కే. సం. 618-619.

తిరువాత విష్ణుస్తుతి—అవతార వర్ణన; స్వామి కారగింపు—(వివిధ పదార్థములు పేర్కొనబడినవి), స్వామి పవళింపు, మేలుకొలుపు, శోభనపాఠము. పరి.

రచన: ఒకమాదిరి. ఇందు దరువులు, ద్విపదలు, పద్యములు, మాత్రిధారవచనములేగాక, దరువులుగాఁ బాడుట కనువగు కందములు, తోదక వృత్తములు, వృషభగతిరగడ, మయూరగతిరగడ, చూర్ణిక, లయగ్రాహి, లాలిపాట, ఆరతులు, అష్టకము, ధవళశోభనములు, మేలుకొలుపుపాటలును గలవు.

విశేషములు :

ఇందలి మయూరగతిరగడ ప్రసిద్ధములగు నవవిధ రగడలలోఁ జేరదు. క్రొత్తది.

ఉదా :

'మారమణి వల్లభసమారమణి మోదం
బూరఁ గరుణింపను మయూరగతిరో (తో) వి
తేర మది విన్నవిటు దీర్ఘముగు దండెన్
భారముగ రాజిలెడు పల్లకియు వచ్చెన్॥'

ధవళము సాధారణముగ జయశబ్దాదిగా నుండును. ఇందట్లు లేదు.

ఉదా :

'దయసేయుము వనమాలి'
దయసేయుము గుణశాలి...,

మేలుకొలుపు దేశాక్షి, మలహరి, దేవగాంధారి, భైరవి—అను సదయరాగములలో నున్నది.

శంకరపల్లకిసేవాప్రబంధము*

ఇందొకరితో నొకరు చెప్పుచున్నట్లు శివుని కొలువు చెలువువర్ణనతోఁ గథారంభము.

'చలిగట్టుపట్టి నాథుని
వలపునఁ దెమ్మన్నవిందు వచ్చితి మిమ్ముగో
కొలువున వెలయుచు నుండెను
జిలువలదొర తాల్పు చెలువు గనుఁగొనవమ్మా'.

ఇది కథ యెత్తుగడ మొదటిపద్యము. దీనినిబట్టి విష్ణుపల్లకిసేవాప్రబంధమున లక్ష్మివలెనే యిందు గౌరియుఁ బ్రియునిపాలికి చెలికత్తెలను బుత్తెంచిన ట్లున్నది. శివసభావర్ణన చేసినవారు వారే కావచ్చు. వారు స్వామికి గౌరీదేవి మనవి నివేదింప గంగను, మృగమును, కుండలీంద్రుని, గోరుదురు.

'మర(లు)వక దండమాడు విను మా,
యిది నీలోక భారమా, రమా
తరుణిసమాన మా గిరిజ,
తాపసమా, దలమేల, మానుమా,
కరముల మ్రొక్కు మా మనవిఁ
గైకొనుమా, హరుతోనఁ దెల్పుమా,
వర(ల)విఁకఁ జూడుమా మదిని
వీధివిటంకశిఖాంకరత్నమా !'

అని 'మేను తెలియనివాని మేనమామను' గూడ వేఁడికొని లాభములేక గంగాదులను జీవాట్లుపెట్టి స్వయముగనే స్వామి సముఖము చేసికొని గౌరి మనవి వినిపింతురు. శివునాజ్ఞయైనట్లే పల్లకి వచ్చును. తద్వర్ణన :

దరువు : శంకరాభరణము

శృంగారంపు పల్లకి, చెలువు జూడవె
సంగీత మేళముతోన, దనుదెంచిరి దేవుని॥
జిగిమించు జలపూత, జీని పచ్చాంగము
బిగువునిండు బుసున, బింజామరయు
నిగనిగయని పచ్చపగడంపు దండెయు
ముత్యాల నిగడాల, మంచి చట్టునుగల ॥౧॥
॥శృంగారంపు॥

చిలుకపచ్చలగచ్చుచేసిన తిబికిని
కురువిందముల గీలుకొను గుబ్బలు
సరిగెకండె సల్లిన । జమిలివాలి దింగులు
ఒఱగుబిల్లలుపట్టు । బిగుగుబిల్లలుఁగల ॥౨॥
సరిజేనికుట్టుల । సగశాతి నెత్తలు
హరినీలములనుక త్తెరకోలలు
హురుముంజిపూసల । నొరపైన కుచ్చులు
పరగు కురాళము । పట్టుతోరములుఁగల ॥౩॥

అమరు లొక్కకరు కోలాంజి, సురటి, గొడుగులు, పడిగెలు, పావడలును బట్టి స్వామిపల్లకి లేవనెత్తుదురు. 'కదలింపకరోయి! కదలనీకరోయి' అని బోయీలకు హెచ్చరికలు వల్కుదురు.

పల్లకి గౌరి నగరి ముంగిసాల డిగఁగానే 'జయ సకల గీర్వాణ వందిత సుందర పాదారవిం' దేత్యాదిగా నంది యొక చూర్ణిక నందుకొనును.

తిరువాత పటకటెంటె వర్ణన, పార్వతీదేవి సింగారము, శివుని యారగింపు. ఆయా సందర్భములందు

*తం॥ స॥ మ॥ కే. నం. 620-624.

వివిధ వస్తుచయము. ఆభరణ భోజన పదార్థ విశేషములును పేర్కొనఁబడినవి.

ఇఁక బవళింపుసేవ—చెలికత్తె లష్టకములు చదివి, పార్వతికిఁ బడకటింటి మెలకువలు దెలిపి, యయ్యవారి కప్పగింతె పెట్టుట జాముజామునకు వాకిలి కావలివారల హెచ్చరికలు - నాల్గవజాము గడచునంత పార్వతీ పరమేశ్వరులకు మంగళహారతులు—

ఇందలి రచన చక్కనిది. చిన్న పెన్నటిదనుకఁ దంజాపుర పరిసర శివాలయములం దుత్సవసందర్భములం దీ శంకరపల్లకి సేవా ప్రబంధమును ప్రదర్శించు టొక యాచారమై యుండెడిదని శ్రీ పి. సాంబమూర్తిగా రనుచున్నారు.

ఈ పల్లకి సేవా ప్రబంధముల ప్రదర్శన ఫక్కికను గూర్చి శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగా రిట్లు తెలిపియున్నారు. *

“పల్లకిసేవా ప్రబంధములు చిత్రమైన కల్పనతో గూడిన నాట్యాభినయ ప్రధానములైన నాటకములు... నాట్యకళా ప్రవీణలైన తరుణీమణులు పల్లకి బోయీల పాత్రలను ధరించి స్వామి పల్లకిసేవ చేయుదురు. ఇందు నిమిత్తము పల్లకి బోయీలలో ముందువారు, వెనుకవారు రెండు గుంపులుగ చేర్పడి కథ వినిపింతురు. చిత్రమైన పరికల్పన మిది...”

త్యాగవినోద చిత్రప్రబంధము †

ఇది తం॥ స॥ మ॥ గ్రంథ వివరణికలో ‘త్యాగరాజ వినోదచిత్రప్రబంధ నాటకము’ అని పేర్కొనఁబడినది. ఇది ప్రబంధమైనను నాటకశబ్ద వాచ్యము నగుటకు గ్రంథావతారికలో నొక సూత్రధార వచనమున గ్రంథ నామాంతర సూచనగా నున్న ‘శంకర కాళీనటన వాద మహానాటక’‡ మను మాటలే తార్కాణము. అది కాక ఇది పదంకములుగా విభజింపఁబడినది. ప్రత్యంకాంతమందును గ్రంథకర్తృ నామసూచకములుగా నున్న గద్యలన్నిట నిది ‘త్యాగవినోద చిత్రప్రబంధ’మని మాత్రమే పేర్కొనఁబడినది.

ఇం దుపక్రమోపసంహారములందే (గ్రంథావతారికాంకాంత గద్యలందు) విపులముగా సద్యపు సంస్కృతము ప్రయుక్తమైనది. మధ్య నంతట సంస్కృత శబ్ద బహుళముగా మహారాష్ట్రభాష వాడఁబడినది. ఏడెనిమిది తెనుగునకును ప్రసక్తి గలదు. అందుచేతనే దీని కిట ప్రసక్తి గల్గినది.

విఘ్నేశ్వరాగమనముతో గ్రంథారంభము. ఇందలి కథతో వినాయక పాత్రకుఁ బ్రసక్తి లేదు. కాని శహాజీ కృతులలో తరచు గ్రంథారంభమున వినాయక ప్రార్థనయే కాక పాత్రప్రవేశము గూడ చూపట్టెడి.

కథా విషయము

ప్రథమాంకము :

ప్రచండుఁ డను కటికమువాఁడు భద్రకాళి యాగమనము దెల్పి సభాసజ్జీకరణ మొనరించును. దేవి సభకు వచ్చినది. నారదుఁ డామె దర్శనార్థము వచ్చినాఁడు. దేవి ‘నాట్యాది విద్యానైపుణ్యమునందు నా యంతవా రెవరైనఁ గలరా?’ యని విజ్ఞపించును. కలరని చెప్పి కలహప్రియుఁడు ‘శాహేంద్రపాలిత చోళదేశ’మందలి ‘శ్వేతారణ్య’ వాస్తవ్యుఁడైన త్యాగేశ్వరస్వామికడకు వేంచేసి భద్రకాళి గర్వోక్తులు తెలియఁజేసి, పంతమున కతనిఁ బురికొల్పించి మరల దేవి కక్కడి మాటలు తెలియఁజేయును. ఆమె త్యాగేశుని కడకు వచ్చినది. ఇరువురకును దీర్ఘముగా సంవాదము జరిగినది. వాదాంతమునఁ గాళి పరమేశ్వరునిచే “దేవనాట్య రాజనాట్య దేశనాట్యేషు యత్ర తవ పరిశ్రమోऽస్తి?’ యని ప్రశ్నింపఁబడి, ‘దేవనాట్య పరిశ్రమస్తు। దేవలోక ఏవ రోచ్యతే। అత్ర భూలోకే రాజనాట్య మేవ। ప్రశస్త మితి మన్యతే జనః। అతః యేవ రాజనాట్యం బహువిధ మస్తి। తన్మధ్యే రాజశేఖరః। శ్రీ త్యాగరాజప్రీతయే। భోసలవంశ సుధాంబుధౌ। ఏకరాజాధిపాం చాత్మజేన। శ్రీ శాహమహారాజేంద్రేణ విరచిత నానాభాషాభూషిత। త్యాగేశ నామాంకిత త్యాగేశ ప్రీతయే సంగీత సాహిత్య దుగ్ధాంబుధి మథిత్వా నవనీతవత్। సారతర త్యాగ వినోద చిత్రప్రబంధ లీలాం విరచితవాన్। తాం దర్శయిష్యామి పశ్యత్వమ్॥” అనును.

---

* మూ. వారి వ్యాసము - భారతి, డిసెంబరు, 1953

† తం॥ స॥ మ॥ కే. సం. 530-534.

‡ ఆంధ్రనాట్యసూచికలో నిది కాళీతాండవ నాటక మని పేర్కొనఁబడినది.

పరమేశ్వర వచనమ్॥ 'భవ త్వస్మిన్ ప్రబంధేపి । మమ పరితోషో౽స్తి । అతస్య ద్భక్తిద్భక్తిం ప్రదర్శనీయాం । మయాపి ప్రదర్శతే॥'

సూత్ర॥ 'ఏవం పరమేశ్వర వచన మాకర్ణ్య కాళి నిజ తౌర్యత్రికం ప్రకటయతి॥'

ఇక్కడినుండి కొంత దూరము నారద శిష్య సంవాదము సాగును. అది యీ గ్రంథమునకుఁ బువరవ తారికా ప్రాయముగా నున్నది. సూత్రధారుఁ డేకో ప్రసంగము గ్రంథముగురించి మహోదాత్తభావములఁ గావించును. శిష్యుఁడు నారదు నదియేమని యడుగుట, గురువుగా రద్దాని కొంత వివరణము చేయును.

త॥ కవి స్వభావతో విష్ణుదైవతమునకు మానస పూజా సమర్పణము గావించును. అంతట శివునకుఁ గృతినిచ్చుటకుఁ దన యర్హతను గర్హించుకొనును.

త॥ ధ్రువ మఠ్య రూపక ఝంప త్రిపుట అట ఏక అను సూళాది సప్తతాళములు విస్తరించుచు గౌళ రాగ ప్రభేదములగు నారాయణకన్నడ మాళవ రీతి పూర్వచ్ఛాయా కేదారగౌళలం జేడింట మరాటీ దరువులు రచించెను. త॥ 'కవి శ్రీరామచరిత్రను, అధ్యాత్మనుధినమును నొక పదంబున సంపుటించి చమత్కరించెను.' తదుపరి శివస్మరణతో నీయంకము ముగియును.

ద్వితీయాంకము :

గురుశిష్య సంవాద మింకను నడచుచున్నది. కవి విఘ్నేశ్వర హరిహరాదుల స్తుతులు చేసినాఁడు. 'ఇప్పుడు నడచే నాటకంబులో అంతర నాటకంబు చమత్కరించె' నఁట. ఈ యంకమునందుఁ గథ కొక క్రమ పరిణతి యున్నట్టు తోఁపదు. సంగీతము చిత్ర చిత్ర రీతుల విస్తరింపఁబడుట కానవగును. స్వరజతితో సప్తతాళములందు నొక గీతము, విద్వత్ప్రశ్న లీలా, పామరబుద్ధి లీలా, ముక్తపదగ్రస్త లీలా, పరభ్రామకాత్యుక్తి శబ్దచిత్రలీలా, రాగమాలిక మొదలగున వీ యంకమునందలి రచనా విశేషములు. ఇందు లీలా యనునది కొకరకము మరాటీ దరువు కాఁబోలు. విద్వత్ప్రశ్నాదు లాయా దరువులలోని విషయమును సూచించును. విషయ మేదో వేదాంతమువలె నున్నది.

తృతీయాంకము :

ఇందు మరల విఘ్నేశ్వరస్తుతి గలదు. 'ఏకశబ్ద భిన్నార్థంబుగా జేపిస్తోత్రంబు' గలదు. అంకమంతయు లీలామయము. ఇంకలి నిరోష్ఠ్య లుప్తాక్షర నిందాస్తుతి మణిప్రవాళాది విశేషములతో కవి రచించిన లీలా పదము లతని చిత్రకవితా ప్రతిభను జాటగలవు.

చతుర్థాంకము :

ఇందు మరల విఘ్నేశ్వర స్తుతి గలదు. త్యాగేశ స్తుతి విశేషము. షడ్భాషా భిన్న చరణలీలా మొ॥ చాల గలవు. సవ్యాపసవ్యసమపదలీలా దరువన దొకటి తెలుఁగున రచింపఁబడి యుండుట విశేషము.

అది :

రేగుప్తి॥ ఆది

వలతిటిటిరి తిగుడ । మగువవ లోపు వసును
కవరు తీగు తీరునక । నెవరు బోను బోరున నె
మెలఁతి మీర మీతిలమె । కలయు మా నుమా యలక
చేడియురాను రాయనిచే । బోడిమి గాని గామినిబో
వాడే శాహేశా దేవా । రా దేవ రావరేరా...

ఇందు 'అంతుతాళా' లను పేర తురంగలీల, రాజమాడామణి, మదన, వీరవిక్రమ, హంసనాద, అనంగ, జయశ్రీ అనునవి యుదాహరింపఁబడినవి.

పంచమాంకము :

ఇందుఁ గథాపరిణతి కొంత సూచింపఁబడినది. 'నాసజయార్థముగాను భద్రకాళి' శివునితో 'పరాకు స్వామి విను నటశిఖామణి! మీరు వినుపించిన తెనుఁగు శృంగార పదంబు సంస్కృతమందు భక్తిపరంబుగా వినుపించెదను...మీరు వినుపించిన సంస్కృతి భక్తి దరువు పదభంగంబున తెనుఁగు శృంగారపదంబు చేసెద'నని ప్రతిజ్ఞ చేయును. కాని ప్రతిజ్ఞాపాలనము నకుఁ దార్కాణమైన రచనావిశేష మిందుఁ గన్పట్టదు. ప్రత్యంతరము లెందైనఁ గలవేమో !

ఈ యంకమునందలి రచనా విశేషములు:

ఏక ద్వి త్రి చతుః పంచాక్షర దరువులు, సంగీత సాహిత్య ప్రయాసలీలా (స్వరకల్పనతో నున్నది. ఆ పేరు గమనింపఁదగినది), 'సంకీర్తియందు భాషా ద్వయం, అర్థద్వయం, రాగద్వయం, స్వర మొక్కటై' గా లీలాదరువులు, సర్వశబ్దార్థ తాళ త్రింశన్నవరత్న ప్రబంధలీలా.

ఇందు పేర్కొనఁబడిన మరికొన్ని రాగతాళ విశేషములు:

రాగ॥ సింహలీల, హంసలీల, మల్లికామోద, అంతరక్రీడ, తురంగలీల, దీపకము.

తాళ॥ చతురస్రశము, త్ర్యశ్రతాళము, ఝంపక్కా, క్రీడాతాళము, ఉదీక్షణ, ముకుందతాళము, లఘుశేఖరము, దీపకతాళము, చచ్చత్పుటము, చాచపుటము, షట్పితాపుత్రకము, సంపద్వేష్టకము, ఉద్ఘట్టితము, వనమాలి, బసవశంకరము, హనుమచ్ఛృంఖలము, పంచఘాతిమత్స్యము —

షష్ఠాంకము :

ఇందు మొదట త్రిమూర్తిస్తుతి చేసి, పిదప 'ఉత్తికృత్యమున త్యాగేశపదకూసుధా సేచన పర్వికృత్యమున కవితాలతాసుమమోద ప్రకటన లీలా సమర్పించెనట రూటువలెను' అని కవి తన ప్రస్తుతి రచన నొకపరి సింహావలోకనము చేసికొనును. అది—

బిలహరి—ఆది

మాటలు కొన్ని త్యాగేశు దయచే
మాటలు గట్టియుంచినా నిందు
నాటి నేటికి జగములనూ
వరులాడుచుమంతే నోటి ॥మాటలు॥

కరములాకూ తోగలాకో - కన్నులాకూ లోగాకో
ధరదల్లాని తెమ్మెర కరణిని మండెనోటి ॥మాటలు॥

రూపరహితమూలై చాలా - రూఢిగా దిశాలనూ
వ్యాపించూమూ మేటివిరులవాసనావంటి నోటి ॥మా॥

సకలావర్తా త్యాకామై సరసాకృతి గోచరమై
ప్రకటా తారా త్యాగ-పరాత్పరావస్తువంటి నోటి ॥మా॥

ఇందలి రచనా విశేషములు:

సంపూర్ణషాడైక యమకలీలా, జ్ఞానాజ్ఞానైక శబ్ద భిన్నానామ కల్పనాలీలా, అనేక కోశ శబ్దార్థ గ్రహణ పదార్థలీలా, కవి భావ నిగూఢ వ్యంగ్యార్థలీలా, కవి ఖండిత వ్యంగోక్తి భావదిశ రూపక ప్రకటనలీలా, ఆద్యస్వరాంతర ఘటితలీలా, అంత్యస్వరద్వయ సమ వర్ణార్థలీలా, సవ్యాపసవ్య భాషాద్వయ, దయద్వయ, తాళద్వయ లీలా మొ॥ అందుఁ గొన్ని వేదాంతవిషయ ప్రతిపాదకములైనవి.

తెలుఁగున క్రమసప్తస్వర వర్ణార్థలీలా పేర నొక్కచో వరువు తోడి, కల్యాణి, ఖామి, శంకరాభరణము లను నాలుగు రాగములందుఁ బ్రవర్తింపఁజేయ నున్నైనది గలదు.

తదుదాహరణము :

అటతాళము

సరిగామా పథ-నీ వింక సైరిక (?)
తెరుణు లెవ్వగ-దాని సరిగా రీ
ఆలినీలవేణులు-అబ్జనిభాస్యలు
కలకంఠులు-దాని సరిగారీ
జలజదళాక్షులు-సరసబింబోష్ఠులు
మెలఁత లెవ్వగ-దాని సరిగారీ॥

గ్రంథము చివరిభాగమున జక్కిణి దరువులను నింకొక రచనావిశేషము గలదు.

ఉదా! బిలహరి—ఆది

ఇందు కళాధర-సుందర వదన పు
రందరవందిత చరణారి
కుందరదన యుర । విందనయన శర (?)
వందిత శాహేంద్ర ఆ । నందరూప త్యాగేశా॥

తాళము॥ తంధిమి తధికిట తరికిటతక
ధీం గిణాంగు తక । దళాంగు తద్ధిమి
తక్కిణాం తక కిణాం కిటతరి
తక ధళాంగు తక । ధాణకు తకధిత్త॥

స్వరము॥ పారిగ గారిస । రిగ ప పామ్మగ
గపధప పనిధ । రీ సనిధప మగ
పధప నిధ పధని । పధ మగగా రిరిపా॥

తదుపరి త్యాగబ్రహ్మాదీశ స్తుతి గలదు.

గ్రంథాంతము :

కవివచనము॥ "సకల భాషాభూషిత సకలార్థ విరాజిత సకల చిత్రసాహితీ సంగీత భరిత సంభరిత విద్వద్భ్రమర చాతురీ మాధురీ సుధాప్రద త్యాగ వినోద చిత్ర ప్రబంధం సంపూర్ణమ్"

రా॥ వసంతభైరవిలో మంగళము.

తా॥ అంకాంత గద్య 'ఇతి శ్రీ సకల భువనైక పూజ్య ప్రాజ్య సామ్రాజ్య లక్ష్మీకటాక్ష సకలరాజాధ్యక్ష (భో) సజ్జ్ఞాన విచక్షణైక రాజ దీపాంబికాత్మజ శ్రీ శాహమహారాజ విరచిత త్యాగవినోద చిత్ర ప్రబంధే షడంకః (షష్ఠాంకః)'॥

సమీక్ష

గ్రంథము త్యాగేశాంకితము. త్యాగేశుఁడు కవి కిష్టదైవతము. గ్రంథ ప్రతిపాద్య విషయము తన్మాహాత్మ్యము. అనఁగా నాట్యకళానైపుణ్యమునఁ దనయంత

వారు లేరని విఱ్ఱవీగెడు భద్రకాళి గర్వ మడుపఁ దలఁచి నారదుఁ డిందులకు నటరాజ మూర్త్యంతరమగు త్యాగేశునిఁ బురికొల్పుట. వారలిద్దఱకు వాదోపవాదములు నడచుట, అవి వివిధ నృత్యప్రక్రియల ద్వారా ప్రదర్శన రూపము దాల్చుట, తుదకు భద్రకాళి యోడుట, త్యాగేశుఁడు విజయసూచకముగాఁ దక్షిణాప్రాయమును కాళీపాణిగ్రహణము చేయుటయు నిందలి విషయము.

గ్రంథము పెద్దది. విషయము స్వల్పము. కాని రచనావైచిత్రి రమణీయము, చమత్కారావహము, ఆశ్చర్యకరము. కవి తన సంగీత సాహిత్య భరతవిద్యా నిపుణత్వము నిరూపించుకొనుటకు రచించినట్లున్నది. అక్షరములతో నాటలాడినాఁడు. శబ్దజాలముతో నింద్రజాలము చేసినాఁడు. బహుభాషాధిజితులతో తవర్గగతులతో హల్లీసము లాడినాఁడు. సంగీతసాగరములో రాగతాళ సంగతులను తరంగములతో అచి పాచి బారలు వైచి యీఁదినాఁడు. ఇట్టి చిత్రవిచిత్ర ప్రక్రియ గలది కనుకనే యిది చిత్రప్రబంధమైనది.

గ్రంథము గీత ప్రచురమైనది. అక్కడక్కడ సంస్కృత శ్లోకము లున్నవి. ప్రసిద్ధ రాగతాళ మేళన మనేకథా ప్రదర్శింపఁబడినది. సంస్కృతమునందును దరువులు రచింపఁబడినవి. తెలుఁగునందు కొద్ది. మరాటీ 'లీలా' దరువు లధికము. సూళాదితాళవిస్తరణ, గౌళరాగ ప్రభేద ప్రస్తారము, ఒక్క దరువులోఁ జతుర్విధ రాగానుకూల్య మిముడ్చుట, భిన్నభావలు, సంగులో శ్లేషలు, శబ్దాలంకారములు, అనులోమ విలోమాది ప్రక్రియలును గలవు. దరువులకుఁ బిఱుమగా స్వరకల్పన (స్వరజతి), తాళక్రమము (స్వరచొల్లు జతి) నుదాహరింపఁబడినవి. సంగీత సాహిత్యములతో శతావధానము చేసినాఁడు శహాజీ. కవిమాత్రుఁ డిట్టి గ్రంథము రచింపఁజాలఁడు. ఇట్టి గ్రంథము రచించిన శహాజీ నిస్సందేహముగ మహావిద్వాంసుఁడైయుండునని చెప్పవలెను. అతని కృతులందే కాదు యావద్దక్షిణాంధ్ర యుగవాఙ్మయమునందు నిది యతి విశిష్టమైన కృతి. అయితే పూర్తిగా తెలుఁగుకృతి కాకపోయినదన్న దొక్కటే కొదవ.

పంచరత్న ప్రబంధము

ఇందొక కథగాని సన్నివేశముగాని లేవు. పరమేశ్వరుని కొలువునకు వరుసగా కొందరు బిరుదు మిటారులు, నటసిద్ధయోగి యనువాఁ డొకఁడు, ఒక చెంచు నట్టువోజు, ఒక బిరుదుబంటు, కొందఱు 'పావనకాండ్లు'ను వచ్చి నాట్య ప్రదర్శనములు నెరపుదురు. రత్నముల వంటి నటపంచకము యొక్క నృత్య ప్రబంధ ప్రదర్శనము వస్తువగుటచే గ్రంథమున కా పేరు వచ్చి యుండును. ఇందును నాట్యోపయోగి గీత ప్రబంధ విశేషము లనేకము. భాష తక్కువ. స్వరతాళముల విన్యాస మెక్కువ. శాస్త్ర ప్రక్రియ మరీ కేవలముగా ప్రయోగింపఁబడినదిందు.

కొన్ని యుదాహరణలు :—

౧. మోహారం

తత్తక్కారం | ఝుఁఝుఁ | తత్త తత్తతాంద త్తత్తా |
తోధికితాం తంనందాం | తాంగత్తోకిట తకదరికిట |
తందంధితాంద్దితక్క | తోంధోం గత్తోం
ధిక్క తక్క | తోంతక తకధికి తంనతాం॥
తీరుమానం :— తందక | తకతక | తంనక | తకతక
తందక | తకతక | ధళాంగతోం॥
ధింధికి | ధికిధికి | ధింధికి ధికిధికి
ధింధికి | ధికిధికి | ధింగణతోం॥

....

తకనరాంగు తక నరాంగు | తద్ధింగిణతోం॥

౨. గణపతి కవుత్తం

ధీత్తైత్తై | ధీత్తైత్తై | తత్తాదిద్దితోనం తా |
ధక్కిట్ట ధిక్కిట్ట తక్క | ధిగుగుకుతాం తోంగ
ధీంనత్తి ధీందత్తి ధీందధీం దత్తక్క |
తధిమిధిమితతక్క | ధిగుగుకుతాం తోంగ
తా తా ధిత్తా దిక్కిట తకధిక్కిత్తాం దత్తి
దిక్కిట కిటతక | ధిక్కిట కిటతక
తోంగుఁడె కిటతక | నంగిడ కిడతక
కరిముఖ హార సుర | వర కమలజ నుత |
వరపాశాంకుశయుత | చరణం తే శరణం
తక్కిట ధిమికిటతోం | తకతోం
తధిక్కిట తకధిమికిట్ట తోం ॥ సతతం ॥

3. నెలకట్ల

తెయితెయిందత్త | తాహత్తి తెయితెయిం |
దత్తతత్త | తెయితెయిందత్తతాహత్త|
తెయితెయిం | దత్తితిత్తి | తద్దిందత్తా ధింనత్తా |

ధిందత్తా | తత.తధి | తత తధి తకధిందత్తా |
ధిందత్తా | ధిందత్తా | తత తధి | తత తధి ||
...తధింగిణతోం ||

౪. సొల్లుకట్టు

ౕంధి తద్ధిమి తక ఝుం గణక ఝుగ।
తోంగుకు। తకతోంగుకు ధిమికిటు।
ౕంధి తాంధితక ధణం త్తకిణ ఝుక। తతోంగతకథోంగ॥
తోంతోంగ। తకతక ఝుకణక ఝు॥

౫. జతి

తాంధి ధి తాం దాం। ధిద్ది తాం దాం।
ధిద్దితాందాంతక। తోంతోంతోం గతోంతోంగ॥

౬. ప్రబంధదరువు

బిలహరి - ఆది

ఇందుకళాధర। సుందర వదన పు
రందర వందిత చరణా రె।
కుందరదన యరె। బిందువదన కర
నందిత శాహేంద్ర నందరూప త్యాగేశ।
రొలిలాం రొల్లాం రె। దేవాదిదేవ
రొలిలాం రొల్లాం రె॥

తాం తక తక। రొల్లిల్లాం। తద్ధిమి తద్ది తక ధరికిటతక
ధీంగుణాంగు తక। తళాంగు తకధిమి తక్కిణాం।
తకకిణాం। కిటతరి। తక ధళాంగు
ధిణకు తకధిత్తా। రొలిలాం రొల్లాం రె॥

౭. త్రికాలస్వరం

పారిగ గారిస। రిగప పామ్మగ। గపధప పానిసీ।
రీసరీస ధాపమగ। పధపా నిధ పధని।
పధధప మగరిగ। సరిగ పామాంగ।
పధనిధ ధాప మాగ రిరిస। రొలిలాం రొల్లాం లే।
తాహంగతక ఝుణుతాం। కిటతక తరి ఝుణుతాం,

౮. పదాభినయముదరువు

సావేరి - ఆది

దేవ దేవేశ నన్నేప్పుడు। గావు మహేశ।
కాముని బోరిగొన్న సామివి నీవా। దారు
కావన జనులకు గాముడె వీవా॥

౯. వర్ణ త్రికాల సొల్లు

ధిమిధిమికిట। తక ఝుణు తతకిట।
కిటతరి కిటత ధిమిత తక ఝుణు।
ఝుణుత ధణ తకతక। కిణ తకధిమి।
తకధికి తక। తోంగతక దధింగిణతోం॥
రొలిలాం రొల్లాం॥

౧౦ 'పాదనకాండ్లు' సలాము పదము*

సల్లాము సల్లాము సల్లాముకే మాకీ
....
జనులను రక్షించు సాహేబు నీవే
మాడా మాకెల్లా బడే సులతాను నీవే
అడా యీడా నుండు అల్లావు నీవే
మరుమని గొట్టిన మహారూడు నీవే। అరె।
గరము ఖాణ జేసిన కరతారు నీవె
అబ్బవు నీవె మా అబీబు నీవె

[ఇం దుదాహరింపబడిన మోహారం మొదలైన వాని గురించి నా కెట్టి పరిజ్ఞానమును లేదు. అందు లకే వాని తత్త్వము గురించి వ్యాఖ్యానింప జాలనైతిని. శాస్త్రవేత్తలకు పెద్దల పరిశీలన కుపయోగపడునని యుదాహరించితి నంతే]

విశేషములు : ఇం దాయిత్తనుమ నింకొక సంగీత శాస్త్ర ప్రక్రియ ఏదిక పేర్కొనబడినది కాని యుదాహరింపబడలేదు. వనసిద్ధితోగి ప్రసంగ సందర్భ మున మరాఠీ భాషలో దరువులు గలవు. ఈ గ్రంథము 'భువనాట్యశాస్త్ర సైఖరులను మించునట్టిది' యని కలదు. ఇది శహాజీ నాటకములవలెనే 'ఉదార వేష భాషా భూషితంబగు'నట్టి దనియు పేర్కొనబడినది. శహాజీ యితర కృతులు కొన్నిటియందువలె నిందును అవతారికలో సూత్రధార ప్రసంగము గ్రంథకర్తృ ప్రశస్తి గలదు. అందుండి ఇట పేర్కొనదగిన శహాజీ విశేషణములు : "కలిత సంగీత తాన శ్రుతి స్వరస్థాన రాగాంగ గానక్రియా స్థాయి గమక ప్రబంధ సహిత గాయక గుణ తతానద్ధ ఘనసుషిర గాత్రభేద క్రియా గ్రహజాతి మార్గతాళ దేశితాళ తత్త్వజ్ఞుండును, సర్వగుణ ధరిత సకలభాషా చతుర్విధ సాహితీ నిర్వాహ కుండు..." ఆ విశేషణములకు ప్రమాణభూతములుగా నున్న దీ ప్రబంధసందర్భము ఇట్టి కృతులం దిప్పటి కొక్కటియు ముద్రితము గాకుండుట మిగుల శోచనీయము

---

* ఇందిందరు మ్లేచ్ఛకుల దేవతలు పేర్కొనబడుట చూడ పాదనకాండ్లనగా సాయబు నట్టువ కాండ్రని యూహింపవలెను.

కోయిల

శ్రీ రాయప్రోలు సుబ్బారావు

౧

వచ్చావె కోవెలా! పచ్చికొమ్మల దరికి
వచ్ఛందముల నాడి కచ్చించి కవ్వింప
వచ్చావె కోవెలా! పచ్చికొమ్మల దరికి—
పచ్చగిల్లిన మరుల పల్లవింపగ తరులు
వన్నె లద్దిన వసుధ పమిటికొంగుల నంటి
వచ్చావె కోవెలా!...
మావి మోవిని కొఱికి మత్తిల్లి మైమఱచి
రంగనాథునిమీద రాగాలు తీయగా
వచ్చావె కోవెలా!...
ఇచ్చకాల పదాలు గ్రుచ్చి కామస్వామి
మచ్చికల కోవెలకు తెచ్చావె కాన్కగా
వచ్చావె కోవెలా!...
బాలలను మురిపింతు పడుచులను వెఱపింతు
దరహాసమో మెఱయు పరిహాసమో కురియు
వచ్చావె కోవెలా!...
పదినెలలు కనరాక పల్లెత్త కెసవోయి
పుట్టింట గయ్యాళి పోకిళ్ల చూపగా
వచ్చావె కోవెలా!...
పలుకవే కోవెలా పదును తేనెలు చింద
చెప్పవే సిగ్గడచి చిన్నమంతటి మాట
వచ్చావె కోవెలా!...

మధువు కన్నెరికమో మరులు గొల్పెనో నిన్ను
నీ పిలుపుతో మావి నిలువెల్ల పూచిందో
వచ్చావె కోవెలా పచ్చికొమ్మల దరిసి.

౨

ఎన్ని నెలలాయెనే యెలరాణి కోయెలా!
ని న్నుంచుకొని రెవరు నీ పాటలకు మురిసి
ఎన్ని నెలలాయెనే......
తుంబురుడు శ్రుతిచేసి తోడిరాగం బె త్తి
ఆలకింపు మటంచు యాచింప నాగావా
ఎన్ని నెలలాయెనే......
నారదుడు తన వీణె దారాలు చిక్కుపడ
సవరించుకొనుదాక స్వరజతులు పాడావా
ఎన్ని నెలలాయెనే......
వార్థకంబున బ్రహ్మ భణితిభంగిమ చెదర
నిను నిలిపెనో శ్రుతుల నిజరూపముల నెఱుగ
ఎన్నాళ్ల కొచ్చావె......
రాధ మెచ్చని పచ్చి రాగాలు దిద్దగా
బాలకృష్ణుడె నిన్ను బ్రతిమాలి నిలిపాడా
ఎన్నాళ్ల కొచ్చావె యెలమంచి కోయిలా
కసటనక తింటాము పసిమామిడి చిగుళ్ల
నేర్పవే యెసవోని నీకలశ్రుతి మాకు
ఎన్నాళ్ల కొచ్చావె యెలరాణి కోయిలా
కొన్నాళ్లు మాదండ కుదిరి కూర్చుండవే.

కలగూరగంప

సయాం, జావా, బర్మా సైనిక వ్యూహాలు

శ్రీ జి. కృష్ణ

సైనిక వ్యూహాలు అనేకం ఉన్నట్లు మన పురాణాలు చెబుతున్నాయి కౌటిల్యుడు మొదలైనవారు వీటిని వర్ణించారు—వీటి ప్రయోజనాలను వివరించారు. కానీ సయాం, జావా, బర్మా దేశాలలో వీటి చిత్రాలు కూడా లభించాయి. భారతదేశంలో ఈ వ్యూహాలతో యుద్ధాలు సాగించటం ఆగిపోయిన తర్వాత, పైమూడు దేశాలలో ఇవి వాడుకంలోకి వచ్చాయని చరిత్ర చెబుతున్నది. అయితే భారతీయ వ్యూహాలకూ, ఈ దేశాల వ్యూహాలకూ కొన్ని తేడా లున్నాయి; పేర్లు ఒకటి అయినా రూపాలు (మొహరింపులు) విభిన్నమైనాయి.


వర్ణనలలో అతిశయోక్తులు ఉండవచ్చు. కాని ఆ మొహరింపు పద్ధతిని చిత్రించి చూపుతే, అది ఎంతవరకు ఆచరణ సాధ్యమో, ఎంతవరకు సానుకూలమో తేలుతుంది.

వ్యూహాలు కొన్ని ప్రత్యక్షపోరాటానికి వచ్చే వారు. చాలాభాగం, మీదపడే శత్రువును కొంతవరకూ రానిచ్చి పట్టివేయడానికే ఉద్దేశించినవి.

అణుయుగంలో ఈ వ్యూహాల ప్రసక్తికి, పురాతన వస్తుప్రదర్శనశాలలకు ఉన్న ప్రాముఖ్యమే ఉంటుంది.

కుట్రలు, గూఢచారి చర్యలు, విధ్వంసాలు, అన్ని దేశాల్లోనూ యుద్ధకాలాల్లో మామూలుగా జరిగే పనులే. కాని వ్యూహాలు కేవలం భారతీయమైనవి మాత్రమే. ఆగ్నేయాసియా దేశాలు ఈ వ్యూహరచనను అనుకరించాయి. అసలు వ్యూహాలు ఆ రాజ్యాలకు వలస వెళ్ళిపోయినట్లు కనిపిస్తుంది.

'తామ్ర పీచాయ్ సొంగ్రాం' అనే సయాం గ్రంథంలో అనేక వ్యూహాల చిత్రాలున్నాయి. బర్మాలో కూడా 'సీనాంగ వ్యూహా' అనే గ్రంథంలో అనేక వర్ణనలు, చిత్రాలు వివరంగా లభిస్తాయి. జావాలోనూ చరిత్రకారులు వ్యూహాల చిత్రాలనూ, యుద్ధ తంత్రాంగ వివరాలనూ సేకరించారు.




మకర వ్యూహం

ఈ గ్రంథాలలో ప్రతి వ్యూహానికీ సరి అయిన వివరణలు చిత్రాలు లభించవు. కొన్నిటిని ఉదాహరణయుక్తంగా వివరించారు.


మకరవ్యూహం : ఇది నదులు దాటేటప్పుడు అవలంబించే పన్నుగడ. తరలి వెళ్ళేటప్పుడు వ్యూహం మకరాకారంలోనే నడుస్తుంది. యుద్ధంలో మాత్రం వంగి అడకత్తెర లాగా మోహరిల్లుతుంది. జావాలో మకరవ్యూహం, లోక ఉన్న ఎండ్రకాయ ఆకారం దాల్చింది. ముందు ఉండే రెండు డెక్కలూ అడకత్తెర లాగా పనిచేస్తాయి. డెక్కల భాగాలలో పదాతిదళాలు, తలలో మంత్రులూ సేనాపతి సామంతులూ ఉంటారు.

చక్రవ్యూహాన్ని కొండలమీదా గుట్టలమీదా పన్నుతారు. చుట్టూ గుట్టలున్న చోటకాదు — మైదాన ప్రదేశంలో ఉన్న కొండలు గుట్టలపై మాత్రమే చక్రాకారపు మోహరింపు.

పద్మవ్యూహం మైదానాల మీద పన్నుతారు — దగ్గర్లో గుట్ట ఉండడం ఉత్తమం. శత్రువును వ్యూహం దాకా రానిచ్చి దెబ్బతీయటానికి ఉద్దేశించిన మోహరింపు. సయాంరాజు నరేసోన్ 1592 లో బర్మా సైన్యంతో పోట్లాడడానికి 'ప్రాతుం పాయుమా' (పద్మవ్యూహం) పన్నాడు. ఉత్తరాన ఒక పెద్ద చెట్టు, దక్షిణాన ఒక గుట్టా ఉన్నాయి. అదను కోసం



సహస్రాంశువ్యూహం



గరుడవ్యూహం

కాచుకొని కూర్చున్నారు. ఇంతలో సయాంసూధ చారులను తరుముకుంటూ బర్మాసైన్యాలు వచ్చి, సుడిగా పద్మవ్యూహంలో చిక్కుపడ్డాయి. సయాం సైనికులు వారి నందరినీ తుదముట్టించారు. పద్మవ్యూహాన్ని కుంజల వ్యూహం అనికూడా అంటారు. మరి సయాం గ్రంథం చూపే (ప్రాతువ్యూహ) బొమ్మ వికసిత పుష్పాకారంలో గాక మొగ్గలాగా ఉంది. పద్మవ్యూహంలో వ్యూహాముఖం, పార్శ్వాలు కేంద్రం - అన్నీ క్రిక్కిరిసి ఉంటాయని చెప్పుతారు.

క్రోడవ్యూహం — ముందు మూడు గడుల్లో పదాతిదళాలు — వెనక శ్రేణులుగా ఐదేసి గడుల చొప్పున ఇతర సైన్యాలు (అంచుల్లో బల్లెములుగల దళాలు, మధ్యన సేనాపతి) — చివరకు వెనక మూడు గడుల్లో బల్లెములున్న దళాలు. ఇది చాలా శక్తివంతమైన పన్నుగడ.

ఈ క్రింద ఇచ్చిన వివరణ వ్యూహాల్లో చూపిన సంఖ్యల ప్రాముఖ్యాన్ని తెలుపుతుంది.

1. సేనాపతి.
2. ముఖ్య సైన్యం.
3. పదాతి రక్షక దళాలు.
4 డాలులు, శూలములు ధరించిన పదాతిదళాలు
5. పదాతులు (ఆయుధాలు అప్పటి కప్పుడు నిర్ణయించుతారు)
6. వివిధమారణాస్త్రాలుగల విలుకాండ్ర పదాతి దళాలు.
7. పదాతి దళాలు-శూలధారులు.
8 పదాతి దళాలు-శూలములు, ఖడ్గములు గలవారు.
9. పదాతులు-డాలులు, కృపాణములుగలవారు.
10. విలుకాండ్రు.
11. అశ్వికదళాలు—సవ్యాపసవ్యముల ప్రయోగింపదగినవారు.
12 అశ్వికదళాలు-ఖడ్గపాణులు.
13 గజదళం.
14. గజదళం-శూలములు ధరించిన ఆరోహకులు గలది.
15. అగ్రగామిదళం.
16 పుచ్ఛబలం.
17. మూలబలాలు (Reserves)
18. అస్త్రదళం.
19. శతఘ్నిదళం.
20. రథికులు.

ఛందోదర్పణము: కొన్ని విశేషములు

శ్రీ భట్టాచార్య

అనంతుఁడు ప్రాచీనాంధ్రకవులలోఁ బ్రసిద్ధుఁడైన లాక్షణికకవి. ఈతనికి సాహిత్యలోకమునందు ఒక ప్రత్యేక స్థానము కలదు. ఈ మహాకవి భోజరాజీయము, ఛందోదర్పణము, రసాభరణము అను మూఁడు విలక్షణ గ్రంథములు రచించియున్నాఁడు (1) భోజరాజీయము పద్యకావ్యము (2) ఛందోదర్పణము లక్షణ గ్రంథము (3) రసాభరణము అలంకారశాస్త్రము.

అప్పకవీయము తరువాత చెప్పుకొనదగిన ఛందశ్శాస్త్రములలో ప్రసిద్ధివందినది యనంతుని ఛందోదర్పణము. దీనివెనుక బయలుదేరిన లక్షణ గ్రంథకర్తలందఱు నీ గ్రంథము నుదాహరించినవారే. కవిచింతామణి కాక ఛందోదర్పణమును వ్రాసిన వెల్లంకి తాతంభట్టు, కవి సంజీవని వ్రాసిన ముద్దరాజు రామన సులక్షణసారము వ్రాసిన లింగముగుంట తిమ్మన అప్పకవీయము రచించిన అప్పకవి మున్నగు సుప్రసిద్ధ లాక్షణికులెల్లరు అనంతుని పేర్కొనినవారే. పేర్కొనుటయే కాక తిమ్మకవి, అప్పకవి మున్నగువారు తమ లక్షణ గ్రంథములందు వాయా విషయములను, ఆయా పద్యములను జేర్చికొనియుండిరి. దీనినిబట్టి యనంతుని ఛందోదర్పణ మెట్టి యున్నతస్థానమును బొందియున్నదో తెల్లము గాగలదు.

ఇట్టి ప్రశస్త లక్షణగ్రంథమును తొలుదొలుత శ్రీ వావిళ్ళవారు శ్రీ గిడుగు వెంకటసీతాపతి గారి విపుల పీఠికతో 1921 సం॥ ప్రకటించియుండిరి. తరువాత వావిళ్లవారే గిడుగువారి, నిడుదవోలు వెంకటరావు

గారి విపుల పీఠికలతో 1947 లో పునర్ముద్రణము గావించియుండిరి.

ఈ యుభయుల పీఠికలతో నున్న ఛందోదర్పణమును ఆంధ్ర యూనివర్సిటీవారు భాషాప్రవీణ ప్రిలిమినరీ పరీక్షకు పాఠ్యగ్రంథముగా 1948 సం॥నుండి పెట్టిరి.

ప్రథమ ముద్రణమునందలి కొన్ని తప్పులు ద్వితీయ ముద్రణమునందు సవరించి ప్రకటించియున్నప్పటికి విశేషముగా నింకను నందు దోషములు గన్పట్టుచున్నవి. లాక్షణిక గ్రంథములు చక్కగాఁ బరిష్కరించి దోషరహితముగాఁ బ్రకటించనియెడల చదువరులు చాల భ్రాంతిపడుదురు. ఇట్టి దోషములు మన యాంధ్రగ్రంథములందు విశేషముగాఁ గనిపించుచుండును. హిందీ, ఇంగ్లీషు మొదలైన యాంధ్రేతర లక్షణ గ్రంథములందు మచ్చునకొక్కటియు దోషము కనిపింపదు. ఇందుకు కారణము పరిశీలనాభావమనియే చెప్పవలయును. గ్రంథముద్రాపకులు లక్షణ గ్రంథములైనను ముఖ్యముగ సరియగు ఉద్దండపండితులచేఁ జక్కగాఁ బరిష్కరింపఁజేసి ప్రకటించుట బాగుండును.

అనంతుని ఛందోదర్పణమును గూర్చి పండిత ప్రకాండులు కొందఱు పరిశ్రమచేసి వినూత్న విషయములు వెలువరించి యాదర్పణమునకు మెఱుగు పెట్టిరి. కాని కొన్నిమాత్రము దోషభూయిష్ఠముగానే యున్నవి. మేమీ ఛందోదర్పణమును విమర్శనాదృష్టితో బరికింప కొన్ని నిగూఢవిషయములు పొడకట్టినవి. వానినెల్ల వివరింపఁ బూనుకొంటిమి. మే మాయా విషయముల వివరించుపట్ల తత్సంబంధ పూర్వవిమర్శకులను గూడ దృష్టియందు బెట్టుకొని రచించుచుందుము.

ఛందోదర్పణములు రెండున్నవి. ఒకటి అనంతామాత్య కృతము. రెండవది వెల్లంకి తాతంభట్టు కృతము. దీనినిగూర్చి శ్రీ నిడుదవోలు వెంకటరావుగారును ద్వితీయ ముద్రణ పీఠికయందుఁ దెలిపియున్నారు. ఇఁక రావూరి దొరసామి శర్మగారు "అనంతామాత్య కృతమగు ఛందమునకు ఛందోదర్పణమని, అనంతుని ఛందమని రెండు పేరులు గలవు. అట్లున్నను గొందఱవి భిన్నములని భ్రమపడుచుండిరి. అప్పకవీయమున పూర్వ గ్రంథనామ సంగ్రహమున 'అనంతామాత్య ఛ్ఛందంబును, ఛందోదర్పణంబును' అని పృథక్కుగా లిఖింపఁబడియున్నది. ఇది లేఖక ప్రమాద జనితంబు గానోవు. ఇవి రెండును నొక్కటియే యని యెఱుంగ వలయును" అని వ్రాసిరి. అప్పకవి గ్రంథములో "అనంతామాత్యచ్ఛందంబును, ఛందోదర్పణంబును" అని యుండుట లేఖక ప్రమాద జనితంబు కాదు. అయ్యది యప్పకవి స్వయముగా వ్రాసినదియే. లోకములో నిద్దఱి పేరులు ఒకటియైయున్నపుడు గుర్తించుటకు ఒకని పేరు ముందు వాని తండ్రి పేరుంచుట ప్రసిద్ధము. ఒకే గ్రంథమును అనేకులు వ్రాసినపుడు తద్రచయితల పేరులు ముందుంచుటయు నాచారమే. అట్లే వెల్లంకి తాతంభట్టు ఛందోదర్పణమును, అనంతుని ఛందోదర్పణమును వేరుచేయుటకు అనంతామాత్యచ్ఛందమని చెప్పబడినది. అంతియేకాని ఆ రెండు గ్రంథములు ఒకటి కాదు.

—: త్రిప్రాసము :—

గీ॥ సంఖ్యఁబలుకు త్రికారంబుఁ జమఁదకార
సద్యుక్తమై త్రికార ప్రాససంజ్ఞ గలిగి
యత్రి విక్రముఁ డధియాప్రదాత్రియనఁగ
వా త్రిపథ గోజ్జ్వలులు విష్ణుధర్త్రులనఁగ.

ఛందో: ప్ర. ఆ. ప 45

అని త్రిప్రాసము ననంతుఁడు చెప్పియున్నాఁడు. సంఖ్యను జెప్పనట్టి 'త్రి' అనునది తకారముతో సమానమై ప్రాస చెల్లువనియు నది త్రిప్రాసమని చెప్పబడు ననియు గలదు. మొదటి రెండుపాదములు త్రిప్రాస లక్షణముఁ జెప్పినవి. దీని కుదాహరణముగా మూఁడు నాలుగుపాదములు తీసుకొనబడినవి (మూఁడవ పాదమునందు 'అత్రి' అని యున్నది. 'అత్రి' అని యుండవలయును) అత్రి—(ప్ర) దాత్రి. వాత్రి—ధర్త్రి" అని ప్రాసలు చెల్లినవి. ఇక ఈ త్రికారము తకారముతో నెట్లు ప్రాసచెల్లునో హేతువు చెప్పుచున్నాఁడు. చూడుఁడు.

"ఈ త్రికారంబునకుఁ దృతీయ మొసఁగఁగ్రింది
రేఫ సంప్రసారణమున బుత్వమునఁ దృ
తీయ యగు, నీ త్రికార మర్థించి చూడ
నా తకారంబునకుఁ బ్రాసమయ్యెనదట.

ఛందో ప్ర. ఆ. 46 ప.

ఈ పద్యమునందలి మొదటిపాద మచ్చు పుస్తకమునందు నట్లే యున్నది. కాని యట్లున్న అది యర్థరహితము కాగలదు. ఇందున్న పొరపాటును గుర్తింపక శ్రీ రావూరి దొరసామి శర్మగారు.

"ఈ త్రికారంబునకుఁ దృతీయ మొసఁగఁగ్రింది— ఇందు షష్ఠీ విభక్తి కువర్ణకము పరంబగునపుడు నగాగమము నిత్యముగా వచ్చి 'త్రికారంబునకు' అని యుండవలయును గాని నగాగమము చేర్చిన గణభంగము సంభవించును. "నకా" అని చింతామణి. కొందరు భారతమున సభాపర్వమున "సహదేవనకుల వాసవసుతి